RNI No. APTEL/2006/17880
www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:234 హైదరాబాద్, శనివారం, 22 మార్చి 2025 పేజీలు: 12 వెల: 1.00

## తెలంగాణలో భారీ వర్షం.. వడగళ్ల వాన

ౕరీంనగర్: తెలంగాణలోని పలు జిల్లాల్లో ఇవాళ (శుక్రవారం) ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడగా..




సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదైన ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోనే ఈ అకాల వర్షాలు కురిశాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పద్దారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల్లో వడగండ్లు పడ్డాయి. ధర్మపురి మండలంలో ఈదురుగాలులతో కూడిన వానకురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నేరేళ్ల, తుమ్మేనాల, ధర్మపురి, తిమ్మాపూర్‌తో పాటు పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోనూ భారీ వర్షం పడింది. భారీ వర్షాలు పడటంతో రైతులకు కొంతమేర నష్టం కలిగింది.

%తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. మార్చి 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు వడతాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వర్షాల కారణంగా.. వేడి తీవ్రతతో పాటు వడగాలులు సైతం తగ్గే అవకాశాలు ఉన్నాయి. దీంతో రెండు రోజుల పాటు ప్రజలకు వడగాలుల నుంచి ఉ పశమనం పొందనున్నారు

## రేవంత్‌తో హరీష్‌రావు భేటీ ..





హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇవాళ(శుక్రవారం) అసెంబ్లీలో మాజీమంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే పద్మారావు కలిశారు. అలాగే మాజీమంత్రి మల్లారెడ్డి కుటుంబ సమేతంగా సీఎం రేవంత్‌ను కలిశారు. మెడికల్ కళాశాల సీట్ల పెంపు కోసం సీఎంను కలిసినట్లు మర్రి రాజశేఖరరెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై హరీష్‌రావు చర్చించారు. ఈ భేటీ అనంతరం మీడియాతో హరీష్‌రావు మాట్లాడారు. సీతాఫల్‌మండి జూనియర్, డిగ్రీ కళాశాల విషయంలో పద్మారావుతో కలసి సీఎం రేవంత్‌ను కలిశానని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ సీతాఫల్‌మండి కళాశాలకు రూ.32కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. కేసీఆర్ కేటాయించిన పనులను రేవంత్ ప్రభుత్వం అర్ధాంతరంగా ఆపేసిందని హరీష్‌రావు చెప్పారు.

కాంగ్రెస్, బీజేపీ పార్టీల 'బడే భాయ్.. చోటే భాయ్ బంధం' అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి బయటపెట్టారని అన్నారు. కేంద్రం తెలంగాణకు నిధులు ఇవ్వకపోయినా.. తన ప్రసంగంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పల్లెతు మాట అనలేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీకి తాము సమాన దూరంగా ఉంటామని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీది తెలంగాణ ప్రజల పక్షమని తెలిపారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి కాంగ్రెస్ కంటే.. సభలో బీఆర్ఎస్‌ను ఎక్కువ టార్గెట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డిపై తాను మాట్లాడినంత గట్టిగా ఎవరూ మాట్లాడలేదని చెప్పారు. తాను రేవంత్ బట్టలు విప్పితే.. మహేశ్వరరెడ్డి రేవంత్‌ను కవర్ చేశారని అన్నారు. కాంగ్రెస్ పిలిస్తే పోవటం లేదని డీఎంకే నేతల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెన్నైవెళ్తున్నారని తెలిపారు. దక్షిణాదికి జరుగుతున్న అన్యాయంపై మెదట మాట్లాడిందే బీఆర్ఎస్ అని గుర్తుచేశారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ పార్టీకి ఓ స్టాండ్ లేదు... క్లారిటీ లేదని హరీష్‌రావు విమర్శించారు.

## సీబీఐ అదుపులో మెదక్ సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ రవి రాజన్

మెదక్: మెదక్ సెంట్రల్ జీఎస్టీ కార్యాలయంలో సీబీఐ అధికారులు సోదాలు జరిపారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జరిపిన సోదాల్లో పలు దస్త్రాలను పరిశీలించారు. మెదక్ జీఎస్టీ సూపరింటెండెంట్ రవిరాజన్ అగర్వాల్‌పై ఆరోవణల నేవథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. సోదాల అనంతరం రవి రాజన్ అగర్వాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.




## వచ్చే ఏడాది ఇదేరోజుకి నక్సల్స్‌ని ఏరేస్తాం

న్యూఢిల్లీ: అంతర్గత భద్రత పటిష్టతకు బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, 2026 మార్చి 21వ తేదీ నాటికి దేశంలో పూర్తిగా నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా అన్నారు.



జమ్మూకశ్మీర్‌లో తీవ్రవాదం, దేశంలో నక్సలిజంతో ఎదురవుతున్న సవాళ్లు, మాదకద్రవ్యాల బెడద, ఈశాన్య ప్రాంతంలోని సమస్యలపై కేంద్రం తీసుకుంటున్న చర్యలపై రాజ్యసభలో శుక్రవారంనాడు జరిగిన చర్చకు అమిత్‌షా సమాధానమిచ్చారు. బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ హయాంలో నక్సల్స్ సమస్య నుంచి దేశానికి విముక్తి లభించనుందని చెప్పారు. 2026 మార్చి 21వ తేదీ నాటికి దేశాన్ని నక్సల్స్ బెడద నుంచి విముక్తి కల్పించడాన్ని తాము ఒక బాధ్యతగా తీసుకున్నామని చెప్పారు. నక్సలిజం ఒక రాజకీయ సమస్య మాత్రమేనని భావించే వారిని చూస్తే తనకు జాలి కలుగుతుందన్నారు.

'2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు గత ప్రభుత్వం నుంచి సంక్రమించిన అనేక సమస్యలు దేశాభివృద్ధికి అవరోధాలుగా నిలిచాయి. దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశంలో అభివృద్ధి ముదుకు సాగలేదు. వీటిలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం, లెఫ్టిస్ట్ ఇన్‌సర్జెన్సీ, ఈశాన్య ప్రాంతంలో చొరబాట్లు వంటివి ఉన్నాయి. ఈ మూడు అంశాలతో 92,000 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మోదీ అధికారంలోకి వచ్చాక ఈ మూడింటి బెడద నిర్మూలించేందుకు చర్యలు చేపట్టింది" అని అమిత్‌షా అన్నారు. సరిహద్దులతో పాటు దేశ అంతర్గత భద్రతను పరిరక్షించేందుకు వేలాది మంది రాష్ట్ర పోలీసులు, కేంద్ర పారామిలటరీ జవాన్లు ఆత్మబలిదానాలు చేశారని, వారి సేవలు మరువలేనివని చెప్పారు.

370 అధికరణ రద్దు తర్వాత..

జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను కేంద్రం రద్దు చేసిన తర్వాత ఉగ్రవాదంతో యువకుల ప్రమేయం దాదాపు కనుమరుగైందని చెప్పారు. పదేళ్ల క్రితం టెర్రరిస్టులు మరణిస్తే వారిని కీర్తిస్తూ అంత్యక్రియల ఊరేగింపులు జరిగేవని, ఇప్పుడు టెర్రరిస్టులు హతమైతే వారిని అక్కడికక్కడే పూడ్చిపెడుతున్నారని వివరించారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు అనుభవిస్తూ వచ్చిన టెర్రరిస్టుల బంధువులను ఉద్యోగాల నుంచి తొలగించి గట్టి సందేశం ఇచ్చామని చెప్పారు. ఇప్పుడు కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని, థియేటర్ల తెరిచి ఉ ంటున్నాయని, పెట్టుబడులు, స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య పెరిగిందని చెప్పారు.

ఉగ్రవాదం వల్ల మరణాలు 70 శాతానికి పైగా తగ్గాయని అమిత్‌షా చెప్పారు. జి-20 సదస్సు, ముహర్రం ఊరేగింపు జరిగినట్టు వివరించారు. 2019 నుంచి 2024 వరకూ జమ్మూకశ్మీర్‌లో 40,000 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయని, 1.51 లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించామని, ప్రోత్సాహకరమైన పారిశ్రామిక విధానంతో రూ.12,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, రూ.1.1 లక్షల కోట్లు విలువచేసే ఎంఓయూలపై సంతాకలు జరిగాయని అమిత్‌షా వివరించారు.

## అసమానత్వం, వివక్షపై నిజం నిగ్గుతేలాలి.. కులగణనపై మళ్లీ రాహుల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: కులగణన డిమాండ్‌ను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి లేవనెత్తారు. అసమానత్వం, వివక్షపై



నిజం నిగ్గుతేలాలంటే కులగణన ( కీలకమైన ముందడుగు అవుతుందని చెప్పారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ మాజీ చైర్మన్, విద్యావేత్త సుఖ్‌దేవ్ థోరట్‌తో తాను ముఖాముఖీ జరిపిన ఒక వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ పోస్ట్ చేశారు.

%"ప్రముఖ విద్యావేత్త, ఆర్థికవేత్త, దళిత అంశాలపై నిపుణుడు, తెలంగాణలో కులగణనపై అధ్యయన కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ థోరట్‌తో సమగ్రమైన చర్చ జరిపాను. మహద్ సత్యాగహపైన, అడ్మినిస్ట్రేషన్, విద్య, బ్యూరోక్రసీ, వనరుల విషయంలో దళితులు జరుపుతున్న పోరాటంపైన చర్చించడం జరిగింది" అని రాహుల్ తెలిపారు. ఇది సమానత్వం, గౌరవానికి సంబంధించిన పోరాటమని, 98 ఏళ్ల క్రితం మొదలైన ఈ పోరాటం ఇప్పటికీ కొనసాగుతోందని అన్నారు. అసమానత్వం, వివక్షపై నిజానిజాలు బయటపడాలంటే కులగణన అనేది కీలకమైన అడుగు అవుతుందని, దీనిని వ్యతిరేకిస్తున్నా వారు మాత్రం నిజాలు బయటపడరాదని కోరుకుంటున్నారని అన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ కల ఇప్పటికీ అసంపూర్తిగానే మిలిగిపోయిందని, ఇది గతానికి చెందిన పోరాటం మాత్రమే కాదని, ఇప్పటికీ పోరాటం సాగుతోందని, పూర్తి శక్తియుక్తులతో అంతా కలిసి పోరాడాలని రాహుల్ అన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ మండిపాటు

రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ తప్పికొట్టింది. రాహుల్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ ఆశ్రితపక్షపాతం, ఫ్యూడల్ మనస్తత్వాన్ని చాటుతోందని ఆ పార్టీ నేత సీఆర్ కేశవన్ అన్నారు. ప్రజాజీవితంలో కఠోర శ్రమతో ఎంతో పేరు తెచ్చుకున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నేతలను నిరంతరం అవమానపరచే చరిత్ర కాంగ్రెస్‌దని విమర్శించారు.

## కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం

బెంగళూరు: ప్రభుత్వ కాంట్రాక్టులతో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును కర్ణాటక (పభుత్వం శుక్రవారంనాడు ఆమోదించింది. అధికార-ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం, ఉద్రిక్తతల మధ్య ప్రభుత్వం ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించిన బీజేపీ ఎమ్మెల్యేలు బిల్లు ప్రతులను చించేసి స్పీకర్‌పై విసిరారు. బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, చట్టబద్ధంగానే దీన్ని ఎదుర్కొంటామని హెచ్చరించారు.

తొలుత ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును రాష్ట్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ సభలో ప్రవేశపెట్టారు. దీనిపై బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ స్పీకర్ పోడియం వైపు దుసుకెళ్లారు. బిల్లు ప్రతులను చించి స్పీకర్ యూటీ ఖడెర్ సీటుపైకి విసిరారు. దీంతీ స్పీకర్ తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించిన 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలను ఆరు నెలల పాటు సస్పెండ్ చేశారు. దీనిని బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్రంగా ప్రతిఘటించడంతో మార్షల్ వారిని అసెంబ్లీ బయటకు తీసుకెళ్లారు. దీనికి ముందు హనీట్రాప్ అంశం అసెంబ్లీని కుదిపేసింది. జాతీయ స్థాయి నాయకులు సహా, మంత్రులు, ఎమ్మెల్యేలు మొత్తం 48 మంది రాజకీయ నాయకులు హనీ ట్రాప్ ఉచ్చులో పడ్డారని అసెంబ్లీలో సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న సంచలన ప్రకటన చేయడం సంచలనమైంది.



భారత శక్తి
VOICE OF INDIAN

## యాంటీ ఇండియా టెర్రరిస్టుల గుండెల్లో టెర్రర్

ఎప్పుడు ఎవడొస్తాడో తెలియదు! ఎలా వేసేస్తాడో అర్థం కాదు! వారి చావు ఎంత ఘోరంగా ఉంటుందో.. అస్సలు ఊహించలేరు. వారి నేల మీదే.. క్షణాల్లో ఖతమైపోతున్నారు. టెర్రర్ ఎటాక్స్‌ని ప్లాన్ చేస్తున్న టెర్రరిస్టులందరి గుండెల్లో ఇప్పుడు టెర్రర్ మొదలైంది. పాకిస్థాన్ ఉగ్రవాదులకైతే.. కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఎక్కడున్నా.. ఎంత రహస్య ప్రదేశంలో దాక్కున్నా.. వారి చావు వారిని వెతుక్కుంటూ వచ్చేస్తోంది. ఒక్కొక్కరి ప్రాణాలు తీసేస్తోంది. గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో వరుసగా హతమవుతున్నారు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు. మొన్నటికి మొన్న కుల్ భూషణ్ జాదవ్ కిడ్నాప్ వెనకున్న మతపెద్ద హతమయ్యాడు. ఇప్పుడు.. 26/11 ముంబై దాడుల ప్రధాన సూత్రధారి అయిన హాఫీజ్ సయీద్ మేనల్లుడు.. అబూ కతల్ పాకిస్థాన్‌లోనే ఖతమయ్యాడు. కొన్నాళ్లుగా గుర్తుతెలియని వ్యక్తులు అనేకమంది భారత వ్యతిరేక శక్తులను ఖతం చేస్తున్నారు. లేటెస్ట్‌గా.. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా వ్యవస్థాపకుడైన హాఫీజ్ సయీద్ మేనల్లుడు.. అబూ కతల్ హతమయ్యాడు. తన అనుచరులతో కాన్వాయ్‌లో వెళ్తుండగా.. ఒక్కసారిగా గుర్తు తెలియని వ్యక్తులు బుల్లెట్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో అబూ కతల్‌తో పాటు అతని బాడీగార్డ్స్ కూడా చనిపోయారు. నిత్యం పాకిస్థాన్ ఐఎస్ఐ నీడలో సంచరించే అబు కతల్‌ని.. ఇలా లేపేయడం హాట్ టాపిక్‌గా మారింది. హాఫీజ్ సయీద్, అబూ కతల్ హిట్ లిస్టులో ఉన్నారని ఐఎస్ఐకి తెలుసు. వాళ్లను.. పదేళ్లుగా జాగ్రత్తగా కాపాడుతూ వస్తుందనే సమాచారం ఉంది. అబూ కతల్‌కి ఐదు మారుపేర్లు ఉన్నాయి. హాఫీజ్ సయీద్.. లష్కరే తోయిబాకి చీఫ్ అయినా.. తన మేనల్లుడైన అబూ కతల్‌ని చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా నియమించాడు. ప్లాన్ హాఫీజ్ వేస్తే.. దానిని అమలు చేసేది అబు కతల్.లష్కరే తోయిబా ఉగ్రవాది అబూ కతల్.. ఇండియాలో మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా ఉన్నాడు. 2023లో రాజోరి జిల్లాలో జరిగిన ఉగ్ర దాడి, 2024 రియాసి జిల్లాలో జరిగిన బస్సు దాడిలో పాల్గొన్నాడు అబూ కతల్. ఇవి మాత్రమే కాదు జమ్ముకశ్మీర్‌లో అనేక దాడులకు ఇతనే బాధ్యుడు. అందువల్ల.. ఎన్ఐఏతో పాటు ఇండియన్ ఆర్మీ, ఇతర భద్రతా సంస్థల హిట్ లిస్టులో ఉన్నాడు. 2024 జూన్ 9న రియాసి జిల్లాలో.. శివకోరి గుహలో ఉన్న శివాలయాన్ని దర్శించుకునేందుకు వెళ్తున్న హిందూ యాత్రికుల బస్సుపై దాడి చేశారు.అబూ కతల్ నాయకత్వంలో జరిగిన ఈ దారుణమైన దాడిలో.. 9 మంది పౌరులు మరణించారు. 40 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఉగ్రదాడి తర్వాత రియాసి జిల్లాలో కొత్త భయాందోళన మొదలైంది. 2023 జనవరిలో రాజోరి జిల్లాలోని దంగ్రీ గ్రామంలో నలుగురు ఉగ్రవాదులు ప్రవేశించి.. పౌరులని లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపారు. ఈ ఉగ్రదాడిలోనూ అబూ కతల్ పాత్ర ఉంది. ఈ దాడిలో ఇద్దరు పిల్లలు సహా ఏడుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు.జమ్ముకశ్మీర్ సరిహద్దు గ్రామాల్లోని యువకులకు డబ్బు ఆశ చూపి.. లష్కరే తోయిబాలోకి రిక్రూట్ చేస్తున్నాడు అబు కతల్. అదొక్కటే కాదు.. మైనారిటీ సమాజానికి చెందిన పౌరులని, భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని ఎటాక్స్ చేయడంలో అబూ కతల్ పాత్ర ఉంటుంది. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడం, బోర్డర్ దాటి చొరబడటం, పౌరులని లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం, అశాంతి సృష్టించేందుకు ప్రయత్నించడం లాంటివన్నీ.. అబూ కతల్ కనుసన్నల్లోనే జరుగుతుంటాయి. వీటన్నింటిపై లోతైన దర్యాప్తు తర్వాత ఐదుగురు నిందితులపై ఎన్ఐఏ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. వీరిలో ముగ్గురు పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా కమాండర్లు ఉన్నారు. అందులో.. అబూ కతల్, సైఫుల్లా అలియాస్ సాజిద్ జట్, మహమ్మద్ ఖాసిం ఉన్నారు.జమ్ముకశ్మీర్‌ని అస్థిరపరిచేందుకు దాడులు ప్లాన్ చేయడం, పాకిస్థాన్ నుంచి వచ్చే సూచనల్ని అమలు చేయడం లాంటివి చేయడంలో ఇతనిదే కీలకపాత్ర. అలాంటి.. అబూ కతల్ ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో హతమవడంతో.. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదంపై పోరాటంలో.. ఓ ముఖ్యమైన పరిణామానికి నాంది పలుకుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయ్. పాకిస్థాన్ టెర్రరిస్టులకు, ఖలిస్థాన్ వేర్పాటువాదులందరికీ.. ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తుల భయం పట్టుకుంది. ఇదంతా.. కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. కొన్ని నెలలుగా నడుస్తున్న వ్యవహారమే. ఇప్పటికే.. ఈ తరహాలో చాలా మంది హతమయ్యారు. ఇక ముందు కూడా ఇది కొనసాగుతుందనే సంకేతాలిస్తున్నారు.ఊరు లేదు.. పేరు లేదు.. స్ట్రాంగ్ ఎవిడెన్స్ లేదు. ఉగ్రవాదులను ఏరిపారేస్తున్న గుర్తు తెలియని వ్యక్తుల జాడ కూడా తెలియట్లేదు. ఎవరు చంపేస్తున్నారో అస్సలు అర్థం కావట్లేదు. ఇదంతా.. మూడు నాలుగేళ్లుగా జరుగుతున్న వ్యవహారమే. ఇప్పటికే.. ఇలాంటి హత్యలు చాలానే జరిగాయ్. సిరీస్ ఆఫ్ ఈవెంట్స్‌ని చూశాక.. ఇప్పుడిప్పుడే అందరిలోనూ అనుమానం కలుగుతోంది. మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులందరినీ.. ఒకరి తర్వాత ఒకరిని హతమారుస్తున్నారు గుర్తు తెలియని వ్యక్తులు.ముఖ్యంగా.. భారత్‌కు శత్రువులుగా ఉన్న వాళ్లు, ఇండియా హిట్ లిస్టులో ఉన్న వాళ్లంతా.. విదేశాల్లో హతమైపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇలా.. గుర్తు తెలియని వ్యక్తులు దాడులు చేస్తుండటంతో.. చాలా మంది ఉగ్రవాదులు పాకిస్థాన్‌లోని రహస్య ప్రదేశాల్లో దాక్కుంటున్నారు. . లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు, జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు అత్యంత సన్నిహితులైన వాళ్లు కూడా.. గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో హతమయ్యారు. భారత వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న ఎందరో తీవ్రవాదులు, ఖలిస్థానీ ఉగ్రవాదులంతా ఒక్కొక్కరిగా ప్రాణాలు కోల్పోతున్నారు.

# పది నెలలైనా ఇంతేనా

## తమ్ముళ్లలో పెరుగుతున్న అసహనం

గుంటూరు మార్చి 21, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటుతుంది. అయితే ఇప్పటికే క్యాడర్ లో ఒకరకమైన అహసనం కనపడుతుంది. తమకు ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కించడమేంటని క్యాడర్ సూటిగానే ప్రశ్నిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలతో కొందరు కుమ్మక్కై వెనకాడుతున్నారని కూడా తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. తమపై గత ప్రభుత్వంలో తప్పుడు కేసులు నమోదు చేసిన వారిపై ఇప్పటి వరకూ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సోషల్ మీడియా వేదికగా తెలుగు తమ్ముళ్లు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. అయితే చట్ట ప్రకారమే చర్యలకు దిగుతామని చంద్రబాబు పదే పదే చెబుతున్నా తమ్ముళ్లు మాత్రం తొందరపడుతున్నారన్న టాక్ వినపడుతుంది. ఇదిలా ఉండగానే ఎమ్మెల్యేలు కూడా అసహనం వ్యక్తం చేస్తుండటం పార్టీని ఇరకాటంలోకి నెట్టేసింది. తాజాగా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీ వేదికగా చేసిన కామెంట్స్ పార్టీలో కాక రేపుతున్నాయి. యార్లగడ్డ వెంకట్రావు వ్యాఖ్యలను పార్టీ అగ్ర నాయకత్వం సీరియస్ గా తీసుకుంది. ఏదైనా ఉంటే ఇటువంటి విషయాలు అంతర్గతంగా మాట్లాడాలి తప్పించి ఇలా అసెంబ్లీలో మాట్లాడటేమేంటని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అసెంబ్లీలో యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయ్యామన్న ఆనందం లేదని, తమ పనులు ఒక్కటి కూడా జరగడం లేదని, ఎందుకు ఎన్నికయ్యామో కూడా అర్థం కావడం లేదని వెంకట్రావు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. యార్లగడ్డ వెంకట్రావు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కృష్ణా జిల్లా డీసీసీబీ బ్యాంకు ఛైర్మన్ గా పనిచేశారు. ఆ సమయంలో అనేక సంస్కరణలను చేపట్టారు. అయితే ఆయన తర్వాత వైసీపీకి రాజీనామా చేసి యార్లగడ్డ వెంకట్రావు టీడీపీలో చేరిపోయారు. వెంకట్రావు రాజీనామా చేసిన తర్వాత బ్యాంకులో అనేక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. పెద్దయెత్తున అవినీతి జరిగిందని యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి రావడంతో వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. కానీ కొన్ని నెలలు గడుస్తున్నా అధికారులు డీసీసీబీలో జరిగిన అవకతవకలపై విచారణ జరపకపోవడంపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ఉన్నతాధికారుల తప్పిదమా? లేక అగ్రనేతల నిర్లక్ష్యమా? అన్నది తేలకుండా ఉంది. .. ఇది ఒక యార్లగడ్డ వెంకట్రావు మాత్రమే కాదు టీడీపీలో ఉండి గత ప్రభుత్వంలో కేసులు నమోదు చేయించుకుని, జైలుకు వెళ్లి వచ్చిన వారు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. చట్టం పేరుతో కాలయాపన చేస్తూ పోతుంటే క్యాడర్ లో తాము పలచన అవ్వక తప్పదని వారు చెబుతున్నారు. రాయలసీమలోని కొందరు ఎమ్మెల్యేలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మరికొందరు ఎమ్మెల్యేలు కూడా మంత్రుల వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. అయితే తొందరపడవద్దని వరసగా వేధించిన వైసీపీ నేతలపై కేసులు నమోదు చేస్తామని బుజ్జగించి పంపుతున్నారు. దీంతో టీడీపీలో ఇటు క్యాడర్ తో పాటు అటు ఎమ్మెల్యేలు కూడా పెల్లుబుకుతున్న ఆగ్రహంపై నీళ్లు చల్లాల్సిన అవసరం అధినాయకత్వంపై ఉంది.

# అఖిలప్రియ సొంత పార్టీలో శత్రువులు.. బయిట పడేదెలా...

కర్నూలు, మార్చి 21, మాజీమంత్రి అఖిలప్రియ నిత్యం కాంట్రవర్సీకి కేరాఫ్ అడ్రస్ గా ఉంటారు. ఎవరికైనా ప్రత్యర్థి పార్టీల నుంచి శత్రువులుంటారు. కానీ అఖిలప్రియకు మాత్రం శత్రువులందరూ సొంత వాళ్లే. వాళ్లతో ఈమె శతృత్వం పెంచుకుంటుందో లేక అఖిలప్రియతో వాళ్లు విభేదిస్తున్నారో తెలియదు కానీ సొంత పార్టీ నేతలే ఆమెకు ఇబ్బందికరంగా మారారు. ఆళ్లగడ్డ తన సొంత అడ్డా అని భావించిన అఖిలప్రియకు 2019 ఎన్నికల్లో ఓటమి తప్పలేదు. అయితే ఆ ఓటమికి గల కారణాన్ని అఖిల ప్రియ విశ్లేషించుకోకుండా ఈసారి గెలిచిన తర్వాత కూడా అదే పంథాను కొనసాగిస్తుండటంతో పరిస్థితి మారలేదు. తండ్రి, తల్లి కి ఉన్న బంధాలను కావలని తెంచుకున్నట్లే కనపడుతుంది. ఒంటరిపోరు చేయడానికే అఖిలప్రియ ఇష్టపడుతున్నారని స్పష్టంగా తెలుస్తోంది. భూమా శోభానాగిరెడ్డి, నాగిరెడ్డితో అనుచరులు, బంధువులను అఖిలప్రియ ఇప్పటికే దూరం చేసుకున్నారు. సొంత బంధువులను కూడా ఆమె దగ్గరకు రానివ్వడం లేదు. కనీసం వారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అఖిలప్రియ 2014లో తల్లి మరణంతో ఆమె రాజకీయాల్లోకి చిన్న వయసులో అడుగు పెట్టారు. వెంటనే ఏకగ్రీవంగా ఆళ్లగడ్డకు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత తన తండ్రి భూమా నాగిరెడ్డితో కలసి ఆమె టీడీపీలో చేరారు. నాగిరెడ్డి మరణంతో అఖిలప్రియను మంత్రి పదవి వరించింది. అప్పటి నుంచి ఆమె వ్యవహార శైలి మారింది. మంత్రి పదవిలో ఉన్నంత కాలం అయిన వారిని కూడా కాల్చుకుతిన్నారన్న పేరు పొందడంతో 2019 ఎన్నికలలో ఓటమి పాలు కావాల్సి వచ్చింది.. భూమా నాగిరెడ్డికి అత్యంత సన్నిహితుడు ఏవీ సుబ్బారెడ్డితో బద్ధ శత్రుత్వాన్ని పెంచుకున్నారు. బంధుత్వం లేకపోయినా చిన్న నాటి నుంచి మామా అని పిలచే ఏవీతో వైరం ఆమెకు మంచి కంటే చెడు చేసిందనే చెప్పాలి. ఆస్తుల వివాదమే కారణమని చెబుతున్నప్పటికీ, ఆధిపత్య పోరు కోసమేనన్నది అఖిలప్రియను దగ్గర నుంచి చూసిన వాళ్లు చెబుతున్న విషయం. ఏవీతో వైరం చివరకు హత్యలు చేసుకునే వరకూ వెళ్లింది.ఇక అఖిలప్రియ మేనమామ ఎస్.వి. జగన్ తోనూ



వైరం పెట్టుకున్నారు. జగన్ మోహన్ రెడ్డి విజయ డెయిరీ ఛైర్మన్ గా ఉన్నారు. ఆయనను ఆ పదవి నుంచి దించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. దీంతో ఎస్వీ కుటుంబం నుంచి కూడా ఆమెకు మద్దతు కొరవడినట్లయింది. వెంకట్రావు ఓపెన్ అయిపోయారుగా సొంత జిల్లా మంత్రులతోనే... ఇక సొంత జిల్లాలోని టీడీపీ నేతలతోనూ ఆమెకు సఖ్యత లేదు. ఏకంగా మంత్రులతోనే అఖిలప్రియ విభేదాలు పెట్టుకున్నట్లే కనపడుతుంది. మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డిలు ఇద్దరూ అఖిలప్రియకు వ్యతిరేకంగానే ఉన్నట్లు కనపడుతుంది. ఆమె వ్యవహరిస్తున్న తీరును ఇద్దరు మంత్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. వారితో కూర్చోవడం ఇష్టం లేక జడ్పీ సమీక్ష సమావేశానికి తనకు బదులు తన సోదరుడు జగద్విఖ్యాత్ రెడ్డిని పంపడం కూడా వివాదంగా మారింది. మొత్తం మీద అఖిలప్రియ ఏమనుకుంటున్నారో తెలియదు కానీ, నాలుగేళ్లు నా దే రాజ్యం అన్నట్లు వ్యవహరిస్తున్నారని సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారంటే ఆమె పునరాలోచించుకోవడం మంచిదన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

## మూడున్నర కోట్ల జనాభా... నాలుగున్నర కోట్ల మొబైల్ ఫోన్లు

హైదరాబాద్, మార్చి 22,

తెలంగాణలో జనాభా కంటే మొబైల్ ఫోన్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇది ఆధునిక టెక్నాలజీ వినియోగం, రాష్ట్రంలోని కనెక్టివిటీ స్థాయిని సూచిస్తుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ జనాభా సుమారు 3.50 కోట్లు (35 మిలియన్లు)గా ఉంది. అయితే, 2025 నాటికి ఈ సంఖ్య కొంత పెరిగి 3.77 కోట్లు లేదా అంతకంటే ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేయవచ్చు, ఎందుకంటే రాష్ట్ర జనాభా దశాబ్ద వృద్ధి రేటు (2001?2011) 13.58%గా ఉంది. మొబైల్ ఫోన్ సంఖ్యల విషయానికొస్తే, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా తాజా డేటా ప్రకారం, తెలంగాణలో యాక్టివ్ మొబైల్ కనెక్షన్ల సంఖ్య జనాభా కంటే ఎక్కువగా ఉంది. 2023 సెప్టెంబర్ నాటికి తెలంగాణలో 4.5 కోట్లకు పైగా మొబైల్ సబ్‌స్క్రిప్షన్లు ఉన్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఇది జనాభా కంటే సుమారు 20?25% ఎక్కువ.

బహుళ సిమ్ వినియోగం: చాలా మంది వ్యక్తులు ఒకటి కంటే ఎక్కువ సిమ్ కార్డులను ఉపయోగిస్తారు ఒకటి వ్యక్తిగత వినియోగం కోసం, మరొకటి వ్యాపారం లేదా ఇంటర్నెట్ కోసం. ఇది మొబైల్ కనెక్షన్ల సంఖ్యను పెంచుతుంది.

ఇంటర్నెట్ వ్యాప్తి: తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో, ఇంటర్నెట్ వినియోగం చాలా ఎక్కువ. దీని కోసం చాలా మంది డేటా సిమ్‌లను అదనంగా కొనుగోలు చేస్తారు.

వ్యాపార కనెక్షన్లు: ఐటీ హబ్‌గా ఉన్న హైదరాబాద్‌లో వ్యాపార సంస్థలు, కంపెనీలు ఉద్యోగుల కోసం బహుళ కనెక్షన్లను నిర్వహిస్తాయి.

పిల్లలు, వృద్ధులు: జనాభాలో కొంత శాతం (పిల్లలు, వృద్ధులు) ఫోన్‌లను ఉపయోగించకపోయినా, కనెక్షన్ల సంఖ్య వారిని కూడా మించిపోతుంది.

5 కోట్లకు చేరే అవకాశం..

ఈ ట్రెండ్ కొనసాగితే, తెలంగాణలో మొబైల్ కనెక్షన్ల సంఖ్య 5 కోట్లకు చేరవచ్చు, అదే సమయంలో జనాభా 4 కోట్ల లోపే ఉండవచ్చు. ఇది జనాభా కంటే ఫోన్ సంఖ్యలు ఎక్కువగా ఉన్నాయనే వాస్తవాన్ని బలపరుస్తుంది. ఈ ధోరణి భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా కనిపిస్తుంది, కానీ తెలంగాణలో ఐటీ రంగం మరియు అధిక అక్షరాస్యత (66.46% ? 2011, ఇప్పుడు మరింత పెరిగి ఉండవచ్చు) దీనిని మరింత ప్రోత్సహిస్తున్నాయి.

## ఉపాధి లో పది వారాల పెండింగ్ బిల్లుల కు నిరసనగా కూలీల బిక్షాటన....

దేవనకొండ మార్చి 21

ఎర్రటి ఎండలో కష్టం చేసిన పనికి కూలీలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పది వారాల పెండింగ్లో ఉన్న ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు కూలీలు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు స్థానిక అంబేద్కర్ విగ్రహం నుండి భిక్షాటన ఎంపీడీవో కార్యాలయం వరకు నిర్వహించారు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మహబూబ్ భాష అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీరశేఖర్ ,సిఐటియు మండల కార్యదర్శి అశోక్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బజారి, పరమేష్ లు మాట్లాడుతూ పది వారాలుగా చేసిన పనికి కష్టానికి వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని ఎలా కుటుంబాలని బ్రతికించుకోవాలని వారు పేర్కొన్నారు.. పది వారాలంటే దాదాపుగా రెండున్నర నెలల నుండి మూడు నెలలని ఇంతకాలం చేసిన పనికి కూలీలు ఇవ్వకుంటే ఎలా ఎలా అని వారు ప్రశ్నించారు ఉపాధి హామీ పట్ల పేదల పట్ల ప్రభుత్వాలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని ఒకవైపు వలసలు వెళ్ళొద్దని బూటకపు ప్రచారం నిర్వహిస్తూ మరోవైపు ఉపాధి హామీ పనులు ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని వారు ఆరోపించారు గతంలో లక్ష కోట్లకు పైగా ఉన్న బడ్జెట్ ప్రస్తుతం 80 వేల కోట్లకు వచ్చిందని అనేక షరతులు, కోతలతో రాజకీయల నేపథ్యంలో గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని వారు ఆరోపించార

# వెతుకుతున్న నిఘా కళ్లు

విజయవాడ, మార్చి 21, ట్రాఫిక్ పోలీసులు లేరని లైట్ తీసుకున్నారు.. నిబంధనల్ని పట్టించుకోలేదు. కట్ చేస్తే ఆన్‌లైన్‌లో చెక్ చేస్తే వాహనాలకు భారీగా చలానాలు కనిపించాయి. విజయవాడకు చెందిన ఆటో డ్రైవర్ ఒక రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా జంప్ చేశాడు. రెండు రోజుల తర్వాత ఈ–చలానా చెక్ చేస్తే రెడ్ సిగ్నల్ జంప్ చేసినందుకు రూ.వెయ్యి జరిమానా పడింది. మరో విద్యార్థి హెల్మెట్ లేకుండా ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి ఒకే బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేశారు. దీంతో ఈ బైక్‌కు రూ.2000 జరిమానా పడింది. పోలీసులు లేకుండా జరిమానాలు ఎలా సాధ్యమంటూ ఆరా తీస్తే అసలు సంగతి తెలిసింది.విజజయవాడలో ట్రాఫిక్ కూడళ్లపై పోలీసులు నిఘాను పెంచారు. మొన్నటి వరకు సిగ్నల్స్ దగ్గర వాహనదారులకు అవగాహన కల్పించిన పోలీసులు.. తాజాగా ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ/ ఐటీఎంఎస్ (ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)ల ద్వారా నిఘా పెంచారు. ఐటీఎంఎస్ ద్వారా ఈ చలానాలను నమోదు చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు లేరని గీత దాటితే జరిమానాలు పండుతున్నాయి. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ఈ ఐటీఎంఎస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మార్చి 1 నుంచి అమల్లోకి రాగా.. ముందే అధికారులు ప్రకటనలు కూడా ఇచ్చారు. ఐటీఎంఎస్ విధానం ఉందని చాలామందికి తెలియలేదు.. దీంతో కెమెరాలకు అడ్డంగా దొరికిపోతున్నారు.విజయవాడలో ట్రాఫిక్ పెరిగిపోయింది.. పోలీసు సిబ్బంది కూడాసరిపడా లేరు. అయినా సరే మొన్నటి వరకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. అయితే పోలీసులు లేనిచోట్ల కొందరు వాహనదారులు రెడ్ సిగ్నల్ పడినా ఆగకుండా వెళ్లిపోతున్నారు. ఇలా వెళ్లడంతో మిగిలిన వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. నిబంధనల్ని పాటించనివారిని కట్టడి చేసేందుకుఐటీఎంఎస్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు ట్రాఫిక్ పోలీసులు. విజయవాడలోని ఆరు కూడళ్లలో ప్రయోగాత్మకంగా వీటిని ఏర్పాటు చేయగా.. మరో 10 చోట్ల కూడా తీసుకురావాలని భావిస్తున్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని.. చలనాలు కొని తెచ్చుకోవద్దంటున్నారు పోలీసులు.రెడ్ సిగ్నల్ పడిన తర్వాత వెళితే జరిమానా పడుతుందన్నారు. ట్రాఫిక్ పోలీసులు లేరని ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వెళితే కెమెరాకు దొరికిపోతారంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు రెడ్ సిగ్నల్ జంప్, హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఆటోడ్రైవర్‌కు యూనిఫాం లేకపోవడం, వన్ వే నిబంధన ఉల్లంఘన, ఓవర్‌లోడ్ వంటి అంశాలను గమనిస్తున్నారు. మార్చి 6 నుంచి ఈ ఐటీఎంఎస్ చలానాల విధింపును అమలు చేస్తున్నారు. విజయవాడలో వారం రోజుల్లో 211 మంది ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించడంతో జరిమానా విధించారు. ఏ ఉల్లంఘనకైనా రూ.1000లు కట్టాల్సిందే.. ఒకవేళ ట్రాఫిక్ ఉల్లంఘన అత్యంత తీవ్రమైనదైతే.. కొత్త మోటారు వాహనాల చట్టం ప్రకారం రూ.10వేల వరకు జరిమానా విధించే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరించారు పోలీసులు. వాహనదారులు ఈ విషయాలను గమనించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## పదవ తరగతి కేంద్రాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

సిద్దిపేట పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుపరీక్షా కేంద్రాల వద్ద 163 బి ఎన్ ఎస్ ఎస్, 2023 అమలు,సిద్దిపేట పట్టణంలో ఉన్న పదవ తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్ ఆర్ కే టెక్నో స్కూల్ తదితర పరీక్ష కేంద్రాలను పరిశీలించి పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు సిబ్బందికి పటిష్టమైన బందోబస్తు గురించి తగు సూచనలు సలహాలు చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. పదవ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 79 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షలు జరిగే సమయంలో సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భారత శక్తి



# ఇక ఇమ్మిగ్రేషన్స్ నిబంధనలు కఠినం

హైదరాబాద్, మార్చి 22,

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఆ దేశంలో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే 38 వేల మంది అక్రమ వలసదారులను వారి దేశాలకు పంపించారు. మరికొందరిని అరెస్టు చేసి జుల్లో పెట్టారు. ఇక ఇమ్మిగ్రేషన్స్ నిబంధనలు కఠినం చేశారు. తాజాగా వీసా జారీలో సవరణలు చేశారు. సరికొత్త వ్యవస్థను తీసుకురావాలని నిర్ణయించారు. ఫారిన్ లేబర్ యాక్సెస్ గేట్వే వ్యవస్థలో ఐదేళ్ల కంటే పాత రికార్డులు, దరఖాస్తులను మార్చి 20 నుంచి తొలగించనున్నారు. దీంతో హెచ్?1బీ వీసా ప్రోగ్రామ్లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయితాజా ఆదేశాల ప్రకారం, మార్చి 20 నుంచి ఐదేళ్ల కంటే పాత రికార్డులను సిస్టమ్ నుంచి తొలగిస్తారు. ఉదాహరణకు, 2020 మార్చి 22న ఒక దరఖాస్తుపై తుది నిర్ణయం వెలువడి ఉంటే, 2025 మార్చి 22న ఆ రికార్డు తొలగించబడుతుంది. ఉద్యోగులకు సంబంధించి ఐదేళ్ల కంటే పాత వీసా రికార్డులను మార్చి 19లోగా డౌన్లోడ్‌చేసుకోవాలని సంస్థలకు సూచించారు. లేకపోతే ఆ రికార్డులు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. హెచ్?1బీతో పాటు తాత్కాలిక మరియు శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తులపై ఈ తొలగింపు ప్రభావం చూపనుంది. ఆఫీస్ ఆఫ్ ఫారిన్ లేబర్ సర్టిఫికేషన్ ఈ మార్పులకు సంబంధించి నోటీసులు జారీ చేసింది.ఇక వీసా కోసం త్వరలో యూఎస్ ఇమ్మిగ్రేషన్‌విభాగం కొత్త దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించనుంది. ఈ నిర్ణయం దరఖాస్తుదారులకు పారదర్శక సేవలు అందించేందుకేనని ట్రంప్ ప్రభుత్వం తెలిపింది. అందుకే పాత రికార్డులను తొలగిస్తున్నామని వివరించింది. 2025 నుంచి హెచ్?1బీ వీసా జారీలో కొత్త విధానం అమలులోకి రానుంది. ఇకపై ఒక లబ్ధిదారు బహుళ దరఖాస్తులు సమర్పించినా, అవి ఒకే అప్లికేషన్‌గా పరిగణించబడతాయి. రిజిస్ట్రేషన్ల సంఖ్యతో సంబంధం లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు 'కేంద్రీకృత?ఎంపిక ప్రక్రియ'ని అమలు చేస్తున్నట్లు యూఎస్ పౌరసత్వ, వలస సేవల విభాగం పేర్కొంది. కొన్ని సంస్థలు బహుళ రిజిస్ట్రేషన్ల ద్వారా లాటరీ విధానంలో అనుచిత లాభాలు పొందుతున్నాయని, దీన్ని అరికట్టేందుకు ఈ నిబంధనలు తీసుకొచ్చామని వెల్లడించింది.

## ఉమ్మడి నల్గొండ లో ప్రశాతంగా పది పరీక్షలు

నల్గొండ మార్చి 21,

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో.. ప్రశాంతమైన వాతావరణంలో 10వ తరగతి పరీక్షలు ప్రారంభం అయ్యాయి. నల్లగొండ, యాదాద్రి–భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో.. మొత్తం 222 పరీక్షా కేంద్రాల్లో.. 39 వేల 368 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలకు మొదటి రోజు కావడంతో తల్లిదండ్రులు వచ్చి పిల్లలను ఎగ్జామ్ సెంటర్ దగ్గర వదిలి.. టెన్షన్ లేకుండా పరీక్షలు రాయాలంటూ వారికి జాగ్రత్తలు చెప్పి వెళ్లారు. ఇక.. 9 గంటల 30 నిమిషాలకు పరీక్ష ప్రారంభం కాగా.. 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారికి సైతం పరీక్ష కేంద్రంలోనికి అనుమతించే నిబంధన కొనసాగింది.

## వెంకన్న ఆలయాల నిర్మాణాల కోసం ట్రస్ట్ ఏర్పాటు

తిరుమల, మార్చి 21

:– రాష్ట్రంలో ఇప్పటికీ చాలా గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి దేవాలయాలు లేవు. ఆయా గ్రామాల్లో వెంకన్న ఆలయాల నిర్మాణాల కోసం నిధులు సేకరించేందుకు ట్రస్టు ఏర్పాటు చేస్తాం. నాడు ఎన్టీఆర్ అన్నదానం, నేను ప్రాణదానం కార్యక్రమాలు ప్రవేశపెట్టాం. మూడవ కార్యక్రమంగా ఆలయాల నిర్మాణాలను తలపెడుతున్నాం. మాధవ సేవ కోసమే ఆలయాల నిర్మాణానికి ట్రస్ట్ ఏర్పాటు చేస్తాం. ట్రస్ట్‌కు వచ్చే నిధులు పగడ్బంధీగా ఖర్చు చేస్తాం. వేంకటేశ్వరస్వామి ఆస్తులు ఎవరు కబ్జా చేసినా వాటిని తిరిగి దేవుడికే చెందేలా చేస్తాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తన మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం వేంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు వెంగమాంబ అన్నవితరణ కేంద్రంలో అన్నప్రసాదం స్వయంగా వడ్డించారు. అనంతరం మీడియాతో సీఎం మాట్లాడారు.

వేంకటేశ్వరుడి ప్రాణభిక్షతోనే బతికున్నా

దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నాం. ప్రతి పుట్టిన రోజు నాడు తిరుమలలో అన్నదానం చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నాం. తిరుమలలో అన్నదానాన్ని ఎన్టీఆర్ ప్రారంభించారు. ఇప్పటికి విరాళాల ద్వారా రూ.2,200 కార్పస్ ఫండ్ ఏర్పాటైంది. అన్నదానం ఒక మహత్తర కార్యక్రమం. ఇది శాశ్వతంగా జరుగుతుంది. నేను ప్రాణదానం కార్యక్రమం ప్రారంభించా. మానవ సేవ మాధవ సేవ రెండూ ఉంటాయని ప్రాణదానం తీసుకొచ్చాం. ఏడు కొండలు వేంకటేశ్వరస్వామి సొంతం. ఇక్కడ అపవిత్రం చేయడం, వ్యాపారాలు జరగకూడదు. గతంలో అసెంబ్లీలో ఏడుకొండలు కాదు 5 కొండలు అని వ్యాఖ్యానించినప్పుడు పోరాడాం. ప్రాణదానం కార్యక్రమం ప్రారంభించి కిందకు వస్తున్న సమయంలో నాపై 24 క్లేమోర్‌మైన్స్ పేల్చారు. అన్ని క్లేమోర్స్ పేల్చినప్పుడు నేను ప్రాణాలతో బతికేవాడిని కాదు..సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి ప్రాణభిక్ష పెట్టారు. ఇందులో వేంకటేశ్వరస్వామి మహిమ ఏంటో ఆలోచించుకోవాలి. 24 క్లేమోర్ పేలితే ప్రాణాలతో తప్పించుకోలేరు. వేంకటేశ్వరస్వామి మహిమ వల్లే బతికాను.

# ఏపీలో రెండు కొత్త రైల్వే లైన్లు

ఒంగోలు మార్చి 21,

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రైలు మార్గాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు కొనసాగుతున్నాయి. అలాగే ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కలగా మిగిలిన ఒంగోలు–దొనకొండ, మార్కాపురం –శ్రీశైలం రైలు మార్గాలను ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈ రైల్వే లైన్ల అంశాన్ని లోక్‌సభలో ప్రస్తావించారు. ఈ రైల్వే లైన్లను నిర్మించాలని కేంద్రాన్ని కోరడంతో పశ్చిమ ప్రాంత వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కేంద్రంలో కదలిక వచ్చి రైల్వేమంత్రి స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారుగతంలోనే ప్రకాశం జిల్లాకు సంబంధించి ఒంగోలు – దొనకొండ రైల్వేలైను నిర్మాణం అంచనాలు తయారుచేయాలని ఆదేశాలు వచ్చాయి. మార్కాపురం నుంచి శ్రీశైలంకు రద్దీ పెరగడంతో ఈ రైల్వేలైను ఉపయోగంగా ఉంటుందని భావించారు. ఈ రైల్వే లైన్ పూర్తి చేస్తే గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే మల్లన్న భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ అంశాన్ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గతంలో కూడా లోక్‌సభలో ప్రస్తావించారు. ప్రకాశం జిల్లాకు సంబంధించి ఈ రెండు కొత్త రైల్వేలైన్లకు అనుమతులు ఇవ్వాలని కోరారు. తాజాగా మరోసారి ఆయన నడికుడి –శ్రీకాళహస్తి రైల్వేమార్గంలో డెమో రైళ్లను నడపటంతో పాటుగా జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని కోరారు. పశ్చిమ ప్రాంతంలోని ఈ మూడు రైల్వేలైన్లు కనుక పూర్తి చేస్తే రైతులకు, ప్రజలకు రవాణా సౌకర్యం కూడా మెరుగవుతుందంటున్నారు.ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం మీదుగా




నడికుడి –శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ రైలు మార్గంలో గుంటూరు జిల్లా నడికుడి నుంచి శ్యామలాపురం, దర్శి, పొదిలి వరకు పట్టాల పనులు పూర్తి చేశారు. దర్శి వరకు రైళ్లతో ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. ప్రస్తుతం పొదిలి మండలంలోని దాసళ్లపల్లి, పొదిలిలో స్టేషన్ల నిర్మాణం కొనసాగుతోంది. పొదిలికి సమీపంలోని రాజుపాలెం దగ్గర నిర్మిస్తున్న స్టేషన్‌కు ముందు ట్రాక్ పనులు ప్రారంభం కాలేదు. అక్కడ రైతులు కోర్టుకు వెళ్లడంతో 200 మీటర్ల పనులు నిలిపివేసి.. మిగిలిన చోట్ల పనులు చేపట్టారు. ఈ రైలు మార్గంలో పొదిలి రైల్వేస్టేషన్ అవతల నుంచి కనిగిరి వరకు వాగులపై వంతెనల నిర్మాణాలు పూర్తి చేయగా.. ట్రాక్ పనులు సైతం ముగింపు దశకు వచ్చాయి. పొదిలి, కనిగిరి, పామూరు మీదుగా ఉమ్మడి నెల్లూరు జిల్లా వైపు ట్రాక్ నిర్మాణ పనుల్ని చేపట్టాలని భావిస్తున్నారు. ఈ మేరకు నెల్లూరు జిల్లాలో కూడా ట్రాక్ పనులు త్వరలో ప్రారంభిస్తారని చెబుతున్నారు.=

# వైసీపీలో కలకలం

## దొంగ సంతకాలపై చర్చ

విజయవాడ, మార్చి 21,

ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ సమావేశాలను వైఎస్ఆర్‌సీపీ బహిష్కరించింది అనేది అందరికీ తెలిసిన విషయం. అయితే ఏడుగురు ఎమ్మెల్యేలు మాత్రం రహస్యంగా వచ్చి హాజరైనట్లుగా రిజిస్టర్ లో సంతకాలు చేసి వెళ్లారు. మొత్తంగా ఉన్నకొండు మంది ఎమ్మెల్యేల్లో జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రం సంతకాలు చేయలేదు. అసెంబ్లీ చివరి రోజున ఈ విషయం స్పీకర్ అయ్యన్న పాత్రుడు దృష్టికి వచ్చింది. ఆయన సభలో ప్రకటించారు వైసీపీ ఎమ్మెల్యేలు దొంగల్లా వచ్చి రిజిస్టర్ లో సంతకాలు పెట్టి కోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆయన బయట పెట్టడంతో ఆ ఎమ్మెల్యేలు ఎవరో తెలిసిపోయింది. స్కూలు, ఆఫీసుల్లో విద్యార్థులు, ఉద్యోగులు పంచ్ కొట్టి బయటకు వెళ్లిపోయినట్లుగా ఈ ఎమ్మెల్యేల వ్యవహారం ఉండటంతో ఎమ్మెల్యేల్లోనే కాదు..రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. అసెంబ్లీకి వెళ్లకూడదని అనుకున్నప్పుడు వెళ్లకుండా ఉండాలి కానీ రహస్యంగా సంతకాలు పెట్టాల్సిన అవసరం ఏమిటన్నది చర్చనీయాంశం అయింది. అసెంబ్లీకి హాజరు కాకపోతే అనర్హతా వేటు పడుతుందని స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదే పదే చెబుతున్నారు. అందుకే వారు గవర్నర్ ప్రసంగం రోజున హాజరై కొంత సేపు ఉండి వెళ్లిపోయారు. అయితే తర్వాత ఆ రోజు వర్కింగ్ డే కాదని అసెంబ్లీ వర్గాలు చెప్పాయి. దాంతో మరో రోజు హాజరు కావాల్సిన అవసరం పడింది. అలా హాజరు కాకుండా.. ఎప్పుడు వచ్చారో కానీ.. నేరుగా అసెంబ్లీకి వచ్చి రిజిస్టర్ లో సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. ఒక్క నిమిషం కూడా సభలోకి రాలేదు. ఈ సంతకాలు చెల్లుతాయా లేదా అన్నది స్పీకర్ రూలింగ్ ను బట్టి ఉంటుంది. చెల్లుబాటు అంశంపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఎలాంటి ప్రకటన చేయలేదు. అదే సమయంలో అసెంబ్లీకీ హాజరైనప్పుడు ప్రత్యేకంగా జీతభత్యాలు వస్తాయి. వాటి కోసం సంతకాలు చేసి ఉంటారని అంటున్నారు. ఎమ్మెల్యేలకు జీతభత్యాలు లక్షల్లోనే ఉంటాయి. అసెంబ్లీకి హాజరు కాని కారణంగా వాటిని ఆపేస్తే.. సమస్యలు వస్తాయని వచ్చి సంతకాలు పెట్టి ఉంటారని భావిస్తున్నారు. ప్రజలు ఓట్లు వేసి పంపించింది..అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలు చర్చించడానికి. అయితే ఎమ్మెల్యేలు జగన్ కు ప్రతిపక్ష హోదా ఇవ్వాలన్న కారణంగా అసెంబ్లీకి వెళ్లడం లేదు. జగన్ కు ప్రతిపక్ష హోదా ఇస్తేనే వెళ్తామంటున్నారు. వైసీపీకి ఉన్న పదకొండు మంది ఎమ్మెల్యేలలో చాలా మంది కొత్త ఎమ్మెల్యేలు. అసెంబ్లీకి హాజరై అధ్యక్షా అని ప్రసంగించాలని అనుకుంటున్నారు. కానీ అధినేత అంగీకరించకపోవడంతో అసెంబ్లీకి వెళ్లలేకపోతున్నారు.

దొంగ సంతకాలపై వైసీపీ సైలెన్స్

అసెంబ్లీలో వైసీపీ సభ్యులు దొంగల్లా వచ్చి సంతకాలు పెట్టి సభలోకి రాకుండా పారిపోతున్నారంటూ సాక్షాత్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చాలా పెద్ద కామెంట్ చేశారు. సహజంగా ఇలాంటి కామెంట్లపై వెంటనే వైసీపీ నుంచి రియాక్షన్ రావాలి. సభకు వస్తున్నామనో, లేక రాలేకపోతున్నామనో, అసలు తాము సంతకాలు పెట్టలేదనో, లేక తమ పేరుతో ఇంకెవరైనా పెడుతున్నారనో అనాలి. కానీ ఇంత వరకు వైసీపీ నుంచి సౌండ్ లేదు. అంటే దొంగ సంతకాలు నిజమేనని ఆ పార్టీ ఒప్పుకున్నట్లైందని టీడీపీ ఎద్దేవా చేస్తోంది. ఆఖరికి ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న నేతలు కూడా ఇంత చీప్ గా ప్రవర్తిస్తారా అంటూ కౌంటర్లిస్తున్నారు.వైసీపీ వాళ్లు జగన్ ని సింగిల్ సింహంతో పోలుస్తుంటారు. ప్రతి ఎన్నికల్లోనూ ఎవరితో పొత్తు పెట్టుకోకుండా జగన్ సింగిల్ గా బరిలో దిగుతారనేది వారి మాటల సారాంశం. ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్యేలు కూడా జగన్ ని ఒంటరి చేశారంటూ టీడీపీ ఓ రేంజ్ లో కౌంటర్లివ్వడం విశేషం. ఎమ్మెల్యేలుగా తమపై అనర్హత వేటు పడుతుందేమోననే భయంతో కొంతమంది అసెంబ్లీ రిజిస్టర్ లో సంతకాలు పెడుతున్నారు. అయితే సభకు మాత్రం రావడం లేదు. ఇది జగన్ తీర్మానానికి విరుద్ధం. తనను ప్రతిపక్షనేతగా గుర్తిస్తేనే సభకు వస్తామని భీష్మించుకు కూర్చున్నారాయన. అయితే వైసీపీ ఎమ్మెల్యేలు మాత్రం ఆయన శపథం పట్టించుకోకుండా తమ సీట్లు కాపాడుకోవడం కోసం పాకులాడటం విశేషం.జగన్ కి ప్రతిపక్ష నేత హోదా కావాలి, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రం తమ పదవులు మిగలాలి. ఈ క్రమంలో స్పష్టంగా అక్కడ సంఘర్షణ మొదలైంది. ఒకవేళ జగన్ పై అనర్హత వేటు పడినా.. ఆయన మాత్రం తన సీటులో గెలిచే అవకాశాలు ఎక్కువ. అదే సమయంలో మిగతా వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే.. ఆయా ప్రాంతాల్లో వారు గెలవాలంటే కత్తిమీద సాము చేయాలి. ఆర్థికంగా బాగా చితికిపోతారనేది వేరే విషయం. దీంతో వారంతా సేఫ్ గేమ్ ఆడుతున్నారు. అసెంబ్లీకి వచ్చి సంతకాలు పెట్టిపోతున్నారు. అయితే ఇక్కడ సంతకాలపై వైసీపీ పూర్తిగా కార్నర్ అయిపోయింది. తమ సభ్యులు అసెంబ్లీకి వస్తున్నారనే విషయంపై కనీసం స్పందించడానికి కూడా ఆ పార్టీ తరపున ఎవరూ ముందుకు రాకపోవడం విశేషం. ఈ విషయంలో వైసీపీ, ఆ పార్టీ అనుకూల మీడియా తేలు కుట్టిన దొంగలా మారింది. కనీసం దానిపై స్పందించేంత సాహసం కూడా వైసీపీ నేతలెవరూ చేయట్లేదు. జగన్ పేరెత్తితేనే అంతెత్తున ఎగిరిపడే సోషల్ మీడియా మేధావులు కూడా ఈ దొంగసంతకాలను కవర్ చేయలేక కష్టపడుతున్నారు. ఇప్పటి వరకూ వైసీపీ స్పందించలేదంటే దానర్థం దొంగ సంతకాలు నిజమనే. దీంతో ఆ పార్టీ పరువు పూర్తిగా మంటగలిసిందని అంటున్నారు. అయితే ఇక్కడ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాత్రం స్పందించారు. ఇక్కడ కూడా ఆయన బహుజన ఎమ్మెల్యేలను దొంగలన్నారంటూ టాపిక్ ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడం విశేషం. ఆయన రెస్పాన్స్ ని మాత్రం వైసీపీ సోషల్ మీడియా ప్రచారం చేసుకుంటోంది కానీ, పార్టీ తరపున ఎవ్వరూ మాట్లాడే సాహసం చేయడం లేదు.

## దేశంలో భారీగా పెరుగుతున్న కోటీశ్వరులు

ముంబై, మార్చి 22,

ఇప్పటి వరకు, మన దేశంలో 9 కోట్లకు పైగా ప్రజలు 2024–25 ఆర్థిక సంవత్సరానికి (ఈజ25) ఆదాయ పన్ను రిటర్న్‌లుసమర్పించారు. 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్' విడుదల చేసిన తాజా డేటా ప్రకారం, నమోదిత ఆదాయపన్ను చెల్లింపుదార్లలో కేవలం 65 శాతం మంది మాత్రమే రిటర్న్‌లు దాఖలు చేశారు. 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్' రిపోర్ట్ ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024–25) మార్చి 16, 2025 వరకు దాఖలైన ఐటీఆర్‌లలో, దాదాపు ఐదు లక్షలకు మంది పన్ను చెల్లింపుదారులు రూ. 1 కోటి కంటే ఎక్కువ ఆదాయం ఉన్నట్లు ప్రకటించారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, 4.69 లక్షల మంది వార్షిక ఆదాయం రూ. 1 కోటి దాటింది. అంటే, భారతదేశంలో ప్రస్తుతం ఉన్న కోటీశ్వరుల సంఖ్య 4.69 లక్షలు. ప్రస్తుతం, భారతదేశ జనాభా దాదాపు 144 కోట్లు. వీరిలో.. దాదాపు 14 కోట్ల మంది రిజిస్టర్డ్ టాక్స్‌పేయర్స్ ఉన్నారు. అంటే, మొత్తం జనాభాలో రిజిస్టర్డ్ టాక్స్‌పేయర్స్ సంఖ్య 10 శాతం కన్నా తక్కువే. ఈ లెక్క ఇక్కడితోనే అయిపోలేదు. ఈ 14 కోట్ల రిజిస్టర్డ్ టాక్స్ పేయర్స్‌లో కూడా, రూ. 1 కోటి ఆదాయం దాటిన వాళ్లు (కోటీశ్వరులు) 5 లక్షల మంది కూడా లేరు. ఇది ఆశ్చర్యపరిచే విషయమే. 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్' సమాచారం ప్రకారం.. 3.89 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు రూ. 1 కోటి నుంచి రూ. 5 కోట్ల మధ్య వార్షిక ఆదాయాన్ని ప్రకటించారు. 36,274 మంది టాక్స్ పేయర్లు రూ. 5 కోట్ల నుంచి రూ. 10 కోట్ల మధ్య వార్షిక ఆదాయం ఉన్నట్లు నివేదించారు. 43,004 మంది రూ. 10 కోట్లకు పైగా వార్షిక ఆదాయం ఉన్నట్లు వెల్లడించారు. దీంతో, ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక ఆదాయంగల పన్ను చెల్లింపుదారుల సంఖ్య (రూ. 1 కోటి కంటే ఎక్కువ ఆదాయం ఉన్న వాళ్లు) 4,68,658కి చేరుకుంది. ఆలస్య రుసుముతో కలిపి ఆదాయ పన్ను రిటర్నులను దాఖలు చేయడానికి చివరి తేదీ మార్చి 31, 2025. ఈ గడువుకు ఇంకా కొన్ని రోజుల సమయం ఉంది కాబట్టి, ఈ గణాంకాలు పెరుగుతాయని భావిస్తున్నారు. 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్' లెక్కల ప్రకారం, 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు 9.11 కోట్లకు పైగా ప్రజలు ఎఖీలు దాఖలు చేశారు. భారతదేశంలో మొత్తం నమోదిత పన్ను చెల్లింపుదారుల సంఖ్య 13.96 కోట్లు. అంటే దాదాపు 65 శాతం మంది మాత్రమే రిటర్న్‌లను దాఖలు చేశారని అర్థం. ఎఖీ ఫైల్ చేసిన వాళ్లలో దాదాపు 8.56 కోట్ల మంది ఆ రిటర్న్‌లను ఈ–వెరిఫై చేశారు. ఆదాయ పన్ను విభాగం ఇప్పటి వరకు రూ. 3.92 లక్షల కోట్లను రిఫండ్ చేసింది.

రాష్ట్రాల వారీగా...

మహారాష్ట్రలో అత్యధికంగా 1.38 కోట్ల రిటర్నులు దాఖలయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో 90.68 లక్షల రిటర్న్‌లు దాఖలు కాగా, గుజరాత్‌లో 87.90 లక్షల రిటర్న్‌లు దాఖలయ్యాయి. ఢిల్లీలో 44.45 లక్షల మంది ఐటీఆర్‌లు సమర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో 30.76 లక్షల మంది, పంజాబ్‌లో 43.79 లక్షల రిటర్న్‌లు దాఖలు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 16, 2025 మధ్యకాలంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు గత ఆర్థిక సంవత్సరం (ఈజ24) ఇదే కాలంతో పోలిస్తే 16.2 శాతం పెరిగి రూ. 25.86 లక్షల కోట్లకు చేరుకున్నాయని ఆదాయ పన్ను విభాగం గతంలో ప్రకటించింది.

## పది పరీక్షలు షురూ

కుత్బుల్లాపూర్ :

తెలంగాణ రాష్ట్రములో లో శుక్రవారం పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం నుంచి ఏప్రిల్ నాలుగవ తేదీవరకు పరీక్షలు నిర్వహిస్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో మొత్తం 53 పరీక్షా కేంద్రాలు.. 12,672 మంది విద్యార్థులు వ్రాస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకుంటున్నారు. హాజరవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు అన్ని సదుపాయాలుఅధికారులు ఏర్పాట్లు చేసారు.

=====================

# ముగింపు దిశగా యుద్ధం

మాస్కో, మార్చి 22, (

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌భారీ మెజారిటీతో విజయం సాధించారు. జనవరి 20న అధ్యక్షుడిగా వైట్‌హౌస్‌లో అడుగు పెట్టారు. ఈ క్రమంలో ఎన్నికల్లో ఇచ్చి హామీలు నెరవేర్చడంపై దృష్టి పెట్టారు. వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, కానిస్టిట్యూషనల్ ఆర్డర్స్ జారీ చేస్తున్నారు. మరోవైపు యుద్ధాలు ఆపేందుకు ఇటు రష్యా, ఉక్రెయిన్, అటు ఇజ్రాయెల్‌తో చర్చలు జరిపారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం చేయించారు. ఇప్పుడు రష్యా?ఉక్రెయిన్ యుద్ధం పూర్తిగా ఆపే ప్రయత్నంలో సక్సెస్ అయినట్లు కనిపిస్తోంది. వాషింగ్టన్ నుంచి వెలువడిన వార్తల ప్రకారం, ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని శాంతియుతంగా ముగించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అంగీకరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సుమారు రెండు గంటల ఫోన్ సంభాషణ తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైట్ హౌస్ తెలిపింది. ఈ సందర్భంగా ఇరు నేతలు శాశ్వత శాంతి స్థాపనతో యుద్ధానికి ముగింపు పలకాలని సంకల్పించారు. అమెరికా, రష్యా మధ్య సంబంధాలు మెరుగుపడాలని, ద్వైపాక్షిక సహకారం అవసరమని వారు ఒకరికొకరు వ్యక్తం చేశారు.రష్యా?ఉక్రెయిన్ యుద్ధం రెండు దేశాలకు తీవ్ర నష్టాలు మిగిల్చింది. అనేక ప్రాణాలు కోల్పోవడంతో పాటు భారీ నిధులు ఖర్చయ్యాయి. ఈ నిధులను ప్రజా సంక్షేమానికి ఉపయోగిస్తే ఎంతో అభివృద్ధి సాధ్యమయ్యేదని వైట్‌హౌస్ అభిప్రాయపడింది. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు తలెత్తకుండా సామరస్యపూర్వక పరిష్కారాలతో ఈ యుద్ధాన్ని ఇప్పుడే ముగించాలని పేర్కొంది. యుద్ధ విరమణకు తీసుకోవాల్సిన చర్యలపై ట్రంప్, పుతిన్ చర్చించారు. ముఖ్యంగా ఇంధన వనరులు, మౌలిక సదుపాయాలపై దాడులను ఆపడం, నల్ల సముద్రంలో కాల్పులను నియంత్రించడం వంటి అంశాలపై తక్షణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సాంకేతిక సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని ట్రంప్ సూచించారు.

ఇజ్రాయెల్ అంశం కూడా..

ట్రంప్?పుతిన్ సంభాషణల్లో ఇజ్రాయెల్ అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఇరాన్ ఇజ్రాయెల్‌ను నాశనం చేసే స్థితిలో ఉండకూడదని ఇరు నేతలు అంగీకరించారు. అలాగే, వ్యూహాత్మక ఆయుధాల విస్తరణను నియంత్రించాలని చర్చించారు.

పుతిన్ షరతు..

అయితే, ఈ శాంతి ప్రక్రియకు పుతిన్ ఒక షరతు విధించారు. ఉక్రెయిన్‌కు విదేశీ సైనిక సాయం, నిఘా సమాచారం అందించడాన్ని పూర్తిగా నిలిపివేయాలని క్రెమ్లిన్ పేర్కొంది. ఈ షరతు ద్వారా వివాదం మరింత తీవ్రతరం కాకుండా రాజకీయ, దౌత్య మార్గాల్లో పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించింది. ట్రంప్ ఈ శాంతి కృషిని స్వాగతించినట్లు క్రెమ్లిన్ అభినందించింది. ఈ చర్చలు రెండు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలికే దిశగా ఒక అడుగుగా భావిస్తున్నారు.

## సికింద్రాబాద్ లో పది పరీక్షలు

సికింద్రాబాద్

పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో ఉదయం ఏడు గంటల నుండి విద్యార్థులు తల్లిదండ్రుల తో కలిసి పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. హాలు వద్ద ఏర్పాటుచేసిన బోర్డులో తమ హాల్ టికెట్ నంబరు ఈ తరగతి గదిలో కేటాయించారు అనే విషయాన్ని చెక్ చేసుకుని ఆత్రుతగా తమ తమ తరగతి గదులకు పరుగులు తీశారు. పరీక్ష కేంద్రాల వద్ద హాల్ టికెట్లను పరిశీలించడంతోపాటు క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోపలకు అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులను అనుమతించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. లా అండ్ ఆర్డర్ ట్రాఫిక్ పోలీసులు సైతం ట్రాఫిక్కును క్లియర్ చేయడంతో పాటు విద్యార్థులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా సహకరించారు. అంతేకాకుండా వారు పరీక్షలు బాగా రాయాలని శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్ల కార్డులు ప్రదర్శించారు.

## మితిమీరిన వేగంతో కారు నడిపి ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టిన వ్యక్తి అదుపులో తీసుకున్న పోలీసులు

హైదరాబాద్

మితిమీరిన వేగంతో కారు నడిపి ఓ వ్యక్తి పలు వాహనాలను ఢీ కొట్టిన సంఘటన అంబర్పేట్ లో చోటుచేసుకుంది బోరబండ లో నివాసముండే అఫ్జల్ అమెజాన్ కంపెనీలో కారు డ్రైవర్ గా పని చేస్తున్నాడు గురువారం రాత్రి కంపెనీ ఉద్యోగులను ఇంటి దగ్గర విడిచిపెట్టడానికి చే నెంబర్ వైపు నుంచి ఉప్పల్ కు వెళు _న్నాడు ఫ్లైఓవర్ పై మితిమీరిన వేగంతో వాహనం నడిపిన అఫ్జల్ ఫ్లైఓవర్ దిగిన వెంబడి ట్రై కలర్ హాస్పిటల్ సమీపంలో వాహన వేగాన్ని అదుపు చేయలేక రోడ్డు పక్కగా టైలర్ షాప్ ముందు ఆపి ఉన్న ఆరు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు ఈ ఘటనలో వాహనాలపై ఉన్న నలుగురికి గాయాలయ్యాయి వేగంగా ఉన్న వాహనం టైలర్ షాప్ లోకి దూసుకువెళ్లడంతో టైలర్ షాపులోని సామాగ్రి ధ్వంసం అయింది ఘటనలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు సంఘటన కారణమైన డ్రైవర్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు

## జగిత్యాల ఆర్డీవో ఆఫీస్ లో ఐటీ ఆఫీసర్ల తనిఖీలు

### రైల్వే లైన్ కోసం తీసుకున్న భూముల వివరాలకు సంబంధించి రికార్డుల పరిశీలన పరిహారం డబ్బులు పక్కదారి పట్టాయనే అనుమానం తో కొనసాగుతున్న తనిఖీలు...

జగిత్యాల

జగిత్యాల ఆర్డీవో ఆఫీస్ లో ఆదాయపు పన్నుల ఆఫీసర్లు గురువారం మధ్యాహ్నం నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైల్వే లైన్ లో భూములు కోల్పోయిన రైతుల వివరాలు వారికి వచ్చిన పరిహారం డబ్బులకు సంబంధించిన రికార్డులను ఆఫీసర్లు పరిశీలిస్తున్నారు. జగిత్యాల రెవెన్యూ డివిజన్ పరిధిలో దక్షిణ మధ్య రైల్వే లైన్ నిర్మాణం కోసం ప్రభుత్వం భూములను సేకరించింది. అయితే ఒక్కో ఎకరానికి లక్ష రూపాయలు ఇస్తామని పేర్కొనడం తో రైతులు ఆ డబ్బులు మాకు సరిపోవని, మీ డబ్బులు మాకొద్దంటూ బాధిత రైతులంతా సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దాంతో సుప్రీం కోర్టు రైతుల పక్షాన నిలిచి ఒక్కో ఎకరానికి రూ. పది లక్షల పరిహారం ఇవ్వాలని అప్పట్లో తీర్పు ఇచ్చింది. పరిహారం అందించడంలో ఆలస్యమైనందున ఆ డబ్బులను వడ్డీతో సహా చెల్లించాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో భూములు కొల్పోయిన రైతుల పేరిట సుమారు రూ. 3 కోట్ల మేర వడ్డీ డబ్బులు వచ్చాయి. అయితే పాన్ కార్డు ఉన్న రైతులకు రూ. 2 కోట్ల లో 10 శాతం ఆదాయ పన్ను పోను మిగితా డబ్బులు చెల్లింపులు జరిగాయి. మిగతా కోటి రూపాయలకు సంబంధించి రైతులకు పాన్ కార్డులు లేకపోవడం తో 20 శాతం ఆదాయ పన్ను చెల్లింపులు జరిగాయి. అయితే 20 శాతం ఆదాయ పన్ను చెల్లించిన రైతులకు సంబంధించిన ఆదాయ పన్ను తిరిగి రాబట్టేందుకు జగిత్యాల కు చెందిన టాక్స్ కన్సల్టెంట్ తన చేతి వాటం ప్రదర్శించాడు. ఇతరుల పాన్ కార్డులతో క్లెయిమ్ చేసి ఆ డబ్బులు కాజేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గుర్తించిన ఆదాయపు పన్ను డిపార్ట్మెంట్ ఆఫీసర్లు గురువారం ఆర్డీవో ఆఫీస్ చేరుకుని రైల్వే లైన్ లో భూములు కోల్పోయిన రైతులకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్నారు. కాగా చేతివాటం ప్రదర్శించిన టాక్స్ కన్సల్టెంట్ తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఎంక్వైరీ చేస్తున్నట్లు సమాచారం.

## ఖమ్మంలో రైతు సంఘాల అందోళన

ఖమ్మంపంజాబ్ బోర్డర్ వద్ద రైతు సంఘం నాయకుల ను అరెస్టు చేయటన్నీ ఖండిస్తూ ఖమ్మంలో సిపిఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఖమ్మం కొత్త బస్టాండ్ ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్రాన్ని వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతు సమస్యలపై పోరాడుతున్న రైతు సంఘం నాయకులు జగత్ సింగ్ దల్లేవాలను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. కేంద్రం రైతు సమస్యలను పరిష్కరించి, పంటలకు మద్దతు ధరను చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు

## రసమయికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన

కరీంనగర్ అల్గునూరులో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. పార్టీ నేతలు అంబేద్కర్ చౌరస్తాలో బైఠాయించి ధర్నా చేసారు.

# జైలు పక్షిలా పోసాని...

## పాపం.. పట్టించుకొనేవారేరి

కడప, మార్చి 21,

పోసాని కృష్ణమురళీ జైళ్లు పట్టుకు తిరుగుతున్నారు. ఒకచోట కస్టడీ అయిపోగానే మరోచోటకు వెళుతూ రాష్ట్రంలోని అన్ని జైళ్లను చుట్టేస్తున్నారు. సినిమా రంగంలో అత్యంత గౌరవ, మర్యాదలు అందుకున్న వ్యక్తికి ఇలా జరగాలని ఎవరూ కోరుకోరు.. కానీ ఆయన ప్రవర్తన, మాటలే ఆయన ప్రస్తుతం అనుభవిస్తున్న



జీవితానికి కారణం అని అంతా అంటున్నారు. అయితే.. ఇదే పోసాని ఎవరి కోసం అయితే నోటికి వచ్చినట్లు మాట్లాడారో.. అదే నాయకుడు కనీసం పోసాని గురించి మాట్లాడడం లేదు. ఆయన్ను పలకరించేందుకు సైతం ప్రయత్నించలేదు. ఏ వైసీపీ కోసం అయితే కష్టపడ్డారో, ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారో.. అదే వైసీపీ పోసాని గురించి పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. మొదట్లో.. వైసీపీలోని కొంత మంది నేతలు.. ముఖ్యంగా పొన్నవోలు సుధాకర్ రెడ్డి ప్రయత్నాలు చేసారు. కానీ..ఇప్పుడు మాత్రం ఎవరూ స్పందించడం లేదు.కూటమి పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అందరికీ మాటలు హద్దులు దాటాయి. వాళ్ల స్థాయిని, స్థానాన్ని మరిచిపోయి? పార్టీల రొచ్చులో దొర్లారు. అలాంటి వారిలో పోసానికి కూడా పెద్ద గజమాలే వేయాలి అంటున్నారు కూటమి మద్ధతుదారులు. పోసాని కంటే ముందు మరింత పెద్ద సత్కారం చేయాల్సి వస్తే.. బోరుగడ్డ అనిల్ కుమార్ అనే వ్యక్తికి చేయాల్సి ఉ ంటుంది. అతని నోటికి అయితే పచ్చి బూతులే వస్తుంటాయి. ఆయా వీడియోలు ఇప్పటికీ.. సోషల్ మీడియాలో అందుబాటులోనే ఉన్నాయి. కాగా.. అతని పరిస్థితీ పోసాని లాగానే రాష్ట్రంలోని జైళ్లకు రిమాండ్ మీద సందర్శించుకుని వస్తున్నాడు. వీరిద్దరి విషయంలో వైసీపీ డైరెక్టుగా సపోర్టు చేయకపోవడాన్ని చాలా మంది ప్రశ్నిస్తున్నారు.వాస్తవానికి వైసీపీ అధినేతకు ఓదార్పులు బాగా కలిసి వస్తాయంటున్నారు కూటమి నేతలు.. ఆయన తొలినాళ్ల నుంచి ఓదార్పులతోనే పార్టీని నెట్టుకు వస్తున్నారు. అలా.. టీడీపీ కేంద్ర కార్యాలయం మీద దాడి కేసులో అరెస్టు అయిన వల్లభనేని వంశీ, ఎలక్షన్ సమయంలో ఈవీఎం మెషిన్ పగులగొట్టిన కేసులో పిన్నెల్లి రామకృష్ణా రెడ్డితో సహా వివిధ కేసుల్లో జైలుకు వెళ్లిన నందిగం సురేష్ వంటి వారిని జగన్ స్వయంగా పలకరించారు. మిగతా వారికి వైసీపీ కేడర్, జిల్లా స్థాయి పార్టీ నాయకులు అండగా నిలుస్తున్నారు. కానీ.. పోసాని, బోరుగడ్డకు మాత్రం ఎవరూ మద్ధతు నిలవడం లేదు. అంటే.. ఎవరైనా దిగజారుడు మాటలు మాట్లాడితే.. వారిని అవసరాలకు వాడుకుంటారు కానీ, ఆపదలో ఆదుకోరు అనే విషయం వీరిని చూసైనా తెలుసుకోవాలంటున్నారు.పోసాని కృష్ణమురళి సినిమా పరిశ్రమలో గుర్తింపు స్థాయి రచయిత, నటుడిగానే ఉన్నారు. ఆయనను పట్టించుకోని వైసీపీ నాయకులు.. వివాదాస్పద సినిమాల దర్శకుడు రామ్ గోపాల్ వర్మ విషయంలో మాత్రం హడావిడి చేశారు. ఒంగోలు పోలీసు స్టేషన్ లో విచారణకు హాజరైన ఆర్జీవీ కి స్వాగతం పలికే దగ్గర నుంచి తిరిగి ఆయన్ను విచారణ అనంతరం విడిచిపెట్టే వరకు దగ్గరుండి వైసీపీ నాయకులు చూసుకున్నారు. అంత మాత్రం గౌరవం కూడా పోసానికి దక్కలేదు.అయితే.. స్టార్టింగ్ లో గట్టిగానే నిలబడిన పోసాని.. ఆ తర్వాత మాత్రం తన మాటల వెనుక అసలు కారణాల్ని వెల్లడించారు. తొలుత వైసీపీ సకల శాఖ మంత్రి సజ్జల రామాకృష్ణ రెడ్డి డైరెక్షన్ లోనే తాను మాటల్ని తూలానని ఒప్పుకున్నారు. ఆ తర్వాత వైసీపీకి చెందిన ఓ పత్రికకు సంబంధించిన వ్యక్తులు అందించిన స్క్రిప్ట్ కారణంగానే మాట్లాడాను అంటూ ఉన్నది ఉ న్నట్లు చెప్పేసారు. దాంతో? వైసీపీ కార్నర్ కావాల్సిన పరిస్థితులు తలెత్తాయి. దాంతో.. అతనికి సపోర్టు చేసి మరీ ఇరుకున పడడం ఎందుకులే అనుకుని.. వైసీపీ క్యాడర్ సైలెంట్ అయ్యింది అంటున్నారు.

# ప్రైవేటీకరణపై ఇంకా ఆందోళనే

విశాఖపట్టణం, మార్చి 21,

గత కొద్దిరోజులుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం కుదిపేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించడంతో ప్రైవేటీకరణ నిలిచిపోయిందని అంతా భావిస్తున్నారు. అయితే కార్మికులతో పాటు ఉద్యోగుల్లో మాత్రం ఆందోళన కొనసాగుతోంది. ఇలా ప్యాకేజీ ఇచ్చే కంటే విశాఖ స్టీల్ కు సొంత గనులు కేటాయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్లాంట్ తన కాళ్ళ మీద తాను నిలబడేలా చేయాలని కోరుతున్నారు. ఇప్పటికీ ప్రైవేటీకరణ ఆగలేదన్నది కార్మికుల అభిప్రాయం. ఈ విషయంలో కేంద్రం కూడా పూర్తి స్పష్టత ఇవ్వలేదు. తాజాగా మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది. పాడి త్రినాథ్ అనే కార్మిక సంఘం నేత కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు ఒక లేఖ రాశారు. ప్రైవేటీకరణ అంశంపై స్పష్టత కోరుతూ ఆయన ఈ లేఖ రాశారు. తమ నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని ఉక్కు మంత్రిత్వ శాఖ స్పష్టత ఇచ్చేసింది. దీంతో కార్మిక సంఘాలు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఉద్యమించడానికి సిద్ధపడుతున్నాయి.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం తెర పైకి వచ్చింది. అప్పట్లో జగన్మోహన్ రెడ్డి సర్కార్ ఈ ప్రైవేటీకరణను అడ్డుకోలేకపోయిందని కార్మిక సంఘాలు ధ్వజమెత్తాయి. అదే సమయంలో తాము అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చంద్రబాబుతో పాటు పవన్ హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే విశాఖ ఉక్కు కు వేల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించింది కేంద్రం. కానీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిచిపోయిందని విస్పష్ట ప్రకటన చేయలేదు కేంద్రం. దీంతో కార్మిక సంఘాల్లో ఒక రకమైన అనుమానం ఉంది. ఫాక్ట్ చెక్ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేశారు. అందులో భాగంగా కార్మిక సంఘం నేత లేఖ రాశారు. అయితే దానికి రిప్లై ఇచ్చే క్రమంలో ఉక్కు పరిరక్షణకు తమ వంతు కృషి ఉంటుందని చెప్పిందే కానీ.. ఇక్కడ కూడా స్పష్టత ఇవ్వలేదు. పైగా విశాఖ ఉక్కును కేంద్రం విక్రయిస్తుందనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొంది.గతంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై ఉద్యమాలు తీవ్రంగా సాగుతున్న సమయంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి రంగంలోకి దిగారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను సందర్శించారు. అనంతరం విశాఖ స్టీల్ ను ప్రైవేటీకరించబోమని తేల్చి చెప్పారు. అటు తరువాత పదివేల కోట్లకు పైగా నిధులను కూడా కేటాయించారు. దీంతో ఇక ప్రైవేటీకరణ అనేది ముందుకు సాగదని అంతా భావించారు. కానీ ఇప్పుడు విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అంశంపై పూర్తి స్పష్టతనివ్వడం లేదు కేంద్రం. నిలుపుదల చేస్తామని నేరుగా చెప్పడం లేదు. ప్రైవేటీకరణ ఆగదని సంకేతాలు ఇచ్చేలా చెప్పడంతో మరోసారి అనుమానాలు ప్రారంభమయ్యాయి.

# కడప జెడ్పీ పీఠంపై కూటమి.. ?

కడప, మార్చి 21, (న

వైయస్సార్ కాంగ్రెస్( పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి మరో సవాల్ ఎదుర్కొంటున్నారు. కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో జడ్పీ పీఠం నిలబెట్టుకోవడం ఇప్పుడు జగన్మోహన్ రెడ్డికి సవాల్ గా మారనుంది. జడ్పీ చైర్మన్ గా ఉన్న అమర్నాథ్ రెడ్డి రాజంపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దీంతో జడ్పీ చైర్మన్ ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో కడప జిల్లాలో కూటమి భారీ విజయం నమోదు చేసుకుంది. ఉమ్మడి కడప జిల్లాలో పులివెందుల, బద్వేలు, రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గాల కు మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిమితం అయింది. ఈ తరుణంలో జిల్లా పరిషత్ చైర్మన్ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2021 లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా పరిషత్తు స్థానాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకుంది. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి అమర్నాథ్ రెడ్డికి వరించింది. 2024 ఎన్నికల్లో అమర్నాథ్ రెడ్డి రాజంపేట నియోజకవర్గం నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. దీంతో అమర్నాథ్ రెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఇంకా 15 నెలలపాటు జిల్లా పరిషత్ కు గడువు ఉంది. ప్రస్తుతం వైస్ చైర్పర్సన్ గా ఉన్న శారద చైర్ పర్సన్ గా వ్యవహరిస్తూ వచ్చారు.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జడ్పిటిసి సభ్యులు ఐక్యంగా కనిపిస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా వారిని శిబిరాలకు తరలించే పనిలో పడింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే జడ్పీ చైర్మన్ కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో నేతలు వేరువేరు శిబిరాలుగా విడిపోయారు. ప్రధానంగా బ్రహ్మంగారిమఠం జడ్పిటిసి సభ్యుడు రామ గోవిందరెడ్డి అభ్యర్థిత్వం వైపు జగన్ మొగ్గు చూపినట్లు వార్తలు వస్తున్నాయి. కానీ ఆయన వైపు చాలామంది జడ్పిటిసిలు ఆసక్తి చూపడం లేదు. ఈ తరుణంలో చాలామంది జడ్పిటిసిలు కూటమి పార్టీల వైపు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమయింది. తమ పార్టీ జడ్పిటిసి లను కాపాడుకునే పనిలో పడినట్లు తెలుస్తోంది. అవసరం అనుకుంటే భారీగా తాయిలాలు సైతం ఇచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ఉమ్మడి కడప జిల్లాలో50 మంది జడ్పిటిసి సభ్యులు ఉన్నారు. 2021 లో జరిగిన ఎన్నికల్లో 49 మంది సభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. గోపవరం మండలం నుంచి మాత్రమే టిడిపి అభ్యర్థి అప్పట్లో విజయం సాధించారు. అయితే చాలామంది జడ్పిటిసిలు కూటమి పార్టీలకు అనుకూలంగా వ్యవహరించారు. కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలతో తిరుగుతున్నట్లు కూడా తెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అనుమానం కూడా అదే. అయితే కడప జిల్లా పరిషత్తు చైర్మన్ పీఠాన్ని వదులుకుంటే మాత్రం రాజకీయంగా జగన్మోహన్ రెడ్డికి మరింత ఇబ్బందులకు గురిచేసే అంశమే. అందుకే జగన్ సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా మొత్తం 50 మంది సభ్యులకు గాను.. 47 మంది జడ్పీటీసీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో కూటమి పార్టీల వైపు జడ్పీటీసీలు వెళ్లిపోయారని. ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యేలతోపాటు ఎంపీలు ఉండడంతో విజయం తమదేనని కూటమి భావిస్తోంది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తమ జడ్పిటిసి లను తీసుకుని క్యాంపు రాజకీయానికి బయలుదేరినట్లు సమాచారం. మరి కడప జిల్లా రాజకీయం ఎంతవరకు తీసుకెళ్తుందో చూడాలి.

# కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ

**బిఆర్ఎస్ ను ప్రజలు ఎప్పుడో బొంద పెట్టారు**
**ఆ పార్టీని తాము గుర్తించడం లేదు**
**భవిష్యత్తులో మాకు ప్రధాన పోటీ బీజేపీనే**
**ప్రాజెక్టుల పేరుతో అధికారంలో ఉన్నప్పుడు బిఆర్ఎస్ దోచుకుంది**
**కేటీఆర్ సూర్యాపేటకు వచ్చుడు దండగ**
**నోటికి వచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకోం**
**కేటీఆర్ పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్**
**జగదీష్ రెడ్డికి ప్రాజెక్టులు ఎక్కడ ఉన్నాయో కూడా తెలవదు**
**రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమటోగ్రాఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

నల్లగొండ:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

నల్గొండలోని కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్ ప్రజల నుంచి వచ్చిన నాయకుడు కాదని తండ్రి చాటు కొడుకని ఎద్దేవ చేశారు. రాజకీయాల గురించి అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు.రేవంత్ రెడ్డి రాజకీయాలలో అంచలంచెలుగా ఎదిగి సీఎం స్థాయికి వచ్చాడని అన్నారు.కెసిఆర్ దొంగ దీక్షలు చేసి తెలంగాణ ప్రజలను మోసం చేశాడని విమర్శించారు.తెలంగాణ వచ్చిన తర్వాత దళితుడిని సీఎం చేస్తానని , తానే సీఎం అయ్యాడని అన్నారు.ఇక్కడి ప్రజల త్యాగాలు చూసి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు.

తెలంగాణ ఇచ్చిన పార్టీగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారని అన్నారు.

అసెంబ్లీ ,పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీని ప్రజలు ఎప్పుడో బొంద పెట్టారని అన్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా వచ్చిందని, 11 స్థానాలలో డిపాజిట్ కోల్పోయిందని ఎద్దేవ చేశారు.బిఆర్ఎస్ పార్టీ నేతలకు రాహుల్ గాంధీ, సోనియాగాంధీ లను విమర్శించే అర్హత లేదని అన్నారు.గత 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు దోచుకుందని ధ్వజమెత్తారు.డబల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తానని చెప్పి పేద ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.ఫోన్ టాపరింగ్ లో ప్రభాకర్ రావు, శ్రవణ్ కుమార్ లను దేశానికి రప్పిస్తున్నారని అన్నారు. వారు వచ్చిన తర్వాత బిఆర్ఎస్ పార్టీ నేతలు ఎక్కడికక్కడ పరారు అవుతారని, కెసిఆర్, కేటీఆర్ తో పాటు బీఆర్ఎస్ నేతలు జైలుకెల్లాక తప్పదన్నారు.బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగదీష్ రెడ్డి వేల కోట్లకు పడగలేత్తాడని విమర్శించారు.

కేటీఆర్ సూర్యాపేటకు వచ్చుడు దండగని ఎద్దేవ చేశారు.బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడో ప్రజల విశ్వాసం కోల్పోయిందని, కెసిఆర్ కేటీఆర్ ల మాటలు ఎవరు నమ్మడం లేదన్నారు.గత ఎన్నికల్లో జగదీష్ రెడ్డి దోచుకున్న సొమ్ముతో కొద్దిపాటి తేడాతో గెలిచారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ సేక్యులర్ పార్టీ అని పేర్కొన్నారు.సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని అన్నారు.దీంతో ఏఐసిసి అధ్యక్ష పదవి మల్లికార్జున్ ఖర్గే కు, పిసిసి అధ్యక్ష పదవి బీసీ అయిన మహేష్ కుమార్ గౌడ్, స్పీకర్ పదవి గడ్డం ప్రసాద్ కు, డిప్యూటీ సీఎంగా బట్టి విక్రమార్కకు వచ్చిందని తెలిపారు.బీఆర్ఎస్ పార్టీలో కెసిఆర్, కేటీఆర్లకు తప్ప ఎవరికీ పదవులు రావన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం విస్మరించిన ప్రాజెక్టులన్నిటికీ నిధులు కేటాయించి పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు.పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీలకు గాయాలు

మహబూబాబాద్

నర్సింహులపేట మం. పెద్దనాగారం స్టేజి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం 17 మంది మహిళ కూలీలతో వెళుతున్న ఆటో ను లారీ ఢీకొంది. ఐదుగురి పరిస్థితి విషమంగా వుంది. , మరో 8 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్ లలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు అందరూ తొర్రూర్ మండలం చెర్లపాలెం గ్రామానికి చెందినవారు. మిర్చి తోట ఏరడానికి బంగ్లా వైపు వెళుతుండగా ప్రమాదం జరిగింది.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

అన్నమయ్య బి.కొత్తకోట మండలం, కనికిల తోపు లో శు క్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని 58ఏళ్ళ వ్యక్తి మృతి చెందాడు. కొత్తకోట మండలంలోని గోళ్లపల్లి సమీపంలోని దొడ్లడైరీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడన్న సమాచారం అందుకున్న బి.కొత్తకోట పోలీసులు, వెంటనే గోళ్ళపల్లి వద్దకు చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. పంచనామ అనంతరం పోస్టు మార్టం కోసం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది

## ట్రావెల్స్ బస్సు ఢీకొని ఏఆర్ జవాన్ మృతి

కడపదువ్వూరు మండలం ఇడమడక చెక్పోస్ట్ వద్ద తెల్లవారుజామున కానిస్టేబుల్ ను కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఘటనలో ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ బండి నారాయణకు తీవ్ర గాయాలు అయ్యాయి.

# బొట్టు బొట్టును ఒడిసిపట్టు.. భవిష్యత్ తరాలకు నీటిని అందించు

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ప్రపంచ నీటి దినోత్సవాన్ని ప్రతిసంవత్సరము మార్చి 22 వ తేదీన నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి తీర్మానించినది. ప్రపంచ నీటి దినోత్సవాన్ని అంతర్జాతీయంగా పాటించాలన్న ఆలోచన, పర్యావరణం, ప్రగతి అనే అంశంపై 1992లో రియో డి జెనెరోలో జరిగిన ఐక్యరాజ్యసమితి మహాసభ " (యు ఎన్ సి ఇ డి) లో రూపుదిద్దుకున్నది. ఇందులో భాగంగా, 2010 సంవత్సరాన్ని " ఆరోగ్యవంతమైన ప్రపంచంకోసం, పరిశుభ్రమైన నీరు " అనే, నిర్దిష్ట భావనతో పాటించడం జరుగుతుంది. మనం నివసించే భూగోళంలో 70 శాతానికిపైగా నీరే. అయితే, ఇందులో శుభ్రమైన నీరు చాలా స్వల్ప భాగం మాత్రమే. మొత్తం భూగోళంలోని నీటిలో దాదాపు 2.7 శాతం మాత్రమే శుభ్రమైన నీరు కాగా, ఇందులోనూ 75.2 % ధృవప్రాంతాలలో మంచురూపంలో ఘనీభవించి వుంటే, మరో 22.6 % నీరు భూగర్భంలో వుంది. మిగతా నీరు సరస్సులు, నదులు, వాతావరణం, గాలిలోని తేమ, భూమిలోని చెమ్మ, చెట్టు చేమలలో వుంటుంది. ఇంతేకాదు, సరస్సులు, నదులు, భూగర్భ జలాలలో కూడా మానవ వినియోగానికి, ఇతర అవసరాలకు చక్కగా ఉపయోగపడగలిగిన నీరు, చాలా కొద్ది పరిమాణం మాత్రమే.ప్రపంచం మొత్తంలో లభ్యమయ్యే, పరిశుభ్రమైన నీటిలో, 1 % కంటెకూడా తక్కువ పరిమాణంలో, ( లేదా, భూమిపై లభించే మొత్తంనీటిలో దాదాపు 0.007 % మాత్రమే) నీరు మానవ వినియోగానికి నేరుగా ఉపయోగపడుతుంది. ప్రతిరోజూ , మనకు కనీసం 30-50 లీటర్ల పరిశుభ్రమైన, సురక్షితమైన నీరు అవసరం. కాని, ఇప్పటికీ, 88.4 కోట్ల మంది( 884 మిలియన్ల మంది) ప్రజలకు సురక్షితమైన నీరు అందుబాటులో లేదు.ప్రపంచవ్యాప్తంగా, ప్రతిఏటా , 1,500 ఘన కిలోమీటర్ల పరిమాణంలో, వ్యర్ధమైన నీరు వస్తుంటుంది. వ్యర్థ పదార్థాలను, వ్యర్థమైన నీటిని పునర్వినియోగ ప్రక్రియ ద్వారా, ఇంధనోత్పత్తికి, వ్యవసాయ అవసరాలకు వినియోగించవచ్చు. కాని, సాధారణంగా , అలా జరగడం లేదు. అభివృద్ధిచెందుతున్న దేశాలలో, తగిన నిబంధనలు, వనరులు లేనికారణంగా, 80 శాతం వ్యర్థాలను పునర్వినియోగ ప్రక్రియకు మళ్ళించకుండానే పారవేస్తున్నారు. పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక ప్రగతికూడా, కొత్తరకాల కాలుష్యానికి మూలమవుతున్నాయి. ఇదే దామాషాలో, పరిశుభ్రమైన నీటి అవసరం పెరుగుతున్నది. ఈ కారణంగా, ఇటు వర్తమానంలోను, అటు భవిష్యత్తులోను మానవ ఆరోగ్యానికి , పర్యావరణ స్వచ్ఛతకు ముప్పు పొంచివుండగా ; తాగడానికి ఉపయోగపడే పరిశుభ్రమైన నీటికి, వ్యవసాయ అవసరాలకు కావలసిన నీటికి తీవ్రమైన కొరత ఏర్పడుతున్నది. అయినప్పటికి, నీటి కాలుష్యం 'అత్యవసరంగా దృష్టిసారించవలసిన అంశం' అనే ప్రస్తావన, అరుదుగా కాని రావడంలేదు.నీళ్లు-నిజాలువేసవి వస్తోందంటేనే భయమేస్తోంది. నీటి కొరత దడ పుట్టిస్తుంది. బిందెలతో బారులు తీరే జనాలు కనిపిస్తారు. మరి నీటి సమస్య అంత విస్తృతమైనది. నీరు లభించని ప్రాంతాలలో ఎదురయ్యే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. నేల తల్లి నెర్రెలిచ్చి నీటిచుక్కకోసం ఆబగా ఎదురుచూస్తుంటే ఇక మానవమాత్రులెంత! గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచిపోవాల్సిన పరిస్థితి. పరిశుభ్రమైన నీళ్లు దొరక్క కుంటల్లో, గుంటల్లో అడుగుబొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితి. ఇలాంటి కఠోర వాస్తవాలు కొన్ని...ప్రపంచంలో 80 దేశాలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. భూమండలంమీద లభించే నీటిలో ఉప్పు సుముద్రాల వాటా 97 శాతం. మిగిలిన దానిలో 69 శాతం హిమపాతం, మంచుగడ్డలే. భూమి మీద లభించే నీటిలో 0.008 శాతం మాత్రమే స్వచ్ఛమైన నీరు.క్రీశ 2025 నాటికి 48 దేశాల్లో తీవ్రమైన నీటికొరత వస్తుందని చికాగోలోని జాన్ హాప్కిన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ హెచ్చరించింది.3.575 మిలియన్ల మంది ప్రతి సంవత్సరం నీటికి సంబంధించిన వ్యాధులతో మరణిస్తున్నారు. నీటిమూలంగా సంభవించిన 43 శాతం మరణాలకు అతిసారవ్యాధే కారణం.పైన పేర్కొన్న మరణాలలో 84 శాతంమంది 14 ఏళ్ల లోపువారే.98 శాతం మరణాలు అభివృద్ధి చెందుతున్న దేశాలలోనే సంభవిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆసుపత్రులలో చికిత్సపొందుతున్న రోగులలో సగం మంది నీటి సంబంధ వ్యాధులతో బాధపడుతున్నవారే. భూమిమీదున్న నీటిలో ఒక్క శాతానికంటే తక్కువ మొత్తం నీళ్లు మాత్రమే మానవాళి వెనువెంటనే వాడుకునేలా వున్నాయి.అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని మురికివాడల్లో నివసించే ఒక వ్యక్తి రోజుమొత్తంమీద ఉపయోగించే నీరు ఒక అమెరికన్ స్నానానికి వాడే నీటితో సమానం.లీటరు నీటికి మురికివాడల్లో నివసించే పేదలు, అదే నగంలోని ధనికులకంటే 5-10 రెట్లు అధికధర చెల్లిస్తున్నారు.ఆహారం లేకుండా మనిషి కొన్ని వారాలపాటు వుండగలడు. కానీ నీరు లేకుండా కొద్దిరోజులు మాత్రమే వుండగలడు.ప్రతి 15 సెకన్లకు ఒక చిన్నారి నీటి సంబంధ వ్యాధితో చనిపోతోంది. లక్షలాది మంది మహిళలు, పిల్లలు రోజువెుత్తం మీద అనేక గంటల సమయాన్ని సుదూర ప్రాంతాలనుంచి నీళ్లు తేవడం కోసం వెచ్చిస్తారు.నీటి కోసం ఒక రోజును ఎందుకు కేటాయించారు? నీరు లేని భూమిని ఒకసారి ఊహించుకోండి. పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహా సముద్రాలు ఏమీ ఉండవు. ఇవేవీ లేకుండా ఎండిపోయిన మట్టి గడ్డలా ఉంటుంది భూమి. అంతటి అమూల్యమైన నీటి విలువను తెలుసుకోడానికి, దానిని వృథా చేయకుండా అవగాహన కల్పించడానికి ఈ రోజును కేటాయించారు. ఐక్య రాజ్య సమితి 1993 నుంచి ప్రతి ఏడాది మార్చి 22ను అంతర్జాతీయ జలదినోత్సవంగా గుర్తించాలని నిర్ణయించింది. మన భూమ్మీద నీటి గురించి కొన్ని నిజాలు తెలుసుకుంటే అదెంత విలువైనదో అర్థం అవుతుంది. భూమి ఏర్పడినప్పుడు ఎంత నీరు ఉందో ఇప్పుడూ అంతే ఉంది. పెరగడం కానీ తరగడం కానీ కాలేదు. కానీ ఆ నీటిని వాడుకునేవారి జనాభా మాత్రం విపరీతంగా పెరిగిపోయింది. అందుకే ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది నీటి కోసం కటకటలాడుతున్నారు. భూమ్మీద ఉన్న నీరు ఎండకు ఆవిరవుతూ, మేఘాలుగా మారుతూ, వర్షంగా కురుస్తూ, భూమిలో ఇంకుతూ, సముద్రంలో కలుస్తూ వేర్వేరు రూపాల్లోకి మారుతూ ఉంటుంది. అంటే ఒకప్పుడు డైనోసార్లు ఎంగిలి చేసిన నీటినే ఇప్పుడు మనం కూడా తాగుతున్నామన్నమాట.

# ఎస్సీ వర్గీకరణతో దేశానికి ఆదర్శంగా తెలంగాణ
## 30 ఏళ్ళ వర్గీకరణ పోరాటానికి దారి చూపిన కాంగ్రెస్

,పెద్దపల్లి ప్రతినిధి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చారిత్రాత్మకం, 11ఏళ్ళలో తెలంగాణకు బీజేపీ చేసిందేమీలేదని, సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించి దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం పట్ల పెద్దపల్లి పట్టణం లోని చేకురాయి క్రాస్ నుండి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈ సందర్భంగా జెండా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ, మాదిగ ఉపకులాలు చేసిన పోరాటానికి దారిచూపిన ఘనత కాంగ్రెస్ దేనన్నారు. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ పేరు ప్రఖ్యాతులు గల 4 గురు న్యాయవాదులను నియమించి 7 గురు న్యాయమూర్తుల ధర్మాసనానికి బలమైన వాదనలు వినిపించి 6 గురు న్యాయమూర్తులు వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పు వచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేశారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం జరిగిందన్నారు. అందరినీ సమన్వయం చేస్తూ ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి మండలికి కృతజ్ఞతలు తెలిపారు.

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాజ్యాంగం మేరకు రాష్ట్రంలో షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ ద్వారా ఎస్సీలను 3 భాగాలుగా విభజించిన 15 శాతం రిజర్వేషన్లు వాటా తేల్చామని అన్నారు. 1930లో బ్రిటీష్ కాలంలో కుల గణన జరిగిందని, 95 ఏళ్ళ తర్వాత తెలంగాణలో బీసీ కులగణన నిర్వహించడం చారిత్రాత్మకమన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించారని తెలిపారు. బీసీ బిల్లును కేంద్రానికి పంపి పార్లమెంటులో చట్టబద్ధత పొందేవరకు పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ పోరాడాలని కోరారు. పార్లమెంటులో బీసీ బిల్లుకు ఆమోదం తెలిపి బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించు కోవాలని హితవు పలికారు. 11 ఏళ్ళ పాలనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేసిందేమీలేదని విమర్శించారు. ఎన్డీయే పాలనలో దేశం ఆర్థికంగా దివాళ తీసిందని, మోడీ అసమర్థ పాలనకు ఇదే నిదర్శనమన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు గుండు సున్నా ఇచ్చారని ఎద్దేవా చేశారు. నల్ల చట్టాల పేరుతో రైతులను ఢిల్లీ నడి ఒడ్డున కాల్చి చంపిన బీజేపీకి కాంగ్రెస్ పై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1200 కోట్లు సన్నవడ్లకు బోనస్ చెల్లిస్తే పెద్దపల్లి నియోజక వర్గ రైతులకు రు.58.62 కోట్లు సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించమని తెలిపారు. యువ వికాసం ద్వారా అర్హులైన యువతకు ఉపాధి కోసం సబ్సిడిపై రుణాలు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పారదర్శకంగా పాలన చేస్తూ అభివృద్ధి, సంక్షేమం సాధిస్తుంటే బీఆర్ఎస్ నేత కేటీఆర్ కళ్ళు, చెవులు లేని గుడ్డి, చెవిటి వాడిలా ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్న యాసంగిలో కూడా గింజ కటింగ్ లేకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, సన్న వడ్లకు రూ. 500 బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించేందుకు నిరంతరం కాల్వల వెంట తిరుగుతున్నామని, పొలాలు ఎండకుండా సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పార్టీ కార్యకర్తల కృషితోనే పార్టీకి మనుగడ ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పునాది అని, యువ వికాసం పథకం ద్వారా అర్హులైన కార్యకర్తలకు సబ్సిడీ రుణాలు అందజేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని వివరించారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, ప్రకాష్ రావు, తిరుపతి రెడ్డి, నాయకులు గోపగాని సారయ్య గౌడ్, మస్రత్, బూశనవేణ సురేష్ గౌడ్, సందనవేన రాజేందర్, బందారి సునీల్, ఆరె సంతోష్, కదార్ల శ్రీనివాస్, దొడ్డుపల్లి జగదీష్, జాని, బొడ్డుపల్లి శ్రీనివాస్, బూతగడ్డ సంపత్, సుధాకర్ రెడ్డి, నేత్తెట్ల కుమార్, గుజ్జుల కుమార్, ఆరగొండ రాజ్ కుమార్, రవీందర్, పరమేశ్వర్, దాసరి రాజేశం, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 165 లక్షల కోట్లకు చేరుకున్న అప్పులు

హైదరాబాద్, మార్చి 21,

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అప్పులు ఒక ముఖ్యమైన అంశంగా ఉన్నాయి. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌తో కలిపి ఉన్న అప్పుల్లో తెలంగాణ వాటా రూ. 1.52 లక్షల కోట్లుగా నిర్ణయించబడింది. అప్పటి నుంచి వివిధ ప్రభుత్వాలు అభివద్ధి పనులు, సంక్షేమ పథకాల కోసం అప్పులు తీసుకుంటూ వచ్చాయి. 2023?24 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి సుమారు రూ. 15 లక్షల కోట్లుగా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే, అప్పుల స్థాయి గురించి ఖచ్చితమైన సమాచారం రాష్ట్ర బడ్జెట్ ప్రకటనలు, కాగ్(కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదికల ద్వారా తెలుస్తుంది. 2025?26 బడ్జెట్‌లో తెలంగాణ వెుత్తం వ్యయం రూ. 3,04,965 కోట్లుగా ప్రకటించబడింది. ఇందులో అప్పుల గురించి స్పష్టమైన ప్రకటన చేశారు.2026 మార్చి నాటికి తెలంగాణ అప్పులు రూ.5,04,814 కోట్లకు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత 15 నెలల్లో రూ. 1.52 లక్షల కోట్ల అప్పు చేసింది.తెలంగాణ అప్పుల భారం ఒక వివాదాస్పద అంశంగా ఉంది. 2014లో విభజన సమయంలో రూ.1.52 లక్షల కోట్ల అప్పులతో ప్రారంభమైన రాష్ట్రం, 2025 మార్చి నాటికి రూ.5.04 లక్షల కోట్ల అప్పుల స్థాయికి చేరినట్లు చెబుతున్నారు. ఇందులో గత ప్రభుత్వం హయాంలో కాళేశ్వరం వంటి పెద్ద ప్రాజెక్టుల కోసం తీసుకున్న అప్పులు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత 15 నెలల్లో రూ. 1.52 లక్షల కోట్లు అప్పుగా తీసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. అయితే, ఈ అప్పుల్లో ఎంత భాగం అభివద్ధికి, ఎంత సంక్షేమ పథకాలకు ఉపయోగపడిందనేది స్పష్టమైన లెక్కలు లేకుండా చర్చనీయాంశంగా ఉంది.ప్రతి నెలా రూ. 6,500 కోట్లు అప్పులు, జీతాల కోసం ఖర్చు చేయబడుతుందని, మిగిలిన రూ. 12,000 కోట్లు అభివృద్ధి మరియు ఇతర అవసరాలకు వినియోగించబడుతుందని అంచనా. అప్పులు ఎ ఈ?కలో 33?35% ఉండవచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు, ఇది ఆర్థిక శాస్త్రపరంగా ఆమోదయోగ్యమైన స్థాయిలో ఉన్నప్పటికీ, దీర్ఘకాలంలో ఆదాయ వనరులు పెంచకపోతే భారంగా మారవచ్చు.2025?26 బడ్జెట్‌లో తెలంగాణ మొత్తం వ్యయం రూ.3,04,965 కోట్లుగా ప్రకటించబడింది. ఇందులో ఆరు గ్యారంటీలు (సంక్షేమ పథకాలు), విద్య, వైద్యం, వ్యవసాయం, మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వబడింది. రాష్ట్రం తన ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి రూ. 1 ట్రిలియన్ (సుమారు రూ. 83 లక్షల కోట్లు) స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. దీనికి ఐటీ, పారిశ్రామిక వద్ధి, మరియు వ్యవసాయ ఆధునీకరణ కీలకం కానున్నాయి.

అప్పుల భారం: అప్పులు పెరుగుతున్నప్పటికీ, వాటిని సమర్థవంతంగా ఉపయోగించి ఆదాయ వనరులను పెంచడం ఒక సవాలు.సంక్షేమం వూ టఅభివృద్ధి: సంక్షేమ పథకాలకు భారీగా ఖర్చు చేస్తూ, అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడకుండా సమతుల్యం చేయడం అవసరం.ప్రాంతీయ అసమానతలు: హైదరాబాద్ కేంద్రీకృత ఆర్థిక వృద్ధి ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి మందగించడం ఒక సమస్య.

# అగ్గిపెట్టెలో ఇమిడే చీరకు అబ్బురపడిన మిస్ వరల్డ్ .

సిరిసిల్ల

సిరిసిల్ల నేతన్న ప్రతిభకు మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా అబ్బురపడ్డారు. జిల్లా కేంద్రానికి చెందిన నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ నేసిన అగ్గిపెట్టెలో ఇమిడే చీరను చూసి ఆశ్చర్యానికి గురయ్యారు.ఇంత చిన్న అగ్గిపెట్టెలో అమరిన చీరను నేసిన నేతన్నను అభినందించారు. వివరాల్లోకి వెళితే 2025 మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం 2024 మిస్ వరల్డ్ పోటీలలో విజేతగా నిలిచిన చెక్ రిపబ్లిక్ అందాల భామ క్రిస్టినా హైదరాబాద్ సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని చేనేత కళాకారుల అద్భుత పనితీరును మిస్ వరల్డ్ క్రిష్టినాకు పరిచయం చేశారు. అందులో భాగంగా సిరిసిల్ల నేతన్నల ప్రతిభను ఖండాంతరాలకు వ్యాపింప చేసిన వెల్ది హరిప్రసాద్ తాను నేసిన చేనేతలను మిస్ వరల్డ్ కు చూపించారు. అద్భుత నైపుణ్యంతో నేసిన చేనేత వస్త్రాలను చూసిన మిస్ వరల్డ్ క్రిస్టినా నేతన్న పనితీరుకు మంత్రముగ్ధులయ్యారు.అగ్గిపెట్టెలో ఇమిడి చీరను ప్రత్యేకంగా తన భుజాలపై వేసుకొని ఫోటోలకు ఫోజులిచ్చారు. మిస్ వరల్డ్ సిరిసిల్ల చేనేతలను ప్రశంసించడం పట్ల నేత కళాకారుడు హరి ప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు. సిరిసిల్ల నేతన్నల కీర్తిని విశ్వవ్యాప్తం చేసే దిశగా మరిన్ని ఆవిష్కరణలను రూపొందిస్తానని హామీ ఇచ్చారు.

# కోటి డెబ్బై లక్షల ఆస్తి పన్ను చెల్లించిన కోర్టు

మెదక్

2004 నుండి పెండింగ్ లో సుమారు ఒక కోటి 70 లక్షల పైచిలుకు ఆస్తి పన్నును మెదక్ జిల్లా కోర్టు సముదాయం యొక్క ఆస్తి పన్ను మున్సిపల్ కమిషనర్ సహకారంతో, ఆర్ ఓ మేడం భవాని. వార్డ్ ఆఫీసర్ ప్రహ్లాద్ మరియు మున్సిపల్ సిబ్బంది కృషితో 1,70,42.046. మున్సిపల్ కార్యాలయానికి కోర్టు వారు చెల్లించారు. సహకరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి లక్ష్మీ శారద కి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ఉమ్మడి వరంగల్ లో పది పరీక్షలు ప్రారంభం

వరంగల్వరంగల్ ఉమ్మడి జిల్లాలో టెన్త్ పరీక్షలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. అధికారులు పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసారు. ఈసారి ఐదునిమిషాలు ఆలస్యమైనా అనుమతించమన్నారు అధికారులు. పరీక్ష డ్యూటీ కి వచ్చే ఇన్విజిలేటర్లు మొబైల్స్ తీసుకురావద్దని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల దగ్గర సెక్షన్ 163 బీఎన్ఎస్ అమలు చేసారు. సీసీ కెమెరాలతో పూర్తి పర్యవేక్షణ చేస్తున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో245 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసారు. హనుమకొండ జిల్లాలో 67 పరీక్షా కేంద్రాలు,వరంగల్ జిల్లాలో 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసారు. ములుగు జిల్లాలో21 పరీక్షా కేంద్రాలు, భూపాలపల్లి జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలు వున్నాయి. జనగామ జిల్లాలో 41 పరీక్షా కేంద్రాలు, మహబూబాబాద్ జిల్లాలో 46 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసారు.


# వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి ముఖ్యమంత్రి ఆలయ ప్రవేశం

తిరుమలతన మనవడు నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సమేతంగా తిరుమల చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాత్రి పద్మావతి అతిథి గృహంలో బస చేశారు. శుక్రవారం ఉదయం సాంప్రదాయ వస్త్రాలతో చంద్రబాబు దంపతులు మనవడు దేవాన్ష్, కొడుకు లోకేశ్, కోడలు బ్రాహ్మణితో కలిసి వైకుంఠకు కాంప్లెక్స్ ద్వారా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించారు. వీరికి ఆలయ అర్చకులు ఇస్థికాల్ స్వాగతం పలికారు.

# కేటీఆర్ పాదయాత్రకు అంతా సిద్ధం

హైదరాబాద్, మార్చి 21,

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్త టూర్ ప్రారంభమైంది. తెలంగాణ జిల్లాల్లోని పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశమవుతున్నారు. సూర్యపేట జిల్లా బీఆర్ఎస్ కార్యకర్తలతో కేటీఆర్ భేటీ అయ్యారు. సడెన్‌గా ఇలా కార్యకర్తల వద్దకు వెళ్లాలనే నిర్ణయం వెనుక చాలా పెద్ద కారణమే ఉంది.ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం. 25 సంవత్సరాలు పూర్తి చేసుకోనుంది గులాబీ పార్టీ. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సంబరాలు తెలంగాణ వ్యాప్తంగా జరుపుకోవాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. పార్టీ ప్లీనరీ సభ, ఏప్రిల్ 10 నుంచి 27వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఏప్రిల్ 27వ తేదీన వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై కేటీఆర్ ఈ భేటీల్లో చర్చిస్తారు. దీని కోసం అన్ని జిల్లాల్లో సన్నాహక సభలు నిర్వహించనున్నారు.తెలంగాణ వ్యాప్తపర్యటన ఇప్పుడు పార్టీ వర్గాల్లోను, రాజకీయంగాను చర్చ సాగుతోంది. పార్టీకి కేటీఆర్ అండ్ హరీశ్‌రావు రెండు కళ్లు. 2018 ఎన్నికల తర్వాత కేటీఆర్‌కు వర్కింగ్ ప్రసిడెంట్‌గా కేసీఆర్ ప్రమోషన్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచిన తర్వాత కేసీఆర్ కేబినెట్‌లో కేటీఆర్‌తోపాటు హరీశ్‌రావుకు చోటు కల్పించలేదు. పార్టీలో కేటీఆర్‌కు ప్రమోషన్ ఇచ్చిన కేసీఆర్ హరీశ్‌కు ఏడాది తర్వాత ఆర్థికమంత్రిగా ఛాన్స్ ఇచ్చారు. గత శాసనసభ ఎన్నికల్లోను కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తే హరీశ్‌రావు మాత్రం మెదక్ జిల్లాకే పరిమితమయ్యారు. హరీశ్‌రావును కూడా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించేలా చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదన్న వాదన హరీశ్ అభిమానులు, పార్టీ నేతలు ప్రస్తావిస్తుంటారు. గతంలో ఇలా లీడ్ తీసుకొని పార్టీ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్న సందర్భాలు చాలా తక్కువ. ప్రత్యేక కార్యక్రమాలకే వెళ్లారు తప్ప ఇలా ఎప్పుడూ వెళ్లలేదు. ఇప్పుడు మాత్రం రాష్ట్రవ్యాప్తంగా టూర్ పెట్టుకున్నారు. ఈ మధ్య కాలంలోనే కేటీఆర్ మనసులో మాట చెప్పారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ప్రకటించారు.



అప్పట్లో ఇదో పెద్ద చర్చకు దారి తీసింది. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచనతోనే ఈ ప్రకటన చేశారా లేక కేటీఆర్ తనకు తానుగానే కార్యాచరణ ప్రకటించారా అన్న డిస్కషన్ పార్టీ వర్గాల్లో నడిచింది. ఇప్పుడు పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తోంది. దీన్ని విజయవంతం చేసే బాధ్యతను వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఉన్న కేటీఆర్‌కు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ అప్పగించారు. అందుకే కేటీఆర్ రాష్ట్ర టూర్ చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సన్నాహక సభలు నిర్వహించి పార్టీ నేతలతో మాట్లాడతారు. ఇది కేవలం సిల్వర్ జూబ్లీ వేడుకల కోసం చేస్తున్న సన్నాహకం మాత్రమే కాదంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇది ఓ రకంగా పార్టీ అంతా కేటీఆర్ కనుసన్నల్లోకి తీసుకొచ్చే ఎత్తుగడగా చెబుతున్నారు. కేటీఆర్‌కు కీలక బాధ్యతలు అప్పగిస్తారని ఎప్పటి నుంచో చర్చ నడుస్తున్నా అదే టైంలో సీనియర్ అయిన హరీశ్ పరిస్థితి ఏంటీ ఏ బాధ్యతలు అప్పగిస్తారనే మాట కూడా వినిపిస్తోంది. గులాబీ పార్టీలో సీనియర్ లీడర్లలో హరీశ్ రావు ఒకరు. పార్టీ ట్రబుల్ షూటర్‌గా ఆయనకు పేరు ఉంది. కేసీఆర్ పార్టీపరంగా అప్పగించే ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించడంలో దిట్ట. పార్టీలో ఏ సంక్షోభం వచ్చినా దాన్ని చల్నార్చేది హరీశ్ రావేనని పార్టీ నేతలు చెబుతారు. అటు పార్టీ సీనియర్లను, జూనియర్లను సమన్వయం చేస్తూ పార్టీకి అనుసంధానకర్త పాత్ర పోషిస్తారని టాక్. పార్టీలో కేటీఆర్ కన్నా హరీశ్‌రావే సీనియర్. అయితే కేటీఆర్‌కు ప్రమోషన్ ఇచ్చిన కేసీఆర్ హరీశ్ రావు పాత్ర మాత్రం తేల్చలేదు. మరి ఇప్పుడు గులాబీ సంబరాల సన్నాహక సభలకు కేవలం కేటీఆర్ ఒక్కరే వెళ్తారా... లేక హరీశ్ రావు కూడా జిల్లాలు పర్యటిస్తారా అన్న స్పష్టత ఇంకా లేదు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సంబరాలు, పార్టీ సభ్యత్వ నమోదు, ఏప్రిల్ 27 నాటి బహిరంగ సభ నిర్వహణకు టైం లేదు. దీంతో జిల్లాల పర్యటన బాధ్యతలు హరీశ్‌రావుకు కూడా అప్పగిస్తారా అప్పగించరా అన్న ఉత్కంఠ నెలకొంది. సాధారణంగా భారీ బహిరంగ సభలను విజయవంతం చేసే బాధ్యతలను హరీశ్ రావుకే ఎక్కువగా కేసీఆర్ అప్పగించిన సందర్భాలు ఉన్నాయి. వాటిని విజయవంతం చేసిన చరిత్ర హరీశ్ రావుకు ఉంది. ఏప్రిల్ 27వ తేదీ భారీ బహిరంగ సభ బాధ్యతలు హరీశ్ రావుకే అప్పగించవచ్చన్న వార్తలు వస్తున్నాయి.పార్టీలో ఉద్యమం నాటి నుంచి తనకుంటూ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న ఎమ్మెల్సీ కవితకు అప్పగించే బాధ్యతలు ఏంటనే మరో చర్చ నలుగుతోంది. మద్యం కేసులో జైలుకు వెళ్లి వచ్చినప్పటి నుంచి కవిత దూకుడుగా రాజకీయాల్లో పాల్గొంటున్నారు. ఎస్సీ, బీసీ వర్గాల సమస్యలు, డిమాండ్లపై సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీకి కౌంటర్లు ఇస్తూ పార్టీని బలోపేతం చేసే విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమెకు కూడా ఎలాంటి పార్టీ పదవి ఇవ్వలేదు. కేటీఆర్‌కు పార్టీలో లీడింగ్ పోజిషన్ ఇచ్చిన కేసీఆర్, హరీష్ అండ్ కవితకు అప్పగించే బాధ్యతలు ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. వీరంతా కేసీఆర్ కుటుంబ సభ్యులే. అయినా ఉద్యమాలు చేశారు. రాజకీయాల్లో కూడా ప్రూవ్ చేసుకున్నారు. పార్టీ క్యాడర్‌పై ఈ ముగ్గురి ప్రభావం చాలా ఉంటుంది. అందుకే హరీశ్రావు, కవితకు భవిష్యత్ ఏంటని పార్టీలో వారి పాత్ర గురించే అందరూ ఎదురు చూస్తున్నారు.

# సీసీఐపై సన్నగిల్లుతున్న ఆశలు

అదిలాబాద్, మార్చి 21,

ఆదిలాబాద్ జిల్లాలో పరిశ్రమల పునరుద్ధరణ, కొత్త పరిశ్రమల ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. జిల్లాలో ఇప్పటివరకు చెప్పుకోదగ్గ భారీ పరిశ్రమలేవీ లేకపోవడంతో అభివృద్ధిలో వెనుకబడింది. ఇటీవల వరంగల్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సైతం అనుమతి వస్తుందని ప్రజలంతా భావించారు. కానీ వరంగల్‌కు అనుమతి ఇచ్చిన కేంద్రం.. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టును మాత్రం పక్కన పెట్టింది.మరో వైపు ముప్పై ఏండ్ల కింద మూతబడిన సీసీఐ (సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఫ్యాక్టరీని అయినా తిరిగి ప్రారంభిస్తారన్న ఆశతో ఉన్న ప్రజలకు మరోసారి నిరాశ తప్పలేదు. ఫ్యాక్టరీలోని సామగ్రిని తుక్కు కింద అమ్మేందుకు కేంద్రం టెండర్లు పిలవడంతో ప్రజలంతా హతాశులయ్యారు. ఫ్యాక్టరీని తిరిగి తెరిపించాలంటూ ఆందోళన బాట పడుతున్నారు.ఆదిలాబాద్ పట్టణ శివారులో ఏర్పాటైన సీసీఐ ఫ్యాక్టరీలో 1982 ఆగస్టు 15న సిమెంట్ ఉత్పత్తి ప్రారంభమైంది. సీసీఐకి సొంతంగా 870 ఎకరాలు ఉండగా మరో 2 వేల ఎకరాల భూమిని లీజుకు తీసుకుంది. ఫ్యాక్టరీలో సుమారు 4 వేల మంది ఉద్యోగులు, కార్మికులకు పనిచేసేవారు. 1984లో అప్పటి సీఎం ఎన్టీ.రామారావు, కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి తివారీ చేతుల మీదుగా జాతికి అంకితం చేశారు. అప్పటినుంచి 1991 వరకు సిమెంట్ ఉత్పత్తి చేస్తూ దేశంలోని నలుమూలలకు సరఫరా చేశారు.1991, 1992, 1993లో మూడేళ్ల పాటు వేల కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో ప్రభుత్వం లేవీ పద్ధతి (60 శాతం ప్రభుత్వ కొనుగోళ్లు)ని రద్దు చేయడంతో సీసీఐకి బడ్జెట్ కేటాయింపులు నిలిచిపోయాయి. దీంతో 1993 అక్టోబర్‌లో సీసీఐలో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ఫ్యాక్టరీని తెరిపించాలని ముప్పై ఏండ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తూనే ఉన్నా ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదు.ముప్పై ఏండ్లుగా మూతబడిన ఫ్యాక్టరీ ఎన్నటికైనా తిరిగి ప్రారంభం అవుతుందని స్థానిక ప్రజలు ఎంతో ఆశతో ఉన్నారు. కానీ సీసీఐ ఫ్యాక్టరీలోని యంత్రాలకు సంబంధించిన సామగ్రిని తుక్కు కింద అమ్మేందుకు కేంద్రం మార్చి 7న టెండర్లు ఆహ్వానించింది. సిమెంటు ఉత్పత్తికి వినియోగించిన యంత్రాల సామగ్రి, ఇతర అవసరాలకు వినియోగించిన ఇనుము, పాత వాహనాలు.. ఇలా మొత్తం 71 యంత్రాలు, భవనాల ఇనుప తుక్కు సామగ్రిని అమ్మేందుకు నిర్ణయించిన కేంద్రం, మొత్తం రూ.43.30 కోట్లతో టెండర్లు ఆహ్వానించింది.దీనిపై పెద్దఎత్తున వ్యతిరేకత రావడం, జిల్లాలో ఆందోళనలతో పాటు కార్మిక సంఘాలు కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో యాజమాన్యం టెండర్ ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేసింది. కానీ ఎప్పటికైనా సీసీఐని అమ్మాలన్న ఉద్దేశంతోనే కేంద్రం ఉందంటూ జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే సీసీఐని కాపాడుకునేందుకు పార్టీలు, సంఘాలకు అతీతంగా ఉద్యమ బాట పడుతున్నారు.సీసీఐ ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభించాలంటూ మూడేండ్ల కిందే సీసీఐ సాధన కమిటీని ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. ఇందులో భాగంగా పట్టణ బంద్‌తో పాటు దీక్షలు, రాస్తారోకోల వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. సీసీఐ ఫ్యాక్టరీ సామాగ్రిని తుక్కు కింద అమ్మేందుకు 2022లోనూ యాజమాన్యం టెండర్లు పిలిచింది. అప్పుడు ఆందోళనలు జరగడంతో ఆ ప్రక్రియ కాస్తా నిలిచిపోయింది. తాజాగా మరోసారి తుక్కు కింద అమ్మాలని నిర్ణయిండంతో సీసీఐ సాధన కమిటీ ఉద్యమబాట పట్టింది.ఇందులో భాగంగా రెండు రోజులుగా ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేస్తున్నారు. సీసీఐ పునరుద్ధరణపై ఎన్నికల సమయంలో బీజేపీ లీడర్లు హామీలు ఇస్తున్నారే తప్ప.. ఆచరణలో పెట్టడం లేదని, ఫ్యాక్టరీ పునరుద్ధరణలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు విఫలం అయ్యారంటూ ఆరోపిస్తున్నారు. ఈ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే సీసీఐ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

# తిరుమలలో నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు

### శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందిన నారా కుటుంబం

### అన్నప్రసాద వితరణకు రూ.44 లక్షల విరాళం

### అన్నప్రసాద సముదాయంలో భక్తులకు స్వయంగా అల్పాహారం వడ్డించిన కుటుంబ సభ్యులు

తిరుమలఃనారా దేవాన్ష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నారా కుటుంబం కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు నారా దేవాన్ష్ శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, స్వామివారి ఆశీస్సులు పొందారు. నారా దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్, ఇతర కుటుంబ సభ్యులకు మహాద్వారం వద్ద ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి, నారా దేవాన్ష్ భక్తులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు. ఒక్కరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే ఖర్చు రూ.44 లక్షలను చంద్రబాబునాయుడి కుటుంబం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ కు విరాళం ఇచ్చారు. ఏటా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా నారా కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకుని అన్నదానం చేస్తున్నారు.

# స్థానిక ఎన్నికలకు బిజెపి శ్రేణులు సిద్ధంగా ఉండాలి

### -ప్రభుత్వ పథకాలు ప్రజలను మభ్యపెట్టడానికే

### -ప్రజలను ఓట్లడిగే నైతిక హక్కు బిజెపికే ఉంది

### -బిజెపి నగర విస్తృత స్థాయి సమావేశంలో వక్తల పిలుపు

కరీంనగర్, మార్చి 21(భారత శక్తి):రాబోయే కరీంనగర్ నగరపాలక సంస్థ, స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయకేతనం ఎగురవేయడానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, బిజెపి నాయకులు, మాజీ మేయర్ వై. సునీల్ రావులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి చెందిన విధానం, రాబోయే రోజుల్లో బీజేపి పార్టీ చేయబోయే అభివృద్ధి కార్యక్రమాల పై పార్టీ శ్రేణులకు జిల్లా అధ్యక్షులు కృష్ణా రెడ్డి, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు దిశా నిర్దేశం చేశారు. నగరంలోని ప్రైవేట్ పంక్షన్ హాల్ లో కరీంనగర్ కార్పొరేషన్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే హక్కు కేవలం బిజెపి పార్టీకి మాత్రమే ఉందని, ఇతర రాజకీయ పార్టీల వారికి లేదనీ చెప్పారు. 15నెలలు అవుతున్నా ప్రభుత్వ పాలన చేపట్టిన పాలన దోపిడీ పాలన అన్నారు. కేంద్ర ప్రభుత్వ చొరవ మేరకే నగరం అభివృద్ధి చెందిందని చెప్పారు. ప్రజలకు బీజేపీ పార్టీపై చాలా విశ్వాసం ఉందనీ, దేశం మొత్తం మోడీ వైపు చూస్తున్నారని చెప్పారు. బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల కల్లబొల్లి మాటలకు మోసపోవద్దని సూచించారు. ఎప్పటికప్పుడు ప్రజల వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం



చేస్తున్న మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో నగరంలోని 60స్థానాలకు గాను 40స్థానాలు కైవసం చేసుకుంటుందని ఆశా భావం వ్యక్తం చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరికొకరు విమర్శలు చేస్కుంటూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారనీ ఆరోపించారు.పార్టీ శ్రేణులు ప్రజల మధ్యలే ఉండాలనీ, ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకులకు పార్టీ గుర్తింపు ఇస్తుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు భారతీయ జనతా పార్టీ కే సొంతం చేసుకొని కార్పొరేషన్ పై బిజెపి జెండా ఎగుర వేయాలని కోరారు.కార్పోరేషన్ 66 స్థానాల్లో 40కి పైగా స్థానాలు భారతీయ జనతా పార్టీ కైవసం చేస్కుంటుందనీ జోస్యం చెప్పారు. అయితే కాంగ్రెస్ పార్టీ కి కరీంనగర్ లో నాయకత్వమే లేదనీ, ప్రజలు నాయకులను విశ్వసించే పరిస్థితి లేరని వివరించారు.ఈ సమావేశంలో జిల్లా నాయకులు, నగర నాయకులు పాల్గొన్నారు.

# సందడిగా అల్ఫోర్స్ ఇ-టెక్నో వార్షికోత్సవ వేడుకలు

### వేడుకలను ప్రారంభించిన చైర్మన్ నరేందర్ రెడ్డి







కరీంనగర్, మార్చి 21(భారత శక్తి):విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించాలని, వాటి పట్ల ఆసక్తి కనబరిచే విధంగా ప్రోత్సాహకాలను అందించాలని తద్వారా పట్టు సాధిస్తారని ప్రముఖ గ్రంధకర్త కెప్టెన్.డా.బి. మధుసుధన్ రెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి తో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ మైదానంలో "ఫ్లిక్కర్" పేరుతో నిర్వహించినటువంటి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల భగత్నగర్ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరై సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి చదువుల తల్లి జ్ఞానసరస్వతి మాత విగ్రహానికి పూలమాల వేసి విద్యార్థుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కళల వైభవాన్ని విశ్లేషించి చెప్పాలని తద్వారా వారికి కళల పట్ల ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన ఉండాలని, అందులో పాల్గొనడానికై ఎంతగానో ఆసక్తి తో ఉండాలని తెలుపుతూ వాటిపట్ల దృష్టి సారింపచేయాలని కోరారు. మన దేశచరిత్ర విభిన్న కళలకు విశిష్ఠమైనదని గుర్తుచేస్తూ మనదేశంలో ఉన్నటువంటి కళలు సాంప్రదాయాలు మరేదేశంలో అవలంబించరని చెప్పారు. విద్యార్థులకు వార్షిక ప్రణాళికలో భాగంగా వివిధ కళా నైపుణ్య కార్యక్రమాలను దశల వారిగా నిర్వహిస్తున్నామని, ప్రోత్సాహకాలను అందిస్తున్నామని తెలియజేశారు. విద్యార్థులకు వారాంతపు వినోద కార్యక్రమాలను సైతం నిర్వహిస్తూ వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడంలో సఫలీకృతులం అవుతున్నామని హర్షం వ్యక్తం చేసారు. శుక్రవారం అల్ఫోర్స్ తెలంగాణ విద్యారంగానికి తలమానికమని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని తెలుపుతూ వారి విద్యావిదానాలు చాలా మార్గదర్శకమని మరియు అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధిపరుస్తు విద్యాభివృద్ధికి పర్యాయపదంగా మారారని అభివర్ణించారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ గత 35 సం?లుగా తెలంగాణ రాష్ట్ర విద్యారంగానికి విశిష్ట సేవలు అందిస్తు తలమానికంగా నిలుస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులందరు ఉత్తమం ఉత్తమంగా స్థిరపడేలా అత్యుత్తమ శిక్షణనందిస్తున్నామని చెప్పారు.

ఇటీవల కాలంలో ప్రకటించిన ప్రతిష్ఠాత్మక పరీక్ష అయిన గేట్-2025లో అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించిన యస్.హర్షిత్ రెడ్డి. ఆన్‌ఇండియా 60 ర్యాంకు సాధించిడం చాలా గొప్ప విషయమని తెలుపుతూ గ్రూప్ 1, 2 %డ% 3 ఫలితాల్లో సైతం చాలా మంది అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం మా విద్య విదానానికి నిదర్శనమని తెలుపుతూ భవిష్యత్తులో సైతం అల్ఫోర్స్ అగ్రగామిగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నామని తెలుపుతూ ప్రతి విద్యార్థి లక్ష్యంవైపు అడుగులు వేయాలని కోరారు. వార్షిక ప్రణాళికల్లో భాగంగా నిర్వహించిన పలు పరీక్షలలో మరియు ప్రతిభపాటవ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి గువ్వాగోరింక, మనసా తెలుసా, బుల్లెట్బండి, ఐఆమ్ పర్ఫెక్ట్ - మిస్టర్ పర్ఫెక్ట్, సాహెూ సాహెూ పలు నృత్యాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన దివ్యాంగులకు %ఖణ×ణ% కార్డులు అందేలా చర్యలు తీసుకుంటున్నాం: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 21: శుక్రవారం సాయంత్రం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో %ఖణ×ణ% కార్డుల జారీపై మార్గదర్శకాలు, దివ్యంగుల సమస్యలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు, దివ్యాంగులతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సదరం సర్టిఫికెట్ కు



బదులుగా అర్హులైన ప్రతి దివ్యాంగుడికి యూనిక్ డిసెబిలిటీ ఐడీ (%ఖణ×ణ%) నంబర్‌ను కేటాయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మార్చి 1, 2025 నుండి దివ్యాంగుల పునరావాసం, సాధికారత కోసం డైనమిక్ వెబ్ ఎనేబుల్ సిస్టమ్‌ను రూపొందించిందని తెలిపారు. మీ సేవా కేంద్రాల ద్వారా నూతనంగా %ఖణ×ణ% కార్డులను జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఉన్నవారు, నూతనంగా %ఖణ×ణ% కార్డుల కోసం మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఆసుపత్రిలో స్లాట్ బుకింగ్ చేసి, నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తర్వాత %ఖణ×ణ% కార్డులు జారీ చేస్తారని తెలిపారు. ఈ కార్డులు 21 రకాల వైకల్యం కలిగిన దివ్యాంగులకు అందించడం జరుగుతుందని, స్పీడ్ పోస్ట్ ద్వారా నేరుగా దివ్యాంగుల ఇంటి చిరునామాకు అందుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా అర్హులైన దివ్యంగులకు ప్రభుత్వ పథకాల లబ్ది, పునరావాసం, సాధికారతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అనంతరం %ఖణ×ణ% కార్డుల జారీ మార్గదర్శకాలపై సంబంధిత విభాగాల వైద్యులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, దివ్యాంగులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 1000 కోట్లతో వరంగల్ కార్పొరేషన్ బడ్జెట్

వరంగల్, మార్చి 21

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) 2025?26 ఆర్థిక సంవత్సరానికి భారీ బడ్జెట్ ను ప్రతిపాదించింది. గతేడాది రూ.650.12 కోట్లతో గ్రేటర్ బడ్జెట్ పెట్టగా.. ఈసారి అంచనాలు భారీగా పెంచేసి రూ.1071.41 కోట్లతో ముసాయిదా బడ్జెట్ ప్రవేశ పెట్టారుఇందులో రూ.337 కోట్ల 38 లక్షలు సాధారణ పన్నుల ద్వారా, రూ.728 కోట్ల 10 లక్షలు వివిధ గ్రాంట్ల ద్వారా, రూ 600 కోట్లు డిపాజిట్లు, అడ్వాన్సుల ద్వారా సమకూరుతాయని అంచనా వేశారు. ఈ బడ్జెట్ సమావేశంలో రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పరకాల, వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.బల్దియా సొంత ఆదాయం ద్వారా వచ్చే 337 కోట్ల 38 లక్షల రూపాయలలో 100 కోట్ల రూపాయలు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది జీతభత్యాలు, 29 కోట్ల 92 లక్షల రూపాయలు పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగించనున్నారు. మరో 34 కోట్ల 30 లక్షల రూపాయలు విద్యుత్తు చెల్లింపులు, 33 కోట్ల 74 లక్షల రూపాయలు గ్రీన్ బడ్జెట్, 41 కోట్ల 5 లక్షల రూపాయలు ఇంజనీరింగ్ విభాగానికి కేటాయించారు. 21 కోట్ల 15 లక్షల రూపాయలు సాధారణ నిర్వహణకు, కోటి 40 లక్షల రూపాయలు టౌన్ ప్లానింగ్ కోసం, కోటి 50 లక్షల రూపాయలు డిజాస్టర్ రెస్పాన్స్ కొరకు కేటాయించారు.విలీన గ్రామాలు, బలహీనవర్గాలు నివసించే ప్రాంతాల్లోని స్లమ్ ఏరియాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.24 కోట్ల 77 లక్షలు, అలాగే ప్రజా సౌకర్యాల కల్పన, పార్కుల అభివృద్ధి, జంతువధ శాలలు, వీధి వ్యాపారులు, వెండింగ్ జోన్లు, ఓపెన్ జిమ్ ల ఏర్పాటుకు రూ. 10 కోట్ల 40 లక్షలు, వార్డుల వారీగా అత్యవసర అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.39 కోట్ల 15 లక్షలు కేటాయించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న రూ.187 కోట్ల స్టాంప్ డ్యూటీ ఫండ్స్ ను ముఖ్యమంత్రి మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా ఆ బడ్జెట్ పారిశుధ్య కార్మికులు, ఎలక్ట్రికల్ వర్కర్ల జీతభత్యాలు పెంచడానికి స్లమ్ ఏరియాల అభివృద్ధికి 1/3 బడ్జెట్ కేటాయించేందుకు తోడ్పడిందన్నారు.గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారని, రాష్ట్ర రెండో రాజధానిగా డెవలప్ చేస్తున్నారని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ అభివృద్ధిలో మనమంతా భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగరాన్ని అన్నివిధాలా సుందరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో టెల్ పార్క్ , విమానాశ్రయం, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, స్ట్రోమ్ వాటర్ డ్రైన్, ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజకీయాలకతీతంగా వరంగల్ నగరాభివృద్ధికి అందరు సమష్టిగా కృషి చేయాలని కోరారు.గ్రేటర్ వరంగల్ పాలకవర్గం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యం గా ఉందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన 13 విలీన గ్రామాలున్నాయని, వాటిని అభివృద్ధి పరిచేలా నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారుపరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ కు ధీటుగా వరంగల్ ను అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారన్నారు. అభివృద్ధిలో కార్పొరేషన్కు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. బల్దియాలో అభివృద్ధి జరగాలంటే వివిధ పన్నుల ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని సూచించారు.

# కటకటాల్లోకి నిమ్మకాయల బాబా

కరీంనగర్, మార్చి 21, (న్యూస్ పల్స్)

ఎన్ని మోసాలు జరుగుతున్నా ఎంతమంది మోసపోతున్నా బాబాలపై నమ్మకాలు చచ్చిపోవడం లేదు. అందుకే దీన్నే అవకాశంగా తీసుకుంటున్న కేటుగాళ్లు బాబాల అవతారంలో జనాలను నిలువు దోపిడీ చేస్తున్నారు. అలాంటి ఘటన సిరిసిల్లా జిల్లాలో వెలుగు చూసింది. నిమ్మకాయలతో ఆరోగ్యాలు బాగు చేస్తానని చెప్పే ఓ బాబా మోసాలకు పోలీసులు చెక్ పెట్టారు. ఆర్థిక, వ్యక్తిగత, మానసిక, ఆరోగ్య సమస్యలు నయం చేస్తామంటూ వేములవాడకు చెందిన ఓ వ్యక్తి బాబా అవతారం ఎత్తాడు. బాపు స్వామి పేరుతో స్థానికంగా ప్రజలను తన వద్దకు రప్పించుకొని మోసాలకు పాల్పడేవాడు. ఈ బాపు స్వామి నిజస్వరూపం తెలియని ప్రజలు అమాయకంగా నమ్మారు. ఆ నమ్మకాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్నాడు బాపు స్వామి. పూజలు చేసి సమస్యలు లేకుండా చేస్తామని చెప్పి మహిళలను లోబరుచుకుంటున్నాడు. మంత్రించిన నిమ్మకాయలు ఇస్తే అన్నీ నయం అవుతాయని నమ్మించి మోసాలకు పాల్పడ్డాడు. ప్రత్యేక పూజలు పేరుతో నిమ్మకాయలను ఇచ్చేవాడు. అందులో ఎవరికీ తెలియకుండానే మత్తుమందు చల్లేవాడు. దాని వాసన పీల్చే మహిళలు స్పృహతప్పి పడిపోయేవాళ్లు. అలాంటి వాళ్లపై లైంగిక దాడులకు పాల్పడేవాడు ఈ బాబా. ఆ దృశ్యాలను రికార్డు చేసి బాధితులను బ్లాక్ మెయిల్ చేసేవాడీ బాబా. చాలా మంది బాబా బాధితులు భయంతోనో వేర్వేరు కారణాలతో నోరు విప్పేందుకు భయపడేవాళ్లు. అయినా కొందరు పోలీసులు ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులు నిఘా పెట్టారు. దొంగబాబాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అందులో వందల మంది మహిళల వీడియోలు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో బాబాను అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఇలాంటి బాబాలను అసలు నమ్మొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# వార్షిక తనిఖీల్లో భాగంగా భైంసా గ్రామీణ పోలీస్ స్టేషన్ రికార్డ్స్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.

## -ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహించాలి.

## -క్రైమ్ రేటు తగ్గించే విధంగా సమన్వయంతో విధులు నిర్వహించాలి.

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 21: నిర్మల్ జిల్లా భైంసా రూరల్ పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీల్లో బాగంగా తానిఖీ చేయటం జరిగింది.జిల్లా ఎస్పీ మొదట పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి అనంతరం పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసరప్రాంతాల పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో పని చేసే సిబ్బంది యొక్క డ్రిల్ సమీక్షించారు మరియు ప్రతి శనివారం జరిగే డ్రిల్ పరేడ్ లో పాల్గొనాలని తెలిపారు. సిబ్బంది యొక్క జనరల్ కిట్ లో ఉండే వస్తువుల వివరాలు , వాటి యొక్క ఉపయోగాలు సిబ్బంది కి వివరించారు. వాటిని భద్ర పరిచే విదానాన్ని పరిశీలించటం జరిగింది. వెనువెంటనే పోలీస్ స్టేషన్ లో ఉన్న ప్రభుత్వ వాహన లను మరియు వాటి రికార్డ్స్ ను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివారలు,స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని,ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు.నారి శక్తి ప్రోగ్రాం లో పాల్గొంటున్న మహిళా కానిస్టేబుల్లను ప్రోగ్రాం లో చేసే విధుల గురుంచి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ అక్క లో పాల్గొన్న మహిళా సిబ్బంది తో మాట్లాడి వారు వెళ్తున్న పాఠశాల గురుంచి క్షుణ్ణంగా అడిగి తెలుసుకుని వారికి తగిన సూచనలు చేశారు.నారి శక్తి లో పాల్గొనే సిబ్బంది బ్లూ కోల్ట్ ,పెట్రో కార్ డ్యూటీ లో ఉన్నప్పుడు 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని,స్టేషన్



పరిధిలో సీసీ టీవీల ఏర్పాటుపై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా విధులు నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి,అక్రమ ఇసుక రవాణా, పిడియాస్ రైస్ అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపాలని , పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్న వారిపై నిఘా ఉంచి గంజాయి తాగే వారిని, వారికి సరఫరా చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పి పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది.ఈ కార్యక్రమంలో భైంసా ఏ ఎస్పీ అవినాష్ కుమార్, రూరల్ సి.ఐ నైలు మరియు పట్టణ సిఐ. గోపినాథ్, ఎస్.ఐ లు రవీందర్, భాస్కరా చారి మరియు ప్రొబేషనరీ ఎస్ఐ సుప్రియ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖానాపూర్ నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూషణ్,వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్.







భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 21: నిర్మల్ జిల్లా ఖానాపూర్ నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పడిగెల భూషణ్, వైస్ చైర్మన్‌గా అబ్దుల్ మజీద్ బాధ్యతలు స్వీకరించారు. కమిటీ డైరెక్టర్లు కూడా ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని మరియు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కొత్త కమిటీ కృషి చేయాలని సూచించారు. రైతుల పండించిన మక్కజొన్న, బత్తాయి, పప్పుదినుసులు సహా ఇతర పంటలకు సరైన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, అధికారులు, స్థానిక ప్రముఖులు హాజరయ్యారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా పథకం కింద 4 ఎకరాల వరకు రైతు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయనీ, త్వరలో మిగతా రైతులకు సైతం అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల అభివృద్ధికి పెద్దపీట వేయాలని సూచించారు. రైతు లేనిదే దేశం లేదని, ఆ రైతన్నలను కాపాడాల్సిన బాధ్యత మనందరిదీ అన్నారు. పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు,అధికారులు, జిల్లా ఆర్టీఐ సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూషణ్,వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, డైరెక్టర్లు, మండల అధ్యక్షులు దయానంద్, పట్టణ అధ్యక్షులు రమేష్,మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ మండలాల అధ్యక్షులు, డైరెక్టర్లు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గంగుల బద్దలు కొట్టాల్సింది కేసీఆర్ ఫామ్ హౌస్ గేట్లు.

## -బడ్జెట్ లో కరీంనగర్ జిల్లాకు 800కోట్ల కేటాయింపు

## -రాజీవ్ యువవికాసం 5 లక్షల మందికి రుణాలు

## -సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్



కరీంనగర్, మార్చి 21(భారత శక్తి):ప్రభుత్వం బడ్జెట్ లో కరీంనగర్ జిల్లాకు దాదాపు ఎనిమిది వందల కోట్లు కేటాయించినా, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జిల్లాకు గుండు సున్నా అని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆర్ అండ్ బి అతిధి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కు 179 కోట్లు, శాతవాహన యూనివర్సిటీకి 35 కోట్లు, వరంగల్ కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్స్ కు 41 కోట్లు శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ ఫ్లడ్ ఫ్లో కెనాల్ కు 548 కోట్లు కేటాయించడం జరిగిందని చెప్పారు. మానేర్ రివర్ ఫ్రంట్ కు గతంలో కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు కాలేదని అందుకే కేటాయించలేదని గంగుల కమలాకర్ కళ్లున్న కబోదిలాగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కరీంనగర్ రూరల్ మండలంలోని అన్ని గ్రామాలకు సాగు నీళ్లిచ్చే విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని గతంలో తాగునీటికి సాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడ్డప్పుడు మేము ధర్నాలు చేసినా పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. కరీంనగర్ లో త్రాగు నీటికి ఇబ్బంది కలిగి పంప్ హౌస్ లో బూస్టర్లకు కూడా నీళ్లు అందని పరిస్థితి ఉంటే మున్సిపల్ ముందు ధర్నాలు చేశామని ఆరోజు పట్టించుకోని గంగుల ఇప్పుడు ఆ అవసరం ఏర్పడకున్నా విమర్శించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. స్మార్ట్ సిటీ పనులలో అవినీతి, కేబుల్ బ్రిడ్జి ప్రారంభించిన నెలకే అప్రోచ్ రోడ్డు కుంగడం, కేబుల్ బ్రిడ్జి కి ఆరు కోట్లతో పెట్టిన డైనమిక్ లైట్లు పనిచేయకపోవడం, సుందరీకరణ పేరుతో కోట్లు ఖర్చు చేయడం ఇవన్నీ మీవల్లే సాధ్యమైందని దుయ్యబట్టారు. గతంలో పింకు చొక్కా వాళ్ళకే బిసి బంధు, దళిత బంధు ఇచ్చారని ఇప్పుడు రాజీవ్ యువ వికాసం ద్వారా అర్హులైన వారందరికీ రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారని రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో కాంరెడ్డి రాంరెడ్డి, స్వామి గౌడ్, దన్న సింగ్, ఆర్ష మల్లేశం, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కుర్ర పోచయ్య, దండి రవీందర్, కీర్తి కుమార్, పెద్దిగారి తిరుపతి, మామిడి సత్యనారాయణ రెడ్డి, అనిల్ కుమార్, హనీఫ్, సాయిరాం, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగుసార్లు గెలిచిన గంగుల ఏమి లాభం...?

## -బడ్జెట్ కాపీలు చదివి అసెంబ్లీలో ప్రస్తావించు

## -జిల్లాకు కేటాయింపులు ఏమిటో తెలుసుకో..!

## -గంగులకు కాంగ్రెస్ నేత పురుమల్ల సూచన.





కరీంనగర్, మార్చి 21(భారత శక్తి):వరుసగా నాలుగుసార్లు కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలిచానని, రాష్ట్ర మంత్రిగా ప్రజలకు సేవ చేసినానని గొప్పలు చెప్పుకోవడం కాదని,,రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో ఏ జిల్లాకు ఎన్ని నిధులు కేటాయించారో తెలుసుకొని స్పందించాలని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి పురుమల్ల శ్రీనివాస్ ఘాటుగా సూచించారు. రాష్ట్ర బడ్జెట్ పై కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన విమర్శలను ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తిప్పికొడుతూ బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత మరుసటి రోజు సెలవు దినం, బడ్జెట్ కాపీలను పూర్తిగా చదివి అవగాహన చేసుకోవడానికేనని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో రాష్ట్రం అవినీతిమయంగా మారిందన్న విషయం మరిచిపోవద్దన్నారు. అన్ని రంగాలకు తగిన ప్రాధాన్యతనిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిధులను కేటాయించారని తెలియజేశారు. బడ్జెట్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నిధులు కేటాయించారని కావాలంటే మరోసారి చదువుకోవాలని కోరారు.కాళేశ్వరం ప్రాజెక్టుకు 2685 కోట్ల రూపాయలు కేటాయించారని, శ్రీపాద ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ ఫ్లడ్ కెనాల్ కు రూ.548 కోట్ల రూపాయలు కేటాయించారని ఉమ్మడి జిల్లాకు సంబంధించినవి కావా అని ప్రశ్నించారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కింద 101 కోట్లు కేటాయించారని శాతవాహన యూనివర్సిటీకి 35 కోట్లు కేటాయించారని ఇవి కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో లేవా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు విద్య, సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేసిందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తిచేసేందుకు బడ్జెట్లో అధిక నిధులు కేటాయించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని వివరించారు. గత ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్కరకు రాకుండా పోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దాని మరమ్మత్తుల కోసం 2685 కోట్లు బడ్జెట్లో కేటాయించిన సంగతి తెలుసుకోవాలని ఆయన సూచించారు. ప్రపంచంలోనే అద్భుత ప్రాజెక్టు కట్టామని గొప్పలు చెప్పుకున్న టిఆర్ఎస్ నాయకుల అవినీతి వల్లే కాళేశ్వరం నిరుపయోగంగా మారిందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి రూ.249 కోట్లు, ఎస్సారెస్పీ వరద కాల్వకు రూ.299 కోట్లు కేటాయించిందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కేటాయించిన నిధులతో పెండింగ్ లో ఉన్న స్టేజీ 2 పనులు పూర్తయ్యే అవకాశ ముందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్ టు ఫేజ్ వన్ పనులు త్వరితగతిన పూర్తిచేసి కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో 1.51,400 ఎకరాలకు నీరందించే లక్ష్యంతో ఈ నిధులు కేటాయించారని వివరించారు. గత సర్కార్ హయాంలో నిధుల్లేక నిర్లక్ష్యానికి గురైన శాతవాహన యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించిందని ఇప్పటికే ఈ యూనివర్సిటీకి ఇంజనీరింగ్ కాలేజీ, లా కాలేజీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేశారన్న విషయం తెలుసుకోవాలన్నారు. యూనివర్సిటీ పరిధిలో ఎంఫార్మసీ కోర్సుకు కూడా అనుమతులు లభించాయన్నారు.

కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ఈ నెలాఖరుతో ముగియనున్నదని ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ గా 101 కోట్లు కేటాయించిందన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పరిధిలో ఇంకా 14పనులు నిర్మాణంలో ఉన్నందున వాటిని పూర్తి చేసేందుకు ఈ నిధులు వినియోగిస్తారన్నారు. అలాగే స్పోర్ట్స్ స్కూల్ కు 20 కోట్లు కేటాయించారన్నారు. కనీస సౌకర్యాలు లేక అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులకు బడ్జెట్ ఊరటనిస్తున్న విషయం తెలియదా అని ఆయన నిలదీశారు.

:: పొన్నంను విమర్శించే స్థాయి గంగులకు లేదు...::

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాడు ఎంపీగా ఉద్యమించి నేడు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గురించి మాట్లాడే అర్హత గంగుల కమలాకర్ కు లేవని పురుమల్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. బీసీ సామాజికవర్గానికి మేలు జరగాలనే ఏకైక లక్ష్యంగా కులగణన సర్వేను, బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయడంలో పొన్నం ప్రభాకర్ ముఖ్య భూమిక పోషించారని వివరించారు. మంత్రి గా ఐదేళ్ళు ఉన్న గంగుల కమలాకర్ ఏనాడైనా తన శాఖ గురించి మాట్లాడారా అని నిలదీశారు. బీసీల కోసం నిరంతరం తపించే పొన్నం ప్రభాకర్ ను విమర్శిస్తే సూర్యునిపై ఉమ్మేసినట్లే అవుతుందని ఆయన తేల్చిచెప్పారు. బడ్జెట్ లో బీసీ సంక్షేమానికి 11405 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. గత సంవత్సరం 9200 కోట్లు కేటాయించగా ఈసారి కేటాయింపులు పెరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని ఆయన స్పష్టం చేశారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం బీసీలపై వివక్ష చూపడం వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు న్యాయం చేసే పనిలో ఉందని ఆయన వివరించారు.


# కాంట్రాక్టు ప్రతీపాదికను భర్తీ చేయుటకు అర్హులైన వైద్యుల నుండి దరఖాస్తుల ఆహ్వానం.

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 21: నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాలలో గల స్పెషల్ డాక్టర్ టీచింగ్ స్టాఫ్ పోస్టులను భర్తీ చేయుటకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం జరిగింది దానికి అనుకూలంగా జిల్లా డాక్టర్ నిర్మల్ జిల్లా గారి అనుమతితో నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగములలో గల టీచింగ్ స్టాప్ ప్యాకెట్లను గౌరవ వేతనంతో కూడిన కాంట్రాక్టు ప్రతీపాదికను భర్తీ చేయుటకు అర్హులైన వైద్యుల నుండి దరఖాస్తులను ఆహ్వానించడం అయినది పైన తెలిపిన కోర్సులకు వయసు విద్య అర్హతలు (ఎంబిబిఎస్ ఎండి ఎంఎస్ మరియు /డిఎన్బి.) ఇతర పూర్తి వివరాలకు (%www.gmc.nirmal. com%) వెబ్ సైట్ లో పొందపరచబడినది ఉన్నవి కావున అర్హులైన వైద్య అభ్యర్థులు తేదీ 25 3 25 మంగళవారం రోజున సమయం ఉదయం 10:30 నుండి రెండు గంటల వరకు నిర్మల్ ప్రభుత్వ



వైద్య కళాశాలయందు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించబడును కావున అర్హత గల వైద్య అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపాత్రులతో హాజరు కావలసిందిగా కోరనైనది శ్రీనివాస్ కుమార్ ఎండి ప్రిన్సిపల్ ప్రభుత్వ కళాశాల నిర్మల్. వారు ఒక పత్రిక ప్రగడలో తెలిపారు.

# రవాణా శాఖ కార్యాలయం కు పక్కాభవనం నిర్మించారు.. తారు రోడ్డు మరిచారు



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 21: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి (బి)లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయ ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. సుమారు 8 సంవత్సరాలుగా జిల్లా కార్యాలయం అదే ప్రాంతంలో ఉన్న పక్కా భవనం నిర్మించిన అధికారులు ప్రధాన రోడ్డు నిర్మాణం మరిచారు. అరకిలో మేర ప్రధాన రహదారి నుండి లోపల ఉన్న జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి కనీసం ఆష్టయి తారు రోడ్డు కూడా లేకపోవడంతో వాహన యజమానులు, చోధకులకు నిత్యం తలకు మించిన భారమవుతుందనే విమర్శలు లేకపోలేవు.

# ఉగాది పర్వదినాన ప్రతి ఒక్కరికి 6 కేజీల నాణ్యమైన సన్న బియ్యం

**-స్వతంత్ర భారత దేశ చరిత్రలో 84 శాతం మందికి ఉచితంగా సన్నబియ్యం పంపిణి.**

**-రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి.**

**నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి**



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మార్చి 21:తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం రోజు (మార్చి-30) నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి 6 కేజీల సన్నబియ్యం ఉచితంగా ఇస్తామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మఠంపల్లి మండలంల మట్టపల్లి గ్రామంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి లతో కలిసి మంత్రి యన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ, ధర్మకర్తలు సాధార స్వాగతం పలికారు. పూజార్లు వేదమంత్రాలతో ఆశీర్వాచనాలు అందజేసి స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం పాంచాంగ శ్రవణం కొరకు స్థల పరిశీలన, సభా ప్రాంగణ ప్రదేశాన్ని, వాహనాలను నిలుపు స్థలాన్ని ఆధికారులతో కలసి పరిశీలించారు. తదుపరి మట్టపల్లి ఆర్య వైశ్య సత్రం నందు రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి యన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి నుండి రాష్ట్రంలోని 84 శాతం జనాభాకి 6 కేజీల నాణ్యమైన సన్న బియ్యం ఇచ్చే పవిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని. ఆహ్వానించామని తెలిపారు.గతంలో ప్రజలకి ఇచ్చిన దొడ్డు రకం బియ్యం ప్రజలు తినకుండా 5 రూపాయలకే కోళ్ళ ఫారంలకి,అమ్మటం జరిగి దుర్వినియోగం అయ్యాయని అందుకే నిరుపేదల ఆకలి తీర్చేందుకు సన్న బియ్యం ఇచ్చి విప్లవాత్మక మార్పు తీసుకరాబోతున్నమని తెలిపారు.ప్రజా ప్రభుత్వం ఎన్నికైన మొదటి రోజు నుండి ప్రజలకి ఉపయోగపడే విధంగా అద్భుతమైన పరిపాలన అందజేస్తున్నామని తెలిపారు. హుజూర్ నగర్ నియోజకవర్గం, కోదాడ నియోజకవర్గం ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని మంత్రి ఉత్తమ్ పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో మల్టి జోన్ 2 రేంజ్ ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ పి రాంబాబు, ఆర్డీఓ శ్రీనివాసులు,ఈఓ నవీన్,ఆలయ ధర్మ కర్తలు చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్ కుమార్,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు 600 ఇవ్వాలి: జిల్లా సహాయ కార్యదర్శి సంపత్



కరీంనగర్, మార్చి 21(భారత శక్తి):ఉపాధి హామీలో పనిచేస్తున్న కార్మికులందరికీ రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సంపత్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం మానకొండూరు మండల కేంద్రంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా కార్మికులకు పనిముట్లు ఇవ్వడం లేదని, పని ప్రదేశాలకు ట్రాన్స్పోర్ట్ సౌకర్యం కల్పించడం లేదని, ఉపాధి హామీ కూలి డబ్బులు సరిగా రావడం లేదని తెలిపారని చెప్పారు. కార్మికులు తమ ఇబ్బందులను వెళ్లిబుచ్చారని అన్నారు. వీటి పైన వెంటనే పీడీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో టెంటు మంచినీరు ప్రథమ చికిత్స కిట్టు తప్పకుండా ఏర్పాటు చేయాలని అదేవిధంగా దూర ప్రాంతంలో పనిచేసే కార్మికులకు చట్టంలో పేర్కొన్న విధంగా ట్రాన్స్పోర్ట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికుల పక్షాన పోరాటలు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఉపాధి హామీ కార్మికులకు ఉపయోగపడే విధంగా లేదని దాన్ని సవరించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, బడ్జెట్ నిధులు కేటాయింపుకు రూపకల్పన చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ ఆపరేటర్ సంఘం కార్యదర్శి గట్టు సతీష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సుగుణ అంజలి లక్ష్మీ కనకమ్మ లతా అనూష తదితరులు పాల్గొన్నారు.

# 100, 400 మీటర్ల చాంపియన్షిప్ పోటీలకు సిద్ధార్థ విద్యార్థి

**అభినందించిన చైర్మన్ శ్రీపాల్ రెడ్డి**




కరీంనగర్, మార్చి 21(భారత శక్తి):స్పోర్ట్స్ స్కూల్ క్రీడా మైదానంలో కరీంనగర్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 100, 400 మీటర్ల చాంపియన్షిప్ అండర్ 14 పోటీల విభాగంలో సిద్ధార్థ విద్యార్థి ఎంపికవడం అభినందనీయమని విద్యాసంస్థ చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి అన్నారు. భగత్ నగర్ బ్రాంచ్ లోని 8వ తరగతి చదువుతున్న ఎమ్. సాయి చైతన్య 400 మీటర్ల ఈవెంట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్టేట్ లెవల్ కు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 23 వ తేదీన గాడియమ్ స్పోర్టోపియా స్కూల్ హైదరాబాద్ నందు జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నాడని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షం ప్రకటిస్తు, ఇలాంటి పోటీలలో పాల్గొనడం వలన విద్యార్థులకు ఏకాగ్రత, శరీర దారుఢ్యం కలుగుతుందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని పోటీలలో పాల్గొని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయ బృందం, ఇతర విద్యార్థులు ఎంపికయిన విద్యార్థిని అభినందించారు.

# కరీంనగర్ విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





కరీంనగర్, మార్చి 21(భారత శక్తి):నిరంతర సాధనతో కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు రాణించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.కలెక్టర్ ప్రత్యేక చొరవతో అంబేద్కర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్, ప్రాంతీయ క్రీడా పాఠశాలలోని స్విమ్మింగ్ పూల్ ఆధునికరించారు. క్రీడా పాఠశాలలో యోగా కేంద్రం నిర్మించారు. జిమ్నాస్టిక్స్, యోగ, అథ్లెటిక్స్, జూడో వంటి క్రీడల కోసం అవసరమైన పరికరాలను సమకూర్చారు. క్రీడాకారులకు వసతులు, సౌకర్యాలు కల్పించారు.ఆధునికరించిన తర్వాత స్విమ్మింగ్ పూల్, క్రీడా పాఠశాలను జిల్లా కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఇక్కడ సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్ వద్ద ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటాలని సూచించారు. స్పోర్ట్స్ స్కూల్ వద్ద విద్యార్థుల కోసం ఎటువంటి సౌకర్యాలు అవసరం ఉన్నా సమకూర్చాలని ఆదేశించారు. యోగ, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, జూడో వంటి క్రీడల కోసం అవసరమైన పరికరాలను ప్రాంతీయ క్రీడా పాఠశాలలో సమకూర్చామని, విద్యార్థులు ఈ సదుపాయాలను వినియోగించుకొని క్రీడారంగంలో మరింత రాణించాలని సూచించారు.

ఈ సందర్భంగా కరీంనగర్ ప్రాంతీయ పాఠశాల విద్యార్థుల అథ్లెటిక్స్, యోగ, జూడో, జిమ్నాస్టిక్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# ఐనవోలు పీహెచ్ సీని తనిఖీ చేసిన కలెక్టర్



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి21: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు మెరుగైన సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఇన్ పేషంట్ వార్డును సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ కార్యాలయాన్ని సందర్శించి ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు సిబ్బంది హాజరు పట్టికను, స్టాక్ రిజిస్టర్, మెయింటెనెన్స్ రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కొందరు సమావేశానికి హనుమకొండకు వెళ్ళగా కలెక్టర్ ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్ని ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ రావును అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఓఆర్ఎస్ ప్యాకెట్ల డబ్బాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను సబ్ సెంటర్ల ద్వారా పంపిణీ చేయాలన్నారు. ఆరోగ్య సేవల కోసం ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండి సేవలను అందించాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చిన్ననాటి మిత్రుడికి పూర్వ విద్యార్థుల అండ చిన్ననాటి స్నేహితులు నా బలగం





భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 21: నిర్మల్ జిల్లా దిలావర్పూర్ మండలంలోని సిర్గాపూర్ గ్రామానికి చెందిన నర్సయ్య గతంలో జరిగిన ప్రమాదంతో మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న నర్సయ్య తో కలిసి చదువుకున్న నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 1997-98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు తన ఉదారతను చాటుకున్నారు.నర్సయ్యకు ఆర్థికంగా సహాయం చేయడానికి పూర్వ విద్యార్థులు తమ మధ్యలో రూ.40 వేల నగదును పోగుచేసి అందజేశారు. ఇదే విధంగా, మరో క్లాస్మేట్ అయిన మహాగం గ్రామానికి చెందిన సట్ల సుజాత కూతురు అనారోగ్యం పాలవడంతో ఆమెకు రూ.30 వేల రూపాయలను అందజేశారు. అదనంగా, కుందన్ బేగం అనారోగ్యం కారణంగా కష్టాల్లో ఉన్నందున, ఆమె కుటుంబానికి రూ.7 వేల విలువైన నిత్యావసర సరుకులు మరియు రూ.3 వేల నగదు సహాయాన్ని అందించారు.భవిష్యత్తులో తమ సహాయం ఎప్పటికీ కొనసాగుతుందని, అవసరమైన అన్ని విధాలుగా అండగా ఉంటామని పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఓయు సర్క్యులర్ నీ వెనక్కి తీసుకోవాలి

**-సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని నిలిపివేయాలి**

**-ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరవింద్**




కరీంనగర్, మార్చి 21(భారత శక్తి):భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో మెయిన్ గేట్ వద్ద (హెచ్ సి యూ )భూముల వేలం నిలిపివేయాలని, ఉస్మానియా యూనివర్సిటీ లో సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కోసం ధర్నాలు, నిరసనలు చేయకూడదు అని యూనివర్సిటీ వద్ద ఎలాంటి కార్యక్రమాలు చేయవద్దని సర్క్యులర్ జారివేయడం సిగ్గుచేటు అన్నారు. విశ్వవిద్యాలయలు ఉద్యమాలకు పుట్టినిల్లు, తెలంగాణ ఉద్యమంలో క్రియ శిలకం ఉస్మానియా అలాంటి విద్యార్థి ప్రాంగణంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టద్దని ఆంక్షలు విధించడం ఏమాత్రం సమంజసం కాదనీ మండిపడ్డారు. వైస్ ఛాన్సలర్ కుమార్ ఇలాంటి విధానాలను మానుకోవాలి అని విద్యార్థుల పక్షాన హెచ్చరించారు. అదే విధంగా హైదరాబాద్ విశ్వవిద్యాలయం భూములను అక్రమంగా కాంగ్రెస్ ప్రభుత్వం 400ఎకరాల యూనివర్సిటీ భూములను వేలం వేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆపివేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ప్రభుత్వ భూములను ఇలా పెట్టుబడి దారులకు అమ్ముకుంటూ పోతే రాష్ట్రానికి ఏమి మిగలదు అని అలాంటి ప్రక్రియను ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. యూనివర్సిటీ ల అభివృద్ధి అంటే విద్యార్థుల ఆస్తులను లాక్కోవడమా? ప్రశ్నించే వేదికలు ఉండకుండా వ్యవహరించడమా? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు హామీలను, పూర్తిగా మరిచిపోయి నేడు నిరంకుశ పాలన పాటిస్తుంది. ప్రగతి భవన్ గేట్లు కంచెలను తీసివేసిన ప్రభుత్వం నేడు విద్యార్థి ఉద్యమాల గడ్డ పైన ఆంక్షలు పెట్టి సర్క్యులర్ నీ తీసుకురావడం మూర?త్వం. వెంటనే ఉస్మానియా యూనివర్సిటీ లో సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలని మరియు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ భూముల వెలన్ని ఆపివేయాలని హెచ్చరించారు లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం అవుతూ, యూనివర్సిటీల కు మద్దతుగా స్థానిక యూనివర్సిటీల వద్ద దీక్షలకు దిగుతాం అని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దాడి మహేష్, భాష, వసంత్, దీక్షిత్, మల్లేష్ ,ప్రవీణ్, ప్రేమ్ , శ్రీ హరి, దత్తు, వంశీ, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# పేషంట్ల పై దురుసుగా ప్రవర్తించిన డాక్టర్ పై నిరసన వ్యక్తం చేసిన స్థానికులు




బూర్గంపాడు,మార్చి 21 (భారతశక్తి): మండలం లోని సారపాక పంచాయతీ పరిధిలో గల ఈఎస్ఐ డిస్పెన్సరీలో గల డాక్టర్ కరుణాకర్ పేషంట్ల పై దురుసు ప్రవర్తిస్తున్నాడని స్థానిక ప్రజలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా ఈఎస్ఐ డిస్పెన్సరీ లో వందల సంఖ్యలో మందుల కొరత ఎక్కువగా ఉన్నందున పేషంట్ ఆరోగ్యం క్షీణిస్తున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. సరిపడ మందులు ఇవ్వకుండా ఎప్పుడు వస్తాయని అడిగిన పేషంట్ పై ఇష్టానుసారంగా మాట్లాడిన డాక్టర్ తీరును ఖండిస్తూ నిరసన తెలిపారు. స్థానిక నాయకులు ప్రజలు ఈఎస్ఐ డిస్పెన్సరీ లో మందుల కొరత పై ఉన్నత అధికారులు తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని కోరారు.

# డేవిడ్ మిల్లర్ ఎమోషన్స్‌తో ఆడుకోవద్దు: లఖ్‌నవూ మేనేజ్‌మెంట్‌పై విమర్శలు

శనివారం నుంచి ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విడుదల చేసిన ఓ వీడియో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఎల్ఎస్‌జీ ప్లేయర్, దక్షిణాఫ్రికా క్రికెటర్ డేవిడ్ మిల్లర్ 'హార్ట్ బ్రేక్' క్షణాలు ఏంటనే దానిపై స్పెషల్‌గా ఓ వీడియోను రూపొందించింది. ఆఖర్లో ఇచ్చిన క్యాప్షన్ ఇప్పుడు నెట్టింట దుమారం రేపింది. ఇంతకీ ఆ వీడియోలో ఏముంది? మిల్లర్ ఏం చెప్పాడు? ఫ్యాన్స్ ఎలా రియాక్ట్ అయ్యారో చూద్దాం.




గత ఐపీఎల్ మెగా వేలంలో డేవిడ్ మిల్లర్‌ను ఎల్ఎస్‌జీ రూ.7.5 కోట్లకు దక్కించుకుంది. గుజరాత్ టైటాన్స్ రిటైన్ చేసుకోని విషయం తెలిసిందే. మార్చి 24న ఢిల్లీ క్యాపిటల్స్‌తో లఖ్‌నవూ తొలి మ్యాచ్ ఆడనుంది. దీంతో తమ జట్టు ప్రమోషన్ కోసం మిల్లర్‌తో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శుభమ్ గౌర్ చిట్‌చాట్ నిర్వహించాడు. ఈ సందర్భంగా నాకౌట్ మ్యాచుల్లో ఓడిపోవడం వల్ల మనసు విరిగిన ఘటనలు ఏంటనే ప్రశ్నలు అడిగాడు. దానికి సమాధానం ఇచ్చిన మిల్లర్ 'టీ20 ప్రపంచకప్ ఫైనల్ ఓటమి' తనను మరింత బాధ పెట్టిందని చెప్పాడు. ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లోనూ నపారీ జట్టుకు చుక్కెదురైన సంగతి తెలిసిందే. 'ఈ సీజన్ నీ హార్ట్‌బ్రేక్‌లను జీరో చేసేస్తుంది' అని క్యాప్షన్ ఇచ్చింది. దీంతో మిల్లర్ ఎమోషన్స్‌తో ఇంటర్వ్యూలు చేయడం అవసరమా? అనే విమర్శలు రావడం మొదలెట్టాయి.

"ఈ వీడియోను చూసేందుకు నాకు చాలా అసౌకర్యంగా అనిపించింది. డేవిడ్ మిల్లర్‌కు నేను పశ్చాత్తాపం వ్యక్తంచేస్తున్నా. అతడి ముందే వరుసగా వైఫల్యాలను అడుగుతూ ఉంటే అక్కడే ఉండటం చాలా బాధగా అనిపించింది"

"లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సోషల్ మీడియా టీమ్‌ను తొలగించండి. ఇది చాలా బాధాకరం. అత్యంత దారుణమైన ప్రశ్నలు"

"ఇది చాలా తీవ్ర భావోద్వేగం కలిగించే వైఖరి. లఖ్‌నవూ ఎప్పటికీ గొప్ప జట్టు కాలేదు. ప్లేయర్లతో ఎలా ఉండాలో వారికి తెలియదు"

"అతడేమన్నా మూరు?డా? ఇలాంటి వ్యక్తికి ఇంటర్వ్యూ చేయమని లఖ్‌నవూ ఎలా పర్మిషన్ ఇచ్చిందో అర్థం కావడం లేదు. దక్షిణాఫ్రికా ఓటముల గురించి ఇప్పుడెందుకు?"



# ఉప్పల్‌లో ఐపీఎల్ మ్యాచ్.. 2700 మంది పోలీసులతో భారీ భద్రత

హైదరాబాద్: మార్చి 22 నుంచి ఐపీఎల్ 2025 ప్రారంభం కానున్న వేళ రాచకొండ పోలీసులు అప్రమత్తమయ్యారు. మార్చి 23న ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగే మ్యాచ్‌కు ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశారు. మొత్తంగా 2700 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉప్పల్ స్టేడియంలో 450 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్టేడియంలోనే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఏసీపీ సారథ్యంలో భద్రతను పర్యవేక్షించనున్నారు.

మరోవైపు, స్టేడియం ఎంట్రన్స్ వద్ద స్నిఫర్ డాగ్స్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టనున్నారు. క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే మహిళల కోసం మహిళా భద్రతా విభాగం బృందాలను ఏర్పాటు చేశారు. అభిమానుల కోసం ఐదు చోట్ల ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి వాటర్ బాటిల్స్, ల్యాప్‌టాప్, అగ్గిపెట్టెలు, పలు ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించినట్లు పోలీసులు తెలిపారు. ఐపీఎల్ మ్యాచ్ ఉన్న రోజుల్లో నగరంలో అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు నడవనున్నాయి.




# ఒకప్పుడు రంజీ.. ఇప్పుడు ఐపీఎల్ : ఆటగాళ్ల కెరీర్‌ను మెరిపిస్తున్న టోర్నీ

ప్రస్తుతం టీమ్ ఇండియా వైట్‌బాల్ క్రికెట్‌లో తిరుగులేని జట్టుగా నిలిచింది. ముఖ్యంగా 2007 తర్వాత ఈ మార్పు స్పష్టంగా మొదలైంది. గతంలో జట్టులో స్థానం దక్కాలంటే రంజీ, దులీప్ ట్రోఫీ వంటి దేశవాళీ టోర్నీల్లో రాణించాల్సిందే. కానీ, ఐపీఎల్‌తో ఇప్పుడు యువ క్రికెటర్లకు జట్టులో వైల్డ్‌కార్డ్ ఎంట్రీ లభిస్తోంది. అంతేకాదు.. వీరిలో చాలామంది టీమ్ ఇండియాకు ఎంపికవుతున్నారు. ముఖ్యంగా బ్యాటర్లు ఇక్కడి అనుభవంతో మైదానంలో అంతర్జాతీయ స్థాయి బౌలింగ్ వేసే వారిని కూడా అలవోకగా ఎదుర్కొంటున్నారు. అలా జట్టులోకి అడుగుపెట్టి తమ స్థానాలు సుస్థిరం చేసుకొన్న ఆటగాళ్లు ఎందరో..

స్వయం కృషితో సిరాజ్..

హైదరాబాద్‌కు చెందిన ఓ ఆటోడ్రైవర్ కుమారుడైన సిరాజ్ (మూర్తిగా స్వయంకృషితోనే) బౌలింగ్‌ను మెరుగుపర్చుకొన్నాడు. 2015లో తొలిసారి రంజీ ట్రోఫీ ఆడాడు. ఆ సీజన్‌లో 41 వికెట్లు సాధించాడు. అతడిలో సత్తాను గుర్తించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.20 లక్షలకు కొనుగోలు చేసింది. ఆ తర్వాతి సీజన్‌లోనే అతడిని ఆర్సీబీ రూ.2.6 కోట్లకు సొంతం చేసుకొంది. అంతేకాదు.. టీమ్ ఇండియా పేస్ దళంలో సిరాజ్ కీలకంగా మారాడు. 2023 ఆసియాకప్ ఫైనల్స్‌లో శ్రీలంకను ఒంటిచేత్తో కుప్పకూల్చి భారత్‌కు టైటిల్ అందించాడు.

రూ.10తో అవసరాలు తీర్చుకొన్న జడ్డూ..

ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డ్ కుమారుడైన రవీంద్ర జడేజా (%ఖుజజఅతీఱ ఙుఎఱ%) చాలా చిన్నస్థాయి నుంచి ఎదిగాడు. క్రికెట్ కెరీర్ తొలినాళ్లలో రోజుకు కేవలం రూ.10తో అవసరాలు తీర్చుకొనేవాడు. 2008 అండర్-19 ప్రపంచకప్‌లో అద్భుతంగా రాణించడంతో.. అతడు ఐపీఎల్ ఫ్రాంఛైజీల కళ్లల్లో పడ్డాడు. రాజస్థాన్ రాయల్స్ అదే ఏడాది అతడిని కొనుగోలు చేసింది. ఇక కెరీర్‌లో జడ్డూ వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. 2023లో చెన్నై జట్టు అతడిని రూ.16 కోట్లకు సొంతం చేసుకొంది.

నూడుల్స్ తిని కడుపునింపుకొన్న పాండ్యా బ్రదర్స్..

మరో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా పేద కుటుంబం నుంచి వచ్చిన ఆటగాడే. అతడి కుటుంబం బరోడాలోని ఓ చిన్న ఇంట్లో నివాసం ఉండేది. అప్పట్లో అతడి తండ్రి హార్దిక్, కృనాల్ (%ఖుఱతీఅఱ ఖఅ ఖతీఱఖఱఖ్రీ ౫ుఱఅఎఱ%) క్రికెట్ కోచింగ్, చిన్నాచితకా పనులు చేసేవాడు. ఇద్దరు సోదరులు కొన్నాళ్లు మ్యాగీ నూడుల్స్ మాత్రమే తిని కడుపు నింపుకొన్న రోజులు ఉన్నాయి. దేశవాళీలో రాణించడంతో.. 2015లో ముంబయి ఇండియన్స్ అతడిని రూ.10 లక్షలకు కొనుగోలు చేసింది. 2022లో గుజరాత్ టైటాన్స్ రూ.15 కోట్లకు దక్కించుకొంది. అతడిని ముంబయి జట్టు భారీ ధరకు తిరిగి దక్కించుకొంది.

ఫినిషర్‌గా ఆశాకిరణం రింకూ సింగ్..

వైట్‌బాల్ క్రికెట్‌లో టీమ్ ఇండియాలో ఫినిషర్ స్థానానికి ఆశాకిరణంగా మారిన రింకూసింగ్ (%=అఅఎఐ ఱఅఅస్త్ర%) ప్రతిభ ఐపీఎల్‌తోనే వెలుగులోకి వచ్చింది. 2014లోనే దేశవాళీ క్రికెట్‌లో వివిధ జట్లకు ఆడిన రింకూను 2017లో పంజాబ్ జట్టు దక్కించుకొంది. ఆ తర్వాతి సంవత్సరమే కోల్‌కత్తా జట్టు అతడిని తీసుకొంది. 2023 ఐపీఎల్ సీజన్‌లో గుజరాత్‌పై జరిగిన మ్యాచ్‌లో అతడు చివరి ఓవర్లో ఏకంగా 5 సిక్సర్లు కొట్టి జట్టుకు విజయాన్ని అందించాడు. ఆ ఇన్నింగ్స్‌తో ఐపీఎల్‌లో హాట్ ప్లేయర్‌గా మారాడు.

టెంట్‌లో జీవించిన జైస్వాల్..

క్రికెట్ మీద ప్రేమతో యూపీ నుంచి ముంబయికి వచ్చిన కుర్రాడు యశస్వీ జైస్వాల్ (%ుంఱ్రుజఱఙ ఱుఱఅఱుఱశ్రీ%). ఆర్థిక స్థోమత సహకరించకపోయినా.. మైదానంలోని టెంట్‌లో ఉంటూ క్రికెట్ ఆడాడు. పొట్టకూటి కోసం పానీపూరీలు కూడా విక్రయించాడు. దేశవాళీ క్రికెట్‌లో మెరుపులు మెరిపించాడు. 2020లో రాజస్థాన్ జట్టు అతడిని తీసుకొంది. అక్కడినుంచి అతడి బ్యాటింగ్ మెరుపులు మొదలయ్యాయి. ఇప్పటికే టీమ్ ఇండియా టీ20, టెస్ట్ జట్లలో స్థానం ఖాయం చేసుకొన్నాడు. వన్డేల్లో ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్నాడు.

గురుద్వారాలో కొన్నాళ్లు పంత్..

ఇక ఉత్తరాఖండ్‌లో జన్మించిన పంత్ (%=అంప్షుఎప్షుఖ్రత్%) 12వ ఏటే ఢిల్లీకి వచ్చేశాడు. కానీ, ఆర్థికంగా స్థితిమంతుడు కాకపోవడంతో మోతీబాగ్‌లోని గురుద్వారాలో కొన్నాళ్లు ఉండాల్సివచ్చింది. చివరికి సన్‌నెట్ హెడ్‌కోచ్ తారక్ సిన్హాపంత్‌కు ఒక రూమ్‌ను ఏర్పాటుచేశాడు. ఆ తర్వాత ఎయిర్‌ఫోర్స్ స్కూల్‌లో స్కాలర్‌షిప్ సాధించాడు. 2015-16 సీజన్ ఢిల్లీ తరఫున రంజీ జట్టులో స్థానం సంపాదించాడు. 2016లో ఢిల్లీ ఐపీఎల్ జట్టు అతడిని రూ.1.9 కోట్లు ఇచ్చి జట్టులోకి తీసుకొంది. నాటినుంచి అతడు కెరీర్‌లో వెనుదిరిగి చూడలేదు.

# ఐపీఎల్ అరంగేట్రంలో అడుగుపెట్టారు.. ఆగేదే లేదంటూ ప్రయాణం

ఐపీఎల్.. పక్కా కమర్షియల్ క్రికెట్ ఎంటర్‌టైన్‌మెంట్ లీగ్. అందుకే బెస్ట్ ప్లేయర్లనే ఫ్రాంఛైజీలు తమతో అట్టిపెట్టుకుంటాయి. అలా సుదీర్ఘ కాలం నిలవడం అంటే పెద్ద విషయమే. ఇలా ఉన్నవాళ్లెవరు? వారి సంగతేంటో చూద్దాం!




అతడుంటే చాలు..

ఐపీఎల్‌లో అత్యంత ఆకర్షణీయమైన టాప్ - 3 జట్లలో చెన్నై సూపర్ కింగ్స్ ఒకటి. జట్టుకు ఐదు టైటిళ్లను అందించిన 'కెప్టెన్ కూల్' ఎంఎస్ ధోనీ సారథ్యం నుంచి వైదొలిగాడు. అయితే ప్లేయర్‌గా కొనసాగుతూ అభిమానులను అలరిస్తున్నాడు. తొలి సీజన్ (2008) నుంచి ఇప్పటివరకు ఆడుతూ మురిపిస్తున్న ధోనీ.. లీగ్‌లో ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్ కావడం విశేషం. 264 మ్యాచుల్లో 5,243 పరుగులు చేశాడు.

రెండో ప్లేస్‌లో హిట్ మ్యాన్

ధోనీ తర్వాత అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడు రోహిత్ శర్మ 2008లో డెక్కన్ ఛార్జర్స్ ఫ్రాంఛైజీ ద్వారా అరంగేట్రం చేసిన హిట్ మ్యాన్.. ఇప్పుడు ముంబయి తరఫున ఆడుతున్నాడు. 257 మ్యాచులు ఆడి 6,628 పరుగులు చేశాడు. ముంబయికి కెప్టెన్‌గా 5 కప్‌లను అందించాడు. డెక్కన్ ఛార్జర్స్ 2009లో ట్రోఫీ గెలిచినప్పుడు రోహిత్ ఆ టీమ్ మెంబర్.

కింగ్ కోహ్లీ.. ఘనత

ఐపీఎల్‌లో సుదీర్ఘకాలంగా ఒకే జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రికెటర్ విరాట్ కోహ్లీ ఒక్కడే. ప్రారంభం నుంచి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అయితే కొన్నిసార్లు ఫైనల్ వరకు వెళ్లినా టైటిల్‌ను అందుకోలేకపోయిందా జట్టు. ఇక వ్యక్తిగత ప్రదర్శన చూస్తే.. ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ విరాట్. 252 మ్యాచుల్లో 8,004 పరుగులతో ఉన్నాడు. ఇందులో 8 సెంచరీలు ఉన్నాయి.

జడ్డూ.. స్పిన్ ఆల్‌రౌండర్

తొలి సీజన్‌లో ఐపీఎల్ బరిలోకి దిగిన జడేజా 240 మ్యాచులు ఆడాడు. 2,959 పరుగులు చే బౌలర్‌గా 160 వికెట్లు పడగొట్టాడు. సీఎస్కే విజయాల్లో కీలక పాత్ర పోషించిన జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ప్రత్యేకంగా ఫ్యాన్‌బేస్‌ను తయారు చేసుకోవడం విశేషం. ఓ సీజన్‌లో కొన్ని మ్యాచ్‌లకు సారథిగా వ్యవహరించినప్పటికీ అతడు సక్సెస్ కాలేకపోయాడు.

రహానె కొనసాగింపు..

తొలి సీజన్ నుంచి ఐపీఎల్ ఆడుతున్న రహానె కెరీర్ 2024తో ముగిసిపోవాల్సింది. గతేడాది జరిగిన మెగా వేలం తొలి రౌండ్‌లో ఎవరూ కొనుగోలు చేయలేదు. ఆఖర్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.2 కోట్లకు తీసుకుంది. ఆ తర్వాత కెప్టెన్సీని అప్పగించింది. దీంతో ఈ జాబితాలో చేరాడు. రహానే 185 మ్యాచ్‌లు ఆడి 4,642 పరుగులు చేశాడు.

వీళ్లు కాస్త లేట్

మనీశ్ పాండే 2008 నుంచి ఐపీఎల్‌లో ఉన్నాడు. కానీ, అవకాశాలు తక్కువే వచ్చాయి. ఇప్పటి వరకు 171 మ్యాచ్‌లు ఆడిన పాండే 3,850 పరుగులు చేశాడు. ఇక రవిచంద్రన్ అశ్విన్, కర్ణ్ శర్మ వీళ్లు ఒక సంవత్సరం లేట్ బ్యాచ్. 2009 సీజన్‌లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. అశ్విన్ ఇప్పటి వరకు 212 మ్యాచ్‌లు ఆడి 180 వికెట్లు పడగొట్టాడు. 800 పరుగులు మాత్రమే చేశాడు. ఇక కర్ణ్ శర్మ సుదీర్ఘంగా ఐపీఎల్‌లో ఉన్నప్పటికీ.. అవకాశాలు తక్కువగానే వచ్చాయి. ఇప్పటివరకు కేవలం 84 మ్యాచ్‌లను మాత్రమే ఆడి అతడు 76 వికెట్లు తీశాడు.

# చెన్నై 6 సాధ్యమేనా

రికార్డు స్థాయిలో ఆరో టైటిలే లక్ష్యంగా చెన్నై సూపర్‌కింగ్స్ 2025 ఐపీఎల్ (%ఞఞ% 2025)కు సిద్ధమైంది. టోర్నీలో పసుపు వీరుల ఆధిపత్యం గురించి కొత్తగా చెప్పక్కర్లేదు. టైటిల్ పోటీదారుల గురించి చర్చ జరుగుతున్నప్పుడు చెన్నై పేరు కచ్చితంగా ముందు వస్తుంది. ఏకంగా పదిసార్లు ఫైనల్ చేరింది మరి. 12 సార్లు ప్లేఆఫ్‌లో అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో ఈసారి కూడా ఆ జట్టు మంచి అంచనాలతో బరిలోకి దిగుతోంది. కొత్త కెప్టెన్ రుతురాజ్ నాయకత్వంలో నిరుడు లీగ్ దశలో అయిదో స్థానంలో నిలిచి, టోర్నీ నుంచి త్వరగా నిష్క్రమించిన చెన్నై ఈసారి.. సత్తా చాటాలనే పట్టుదలతో ఉంది. ధోని కూడా మెరుగైన ప్రదర్శన చేయాలనుకుంటున్నాడు. మెగా వేలం నేపథ్యంలో సీఎస్కే.. రుతురాజ్, ధోని, జడేజా, పతిరన, శివమ్ దూబెలను అట్టిపెట్టుకుంది. ఆ తర్వాత వేలంలో స్థానిక హీరో, వెటరన్ స్పిన్నర్ అశ్విన్ సహా పలువురు పెద్ద ఆటగాళ్లను కొనుక్కుంది. తన అవకాశాలపై నమ్మకంతో ఉంది. ఈ నెల 22న ముంబయితో ఇండియన్స్‌తో పోరు సూపర్‌కింగ్స్ జట్టు తన టైటిల్ వేటను ఆరంభిస్తుంది. మరి ఆ జట్టు ఖాతాలో ఇంకో టైటిల్‌ను వేసుకోగలదా..? బలాలు: మెగా వేలంతో మార్పులు చేర్పులు జరిగినా చెన్నై తన ప్రధాన జట్టును నిలబెట్టుకోగలిగింది. తుది జట్టును ఎంపిక చేయడం తేలికే. సమతూకంగా కనిపిస్తోన్న చెన్నైకి ఎప్పటిలాగే స్పిన్నే ప్రధాన బలం. ఇప్పటిదాకా ఆ జట్టు టైటిళ్లు గెలవడంలో కీలక పాత్ర పోషించిన స్పిన్నర్లు మరోసారి సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు. చెన్నై వేలంలో అశ్విన్, నూర్ అహ్మద్‌లను భారీ మొత్తాలకు కొనుక్కుంది. వాళ్లతో పాటు సీనియర్ ఆటగాడు, ఎడమచేతి వాటం స్పిన్నర్ జడేజా, లెగ్‌స్పిన్నర్ గోపాల్, పార్ట్‌టైమ్ ఆఫ్‌స్పిన్నర్ దీపక్ హుడాతో సూపర్‌కింగ్స్ స్పిన్ విభాగం దుర్భేద్యంగా కనిపిస్తోంది.

# ఏప్రిల్ 1 నుంచి ఈ నంబర్లకు యూపీఐ సేవలు బంద్.. యూజర్లేం చేయాలి?

ఇన్‌యాక్టివ్ లేదా వేరే వారికి కేటాయించిన మొబైల్ నంబర్లకు ఏప్రిల్ 1 నుంచి యూపీఐ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు బ్యాంకులు, పేమెంట్ సేవలందించే ప్రొవైడర్లకు.. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (%చీూజ×%) ఆదేశాలు జారీ చేసింది. అనధికారిక వాడకాన్ని, మోసాలను అరికట్టేందుకు ఆ నంబర్లను డీయాక్టివేట్ చేయాలని సూచించింది. యూపీఐ వినియోగంలో మొబైల్ నంబర్ కీలకం. ఈ సేవల్లో ఓటీపీ వెరిఫికేషన్ కీలక భూమిక పోషిస్తుంది. అందుకే ఎన్‌పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది.



ఎక్కువకాలం పాటు వినియోగంలో లేని మొబైల్ నంబర్లను టెలికాం కంపెనీలు వేరొకరికి కేటాయిస్తుంటాయి. దీంతో దీర్ఘకాలం పాటు మనం వాడే నంబర్లు వేరొకరికి చేరుతుంటాయి. దాంతో యూపీఐ ఖాతాలు కూడా వారి చేతిలోకి వెళ్లే అవకాశం ఉంది. దీనివల్ల అనధికారిక, మోసపూరిత లావాదేవీలు జరిగే అవకాశం ఉంది. వీటిని నివారించేందుకు ఎన్‌పీసీఐ ఆదేశాల మేరకు గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్స్‌తో పాటు బ్యాంకులు ఇన్‌యాక్టివ్ నంబర్లను తొలగించనున్నాయి.

ఏం చేస్తారు?

ఇన్‌యాక్టివ్‌లో ఉన్న, ఇతరులకు అసైన్ చేసిన, డీయాక్టివ్ చేసిన మొబైల్ నంబర్లు బ్యాంకులు, పేమెంట్ ప్రొవైడర్లు తొలగిస్తాయి. ఒకవేళ అందులో మీ నంబర్ ఉంటే.. యూపీఐ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు నోటిఫికేషన్ పంపిస్తాయి. నోటిఫికేషన్ తర్వాత కూడా నంబర్ ఇన్‌యాక్టివ్‌లోనే ఉంటే మోసాలను అరికట్టేందుకు యూపీఐ నంబర్లను బ్యాంకులు డీలిస్ట్ చేస్తాయి.

ఎవరిపై ప్రభావం?

మొబైల్ నంబర్ మార్చినా బ్యాంకుల వద్ద ఆ నంబర్‌ను అప్‌డేట్ చేయని వారి మీద ప్రభావం ఉంటుంది.

యూపీఐతో లింక్ చేసి కాల్స్, ఎస్సెమ్మెస్‌లు వంటివేవీ చేయకుండా దీర్ఘకాలం పక్కనపెట్టిన వారు

బ్యాంకు వివరాలను అప్‌డేట్ చేయకుండా మొబైల్ నంబర్‌ను సరెండర్ చేసినవారు అవాంతరాలు ఎదుర్కొంటారు.

పాత నంబర్‌ను వేరొకరికి అసైన్ చేసిన సందర్భాల్లో పాత నంబర్ హోల్డర్లపై ఈ ప్రభావం ఉంటుంది.

యూపీఐని యాక్టివ్‌గా ఉంచుకోవాలంటే?

మీ నంబర్ యాక్టివ్‌గా ఉందో, లేదో చెక్ చేసుకోండి. కాల్స్, మెసేజులు వెళుతున్నాయో, లేదో చూడండి.

బ్యాంక్ నుంచి ఓటీపీలు, ఎస్సెమ్మెస్ అలర్ట్‌లు వస్తున్నాయో, లేదో చెక్ చేసుకోండి.

బ్యాంకుల వద్ద మీ మొబైల్ నంబర్‌ను అప్‌డేట్‌గా ఉండేలా చూసుకోండి. నెట్‌బ్యాంకింగ్ లేదా బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లి ఈ ప్రక్రియను పూర్తి చేయొచ్చు.




# బంగారం కొందాం ఈటీఎఫ్ రూపంలో

%శుభకార్యం, పండగలు సందర్భం ఏదైనా సరే బంగారం గురించే ఆలోచన. ఆభరణాల రూపంలోనూ.. పెట్టుబడిగానూ ఇది ఎంతో ప్రత్యేకం. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే సాధనంగా ప్రపంచమంతా నమ్మే విశ్వసనీయ మదుపు పథకం. ఇటీవలి కాలంలో పసిడి ధర పెరుగుతుండటంతో చాలామంది బంగారంలో మదుపు చేయాలనే ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్న మొత్తంతోనూ పసిడిలో మదుపు చేసేందుకు వీలు కల్పించే గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెట్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్) గురించి తెలుసుకుందాం.

బంగారం పది గ్రాముల ధర రూ.90వేలకు మించి పోయింది. దీంతో అందరిలోనూ ఆందోళన వ్యక్తం అవుతోంది. భవిష్యత్తు అవసరాల కోసం బంగారాన్ని కూడబెట్టాలనే ఆలోచనా పెరిగింది. వైవిధ్యమైన పెట్టుబడులు ఎప్పుడూ శ్రేయస్కరమే. ఇందులో బంగారం ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. చాలామంది బంగారాన్ని ఆభరణాల రూపంలో కొనేందుకే ఇష్టపడతారు. శుభకార్యాలు, ఇతర అవసరాల సందర్భంలో ఇది తప్పనిసరి. ఆభరణాలు, నాణేలు, ఇతర రూపాల్లోనే కాకుండా.. పెట్టుబడి దృష్టితో, చిన్న మొత్తంతో బంగారం కొనాలి అనుకున్నప్పుడు గోల్డ్ ఈటీఎఫ్‌లు ఒక ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాయి.

దేశీయ బంగారం ధరలకు దగ్గరగా ఉంటూ.. చిన్న మొత్తంలోనూ పెట్టుబడి పెట్టేందుకు వీలు కల్పించేవే గోల్డ్ ఈటీఎఫ్‌లు. వీటిలో మదుపు చేయడం అంటే.. బంగారాన్ని ఎలక్ట్రానిక్ విధానంలో కొనడం అన్నమాట. డీమ్యాట్ ఖాతా ఉన్నవారు వీటిని యూనిట్ల రూపంలో కొనుగోలు చేయొచ్చు. కావాలనుకున్నప్పుడు వెంటనే అమ్మొచ్చు. పసిడిలో సులభంగా లావాదేవీలు నిర్వహించేందుకు ఇవి ఒక సులభమైన మార్గంగానూ అనుకోవచ్చు.

గోల్డ్ ఈటీఎఫ్ ఒక యూనిట్ కొన్నారంటే మదుపరులు ఆ మేరకు 99.5 శాతం శుద్ధతతో బంగారాన్ని కొన్నట్లే లెక్క. బంగారం రేట్లలో వచ్చే హెచ్చుతగ్గులే గోల్డ్ ఈటీఎఫ్‌లపైన ప్రభావాన్ని చూపిస్తాయి. బంగారం 10 శాతం పెరిగితే గోల్డ్ ఈటీఎఫ్ యూనిట్ ధర 10శాతానికి అటూఇటూగా లాభాన్ని అందిస్తుంది.

తక్కువ ఖర్చుతో

బంగారం నేరుగా కొన్నప్పుడు కొన్ని ఖర్చులూ కలిసి ఉంటాయి. దీంతో మార్కెట్ ధరకన్నా ఎక్కువే చెల్లించాల్సి వస్తుంది. అమ్మేటప్పుడు అన్ని ఖర్చులూ తిరిగి రావు. ఈ ఇబ్బంది గోల్డ్ ఈటీఎఫ్‌లతో ఉండదు. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఉన్న రేటును బట్టి అమ్మొచ్చు. కొనొచ్చు. బంగారాన్ని భద్రపర్చడమూ కష్టమే. ఈటీఎఫ్‌ల ద్వారా కొన్నప్పుడు ఎలక్ట్రానిక్ రూపంలో ఉంటాయి. కాబట్టి, రక్షణకు ఇబ్బందేమీ ఉండదు.

డీమ్యాట్ ఉంటే చాలు..

గోల్డ్ ఈటీఎఫ్‌లు కొనాలని అనుకుంటే డీమ్యాట్ ఖాతా ఉంటే చాలు. మీ మొబైల్ నుంచే యూనిట్లను కొనొచ్చు. అమ్మొచ్చు. ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరమూ ఉండదు. మీరే సొంతంగా లావాదేవీలు చేసుకోవచ్చు. దీనివల్ల మీకు సమయమూ కలిసొస్తుంది. ఎప్పటికప్పుడు మీ పెట్టుబడి విలువనూ చూసుకుంటూ ఉండొచ్చు.

పన్ను భారం లేకుండా

బంగారాన్ని నేరుగా కొన్నప్పుడు 3 శాతం వరకూ జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. గోల్డ్ ఈటీఎఫ్‌లు కొన్నప్పుడు నామమాత్రపు రుసుములు ఉంటాయి. పెట్టుబడిపై వచ్చే లాభాలకు నిబంధనల మేరకు మూలధన పన్ను వర్తిస్తుంది.

రూ.75తోనూ..

సాధారణంగా బంగారాన్ని కొనాలంటే రూ.వేలల్లోనే అవసరం అవుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక గ్రాము పసిడికి దాదాపు రూ.9,300 వరకూ అవుతుంది. కానీ, గోల్డ్ ఈటీఎఫ్‌లలో రూ.75 తోనూ పెట్టుబడి పెట్టేందుకు ఎన్నో ఫండ్లు అందుబాటులో ఉన్నాయి. మన దగ్గర డబ్బు ఉన్నప్పుడల్లా వీటిని కొనుగోలు చేస్తూ వెళ్లడం వల్ల దీర్ఘకాలంలో మంచి మొత్తాన్ని జమ చేసుకోవచ్చు. అవసరం అయినప్పుడు ఇదే మొత్తాన్ని వెనక్కి తీసుకొని, అసలైన బంగారాన్ని కొనొచ్చు.

క్రమానుగతంగా..

ఒకేసారి పెట్టుబడి పెట్టడంతోపాటు, క్రమానుగతంగానూ బంగారంలో మదుపు చేసుకునే వెసులుబాటు ఉంది. డీమ్యాట్ ఖాతా లేని వారు గోల్డ్ ఫండ్లను, గోల్డ్ ఫండ్ ఆఫ్ ఫండ్లనూ ఎంచుకోవచ్చు. ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా.. నెలనెలా మదుపు చేయొచ్చు.

బంగారం ధర పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో దీర్ఘకాలిక వ్యూహంతో గోల్డ్ ఈటీఎఫ్‌లను కొనుగోలు చేయొచ్చు. మీ మొత్తం పెట్టుబడుల్లో బంగారానికి 10-15 శాతం వరకూ కేటాయించడం వల్ల వైవిధ్యం సాధ్యమవుతుంది.

# గృహరుణం బదిలీ చేస్తున్నారా?

సొంతింటి కలను నెరవేర్చుకోవాలంటే ఇంటి రుణమే మార్గం. బ్యాంకులు, గృహరుణ సంస్థలు ఇప్పుడు 8.50-9 శాతం వరకూ దీనిపై వడ్డీని వసూలు చేస్తున్నాయి. చాలా రోజుల తర్వాత ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించడంతో బ్యాంకులు గృహరుణ వడ్డీలోనూ కొంత మార్పులు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త వారిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. రుణాన్ని తమ వద్దకు బదిలీ చేసుకుంటే తక్కువ వడ్డీకే రుణం ఇస్తామని చెబుతున్నాయి. అర శాతం వడ్డీ తగ్గినా.. దీర్ఘకాలంలో ప్రయోజనమే. కాబట్టి, రుణాన్ని మరో బ్యాంకు/సంస్థకు బదిలీ చేసుకునేందుకు ప్రయత్నించే వారు.. గమనించాల్సిన విషయాలేమిటో తెలుసుకుందాం.



గృహరుణాన్ని ఒక సంస్థ నుంచి మరో దానికి బదిలీ చేయడం వెనక ప్రాథమిక లక్ష్యం వడ్డీ ఆదా. బ్యాంకులు/గృహరుణ సంస్థలు రుణగ్రహీతకు వడ్డీ రేటును నిర్ణయించడంలో ఎన్నో అంశాలను పరిశీలిస్తుంటాయి. ముఖ్యంగా రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరువంటివి చూస్తాయి. రుణాన్ని బదిలీ చేసుకునేటప్పుడు పరిశీలన, నిర్వహణ రుసుమల్లాంటివి ఉంటాయి. కొత్త రుణం మాదిరిగానే పత్రాలూ సమర్పించాలి. డాక్యుమెంటేషన్ ఛార్జీలు, ఇతర ఖర్చులూ ఉంటాయి. వీటన్నింటినీ లెక్కించి చూసుకోవాలి.

రుణాన్ని బదిలీ చేసుకునేటప్పుడు వచ్చిన ప్రయోజనాలకన్నా ఇవి అధికంగా ఉంటే మీ నిర్ణయం మానుకోవాలి. బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ చేసుకునేటప్పుడు ఓవర్‌డ్రాఫ్ట్‌లాంటి వెసులుబాట్లు ఉన్నాయా చూసుకోండి. కొత్త గృహరుణం ఖాతాకు అనుబంధంగా ఓవర్‌డ్రాఫ్ట్ ఖాతాను ప్రారంభించాలి. రుణగ్రహీత తన దగ్గరున్న మిగులు మొత్తాన్ని ఇందులో జమ చేస్తుండాలి. అవసరమైనప్పుడు ఇందులో నుంచి నగదును వెనక్కి తీసుకోవచ్చు. వడ్డీ రేటును లెక్కించేటప్పుడు ఓవర్‌డ్రాఫ్ట్ ఖాతాలో ఉన్న మొత్తాన్ని మినహాయించి, మిగతా మొత్తానికే వడ్డీ విధిస్తారు. దీనివల్ల దీర్ఘకాలంలో భారం తగ్గుతుంది. ఇలాంటి వెసులుబాట్లు బ్యాంకుల వద్దే అందుబాటులో ఉంటున్నాయి.

తొందరగా..

గృహరుణం తీసుకున్న కొన్నేళ్ల తర్వాత బదిలీ చేసుకుంటే.. పెద్దగా ప్రయోజనం ఉండదు. కాబట్టి, రుణం తీసుకున్న ప్రారంభంలోనే అధిక వడ్డీ ఉన్న బ్యాంకు/సంస్థ నుంచి తక్కువ వడ్డీ ఉన్న చోటకు మారాలి. రుణం ప్రారంభంలోనే వడ్డీ భాగాన్ని అధికంగా వసూలు చేస్తుంటారు. కాలం గడుస్తున్న కొద్దీ అసలు భాగం తగ్గడం ప్రారంభమవుతుంది. కొంతకాలం గడిచిన తర్వాత రుణాన్ని మార్చుకుంటే.. అప్పటికే మనం చాలా వడ్డీని చెల్లించి ఉంటాం. కొత్తగా మళ్లీ వడ్డీని చెల్లించాల్సి వస్తుంది. ఇది రుణగ్రహీతకు ఎంతో భారం.

ఇప్పటికే కొనసాగుతున్న రుణం వ్యవధి, కొత్తగా తీసుకుంటున్న రుణ వ్యవధి సమానంగా ఉండేలా చూసుకోవాలి. ఉదాహరణకు ఇప్పుడున్న రుణ వ్యవధి 20 ఏళ్లు. ఇప్పటికే మీరు రెండేళ్లపాటు చెల్లించారనుకుందాం. మిగిలిన 18 ఏళ్ల వ్యవధినే రుణాన్ని బదిలీ చేసుకునేటప్పుడు నిర్ణయించుకోవాలి. ఈఎంఐ భారాన్ని తగ్గించుకోవాలంటే గడువు పెంచుకునే ప్రయత్నం చేయొచ్చు. కానీ, వడ్డీ భారం అందుకు తగ్గట్టుగా పెరుగుతుందని మర్చిపోవద్దు.

టాపప్ తీసుకుంటారా?

ఇప్పటికే కొనసాగుతున్న ఇంటి రుణంపై టాపప్ తీసుకునే వెసులుబాటు ఉంటుంది. నిర్ణీత కాలం క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించినప్పుడు రుణ సంస్థలు దీన్ని అందిస్తుంటాయి. ఈ రుణానికి వడ్డీ రేటు గృహరుణానికి సమానంగా ఉంటుంది. కొన్నిసార్లు ఒక శాతం వరకూ అధికంగా ఉండొచ్చు. మీకు నిజంగా టాపప్ అవసరం ఉంటే.. మీ బ్యాంకును సంప్రదించండి. ఒకవేళ ఇవ్వకపోతే కొత్త సంస్థకు రుణాన్ని బదిలీ చేసుకొని, ఒకే రుణంగా పెద్ద మొత్తాన్ని తీసుకోవచ్చు. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. మీకు నిజంగా డబ్బు అవసరం ఉన్నప్పుడే రుణం అధికంగా తీసుకోవాలి. లేకపోతే అనవసరంగా వడ్డీ భారం మోయాల్సి ఉంటుంది.

# దలాల్ స్ట్రీట్‌లో బుల్ రన్.. ఐదో రోజూ లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: స్టాక్ మార్కెట్లో బుల్ రన్ కొనసాగుతోంది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లకు మదుపర్లు ఆసక్తి చూపడంతో వరుసగా ఐదో రోజు సూచీలు లాభాల్లో ముగిశాయి. చాలా కాలం తర్వాత స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ స్టాక్‌లు పుంజుకోవడం సూచీలకు కలిసొచ్చింది. వరుసగా విక్రయదారులుగా నిలిచిన విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లకు దిగడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. దీంతో సూచీలు లాభాల్లో ముగిశాయి.

సెన్సెక్స్ ఉదయం 76,155.00 (క్రితం ముగింపు 76,348.06) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. 76,095.26 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ కాసేపు లాభ- నష్టాల మధ్య కదలాడింది. తొలుత నష్టాల్లోకి జారుకున్నప్పటికీ ప్రధాన షేర్ల అండతో లాభాల బాటపట్టింది. ఇంట్రాడేలో 77,041.94 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ చివరకు 557 పాయింట్ల లాభంతో 76,905.51 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో సూచీ 23,402.70 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 159 పాయింట్ల లాభంతో 23,350.40 వద్ద స్థిరపడింది.



సెన్సెక్స్ 30 సూచీలో ఎన్టీపీసీ, బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, ఎల్‌అండ్‌టీ, టాటా మోటార్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, టాటా స్టీల్, ఎంఅండ్‌ఎం, టైటాన్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు మాత్రమే నష్టాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు 85.99 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.76 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,039 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# గుజరాత్‌లో రూ.7,500 కోట్ల విలువైన ఆర్డర్ పొందిన బీహెచ్ఈఎల్

గుజరాత్‌లోని 'ఉకై' సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి రూ.7,500 కోట్ల విలువైన ఆర్డర్‌ను పొందినట్లు ప్రభుత్వ యాజమాన్యంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్() శుక్రవారం తెలిపింది. గుజరాత్ స్టేట్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ లిమి ద్వారా ఈ ఆర్డర్ పొందినట్లు 'బిహెచ్ఇఎల్' ఒక ప్రకటనలో తెలిపింది. ఈ యూనిట్ 54 నెలల్లో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనుంది. గుజరాత్‌లోని తాపి జిల్లాలో ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ %�డ% కన్‌స్ట్రక్షన్ ప్రాతిపదికన 1%ఇ800 వీఔ% 'ఉకై' సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ (యూనిట్-7)ను ఏర్పాటు చేయడానికి అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ కింద %దీఎజూ% ఈ ఆర్డర్‌ను పొందింది.

ఈ ప్రాజెక్టులో.డిజైన్, ఇంజనీరింగ్, తయారీ, సరఫరా, టెస్టింగ్, కమీషనింగ్‌తో పాటు అవసరమైన అన్ని విద్యుత్, సివిల్, నిర్మాణ పనులను అందిస్తుంది. ఉకైలోని మొదటి థర్మల్ యూనిట్‌ను 1976లో %దీఎజూ% స్థాపించింది. దశాబ్దాలుగా వీరి విజయవంతమైన భాగస్వామ్యం కొనసాగుతూ ఉంది. దేశవ్యాప్తంగా 1,70,000 %వీఔ% కంటే ఎక్కువ విద్యుత్ సామర్థ్యాన్ని కలిగి ఉన్న భారతదేశంలోని అగ్రగామి విద్యుత్ పరికరాల తయారీదారుగా..%దీఎజూ% ప్రసిద్ధి చెందింది.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 21: నిర్మల్ జిల్లా నేటి నుంచి ప్రారంభం అయిన పదవ తరగతి బోర్డు పరీక్షలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని రవి హైస్కూల్, సోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలోని పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? లేదా? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏ.ఎన్,ఎం, సిబ్బంది, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్ కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావ్, అధికారులు పరమేశ్వర్, తహసీల్దార్ లు మల్లేష్, రాజు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



# నర్సింగ్ వసతి గృహాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



భద్రాద్రి జిల్లా బ్యూరో, మార్చి 21 (భారతశక్తి):కొత్తగూడెంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వసతి గృహాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గృహంలో విద్యార్థినిలకు అందిస్తున్న సదుపాయాల, వసతి గృహంలో ఉంటున్న వారి సంఖ్య గురించి హాస్టల్ వార్డెన్ మరియు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని అన్ని గదులను, మరుగుదొడ్లను, కిచెన్, త్రాగునీటి సౌకర్యం తదితర అన్ని సదుపాయాల్ని కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తం 140 మంది విద్యార్థులు కు కలిపి ఒకటే పెద్ద హాలు లో ఉండటం గమనించిన ఆయన గదులుగా పార్టీషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహంలోని హాల్లో ఎండ వేడి అధికంగా ఉండటం గమనించిన కలెక్టర్ ధర్మకోల్ తో సీలింగ్ ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అన్ని గదులలో కూలర్లు రేపటిలోగా ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు త్రాగునీటి కొరకు ఫ్రిజ్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వసతి గృహం చుట్టూ ప్రహరీ గోడను పరిశీలించిన కలెక్టర్ ఎత్తు తక్కువగా ఉండటానికి గమనించి, విద్యార్థినిల కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రహరీ గోడ పైన అదనంగా షీట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వసతి గృహం లో విద్యార్థులు భద్రతకు గాను సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థినిలు ప్రశాంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించడానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు అన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం,శుద్ధ జలం అందించాలని వార్డెన్ కు సూచించారు. వసతి గృహ నిర్వహణపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట వసతి గృహం వార్డెన్, సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉచితంగా ఉచిత మిషన్స్, బ్యూటీ పార్లర్ శిక్షణ

## -శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన తహసిల్దార్ అద్దంకి నరేష్



పినపాక, మార్చి 21 (భారతశక్తి): మేము సైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మిషన్స్, బ్యూటీ పార్లర్ శిక్షణను అందించడం అభినందనీయమని తహశీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్ నిర్వహణలో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మేము సైతం ట్రస్ట్ చైర్మన్ దోసపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కోర్స్ అనంతరం సర్టిఫికెట్లు అందజేయబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంది సుబ్బారెడ్డి, రెవిన్యూ సూపరెంటెంట్ శీను, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గణపతి, స్థానికులు పల్లవి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అదిలాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 23న

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 21: గత ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు ఎదుర్కోలేని ప్రస్తుతం ఉనికిలో ఉన్న రెవెన్యూ సంఘాల వైఫల్యం వల్ల ఎన్నో వందల సంవత్సరాల చరిత్ర కలిగి రెవెన్యూ శాఖ సంక్షోభంలోకి నెట్టివేయ బడింది. ఈ నేపథ్యంలో ప్రజలకు మధ్య రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సమస్త శాఖల విధుల్లో భాగస్వామ్యం కల్పించుకుని పనిచేసే రెవెన్యూ శాఖ ను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని గుర్తించిన ఉద్యోగులు గౌరవ శ్రీ ల గారి నేతృత్వంలో టి జి ఆర్ ఎస్ ఏ. గా ఏర్పడి రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపైన పోరాడి ఫలితాలు సాధించుకోవడం జరిగింది అంతే కాకుండా రెవెన్యూ శాఖ పరంగా క్షేత్ర స్థాయిలో రద్దు చేయబడిన వీఆర్వో ల స్థానంలో తిరిగి ఉద్యోగిని నియమించాలనే డిమాండ్ తో రాజీ లేకుండా పోరాడడం వల్ల ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం 10000 వెలకు పైబడి %జశ్రీశీ% పోస్టులను నియమించుటకై నిర్ణయించింది.అయినప్పటికీ రెవెన్యూ ఉద్యోగుల హక్కులతో పాటు రెవెన్యూ శాఖను పరీక్షించుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల మధ్య ఐక్యత మరియు ఆత్మీయతను పెంపొందించే క్రమంలో టి జి ఆర్ ఎస్ ఏ. రాష్ట్ర నాయకత్వం గౌరవ శ్రీ లచిరెడ్డి గారి నాయకత్వములో రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేయ సంకల్పించింది. ఈ క్రమంలో మన పూర్వ అదిలాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 23న మంచిర్యాల లోని %ఖీజూ% ఫంక్షన్ హాల్ యందు నిర్వహించ తలపెట్టిన కావున జిల్లా లోని రెవెన్యూ ఉద్యోగులందరూ భాద్యతగా హాజరయ్యి విజయవంతం చేయాల్సిందిగా జిల్లా అధ్యక్షులు టి జి ఆర్ ఎస్ ఏ. మెస్రం బాబురావు విజ్ఞప్తి చేశారు.

# సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ జిల్లా అధ్యక్షురాలిగా వెన్నం రజితా రెడ్డి

## సన్మానించిన ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి





కరీంనగర్, మార్చి 21(భారత శక్తి):కరీంనగర్ జిల్లా సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ అధ్యక్షురాలిగా వెన్నం రజితా రెడ్డి నియామకం అయ్యారు. రజితా రెడ్డి ఎప్పటికప్పుడు ప్రజలతో మమేకం అవడం, ఆమె చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ లీగల్ సర్వీసెస్ అధ్యక్షురాలిగా నియామకం అయింది.ఇందులో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం చేతుల మీదుగా నియామకం పత్రాన్ని స్వీకరించారు.అనంతరం సీపీ ని పుల బోకేతో రజితా రెడ్డి సన్మానించారు.రజితా రెడ్డి జిల్లా మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గా, కరీంనగర్ రెడ్డి జే ఏ సి మహిళా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు...లీగల్ సర్వీసెస్ అధ్యక్షురాలిగా నియామకం అయిన సందర్బంగా రజితా రెడ్డిని శుక్రవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు, అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మనించారు.ఈ కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.


# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీలు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ



కరీంనగర్, మార్చి 21(భారత శక్తి): మానకొండూరు పట్టనంతోపాటు వెల్ది గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అకస్మికంగా తనిఖలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. అలాగే ఫార్మసీ స్టోర్ లలోని వేసవి కాలానికి సంబంధించి మందుల నిల్వలను, కుక్క కాటు మందులను పరిశీలించారు. లేబరేటరీ, ఎన్సీడీ క్లినిక్ లను సందర్శించి రక్తపోటు, డయాబెటిస్ రోగులకు సంబంధించిన వివరాలు తెలుసుకొని ప్రతి నెల వారికి మందుల పంపిణీ రికార్డు పరిశీలించారు. అక్కడికి వచ్చిన రోగులను వారికి అందుతున్న సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. మానకొండూరులో లేబర్ రూమ్ ని సందర్శించి గౌరవ కలెక్టర్ సూచనల మేరకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మొదటి కానుపు లన్నీ గవర్నమెంట్ నార్మల్ డెలివరీలను కొరకు ప్రోత్సహించి సిజేరియన్ డెలివరీల పర్సంటేజీ తగ్గించాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీలలో మానకొండూరు వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ సల్మాన్, వెల్ది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బియ్యాబాని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయం ప్రధాన సైన్ బోర్డ్ ఏది?

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 21: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి (బి)లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి సైన్ బోర్డు లేకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన తర్వాత కోట్లాది రూపాయలు వెచ్చించి సముదాయం నిర్మించినప్పటికీ కార్యాలయం ప్రధాన బోర్డు లేకపోవడం శోచనీయం అని జిల్లా ప్రజలు అనుకుంటున్నారు. నిర్మల్ పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కార్యాలయానికి వెళ్లాలంటే అష్టవిధాల కష్టాలు పడవలసి వస్తుంది. కార్యాలయం దగ్గరికి పోగా బోర్డు లేక ఇబ్బందులకు గురి అవుతున్న జిల్లా ప్రజలు ఇప్పటికైనా స్పందించి ఉన్నత అధికారులు బోర్డు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



# మాజీ సింగరేణియుల మెడికల్ కార్డు గడువు పొడిగింపు.

మణుగూరు, మార్చి 21 (భారతశక్తి): సింగరేణి సంస్థలో పని చేసి వివిధ కారణాలతో ఉద్యోగ విరమణ పొందిన మణుగూరు ఏరియా మాజీ ఉద్యోగులకు, వారి భార్యలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు పొందేందుకు మెడికల్ కార్డు గడువు పెంచినట్లు అధికార ప్రతినిధి ఎస్ రమేష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సింగరేణి యాజమాన్యం సిపిఆర్ఎమ్ఎస్ – ఎన్ఈ మెడికల్ కార్డు సౌకర్యం కొరకు దరఖాస్తు చేసుకొనుటకు మరోసారి సర్కులర్ ను జారీచేసి చివరి అవకాశం కల్పిస్తున్నట్లు మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గంరామచందర్ తెలియజేశారన్నారు. సర్క్యులర్ ప్రకారం ఇంతవరకు మెడికల్ కార్డుపొందని / రిటైర్ అయిన, అర్హత కలిగిన ఉద్యోగులు రూ 60 వేలు కంట్రిబ్యూషన్ తో ఈపథకం లో చేరవచ్చునన్నారు.

ఇప్పటివరకు ఏదైనా కారణాల వలన ధరఖాస్తు చేసుకొని అర్హత గల మాజీఉద్యోగులు మెడికల్ కార్డు పొందుటకు సింగరేణి యాజమాన్యం మరొక చివరి అవకాశం కలిపించిందని ఈ సదవకాశాన్ని ఈ నెల 31లోపు ధరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. మణుగూరు ఏరియాలో పని చేసిన మాజీ ఉద్యోగులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగపర్చుకొని ఆరోగ్య భద్రత కొరకు వెంటనే దరఖాస్తు చేసుకొని మెడికల్ కార్డ్ పొందాలని, అలాగే సంబందిత పూర్తి వివరాల కొరకు ఆయా గనులు/ డిపార్ట్మెంట్లు, సంక్షేమ అధికారి కార్యలయం, జిఎం కార్యలయంలోని పర్సనల్ విభాగంలోని ఏటిబి సెల్ నందు సంప్రదించాలని ఎస్ రమేష్ తెలిపారు.



# 22న పోస్ట్ ఆఫీస్ నూతన భవన నిర్మాణం కోసం శంకుస్ధాపన

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, మార్చి 21:సత్తెనపల్లి పోస్ట్ ఆఫీస్ నూతన భవన నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమం ఈ నెల 22న మధ్యాహ్నం 12:00 గంటలకు జరుగును. సత్తెనపల్లి పోస్ట్ ఆఫీస్ నూతన భవన నిర్మాణం కోసం శంకుస్థాపన ఈ నెల 22న మధ్యాహ్నం 12:00 గంటలకు కేంద్ర కమ్యూనికేషన్స్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రివర్యులు డా. పెమ్మసాని చంద్ర శేఖర్ గారు చేయుదురు అని తదుపరి శ్రీ వేంకటేశ్వర గ్రాండ్, అయ్యప్పస్వామి గుడి దగ్గర, ఆర్.టి.సి. బస్టాండ్ సమీపం, సత్తెనపల్లి నందు సమావేశం జరుగుతుంది అని నరసరావుపేట పోస్టల్ సూపరింటెండెంట్ గారైన శ్రీ పి వి వెంకట స్వామి తెలిపినారు. ఈ కార్యక్రమానికి రాజ్య సభ పార్లమెంట్ సభ్యులు శ్రీ. ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి మరియు నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీ లావు శ్రీ కృష్ణదేవరాయులు విచ్చేయుచున్నారు. విశిష్ట అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యులు, శ్రీ మర్రి రాజశేఖర్ , శ్రీ కన్నా లక్ష్మీనారాయణ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సభ్యులు (సత్తెనపల్లి నియోజకవర్గం), శ్రీమతి చల్లంచర్ల లక్ష్మీతులసి, చైర్ పర్సన్, సత్తెనపల్లి పురపాలక సంఘం, శ్రీమతి లోకా కళ్యాణి, స్థానిక 12 వార్డు కౌన్సిలర్ విచ్చేయుచున్నారు. ముఖ్య అతిథులు తపాల శాఖ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, శ్రీ కే. ప్రకాష్ , పోస్ట్ మాస్టర్ జనరల్, శ్రీ %ఙూఎ=% మూర్తి , డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్, శ్రీ కే. సంతోష్ నేతా , పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీ పి. అరుణ్ బాబు , సత్తెనపల్లి మున్సిపల్ కమీషనర్ శ్రీ నంబూర్ ఆనంద కుమార్ లు ఈ కార్యక్రమం లో పాల్గొంటారు.

# ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చిన ఐదు కనీస వేతనాల జీవోలను గెజిట్ చేయాలి.

**-నేడు హైదరాబాదులో ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి.**

**-ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి.**

మణుగూరు, మార్చి 21 (భారతశక్తి): ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చిన ఐదు కనీస వేతనాల జీవోలను గెజిట్ ముద్రించాలని, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నేడు హైదరాబాదులో ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ మధుసూదన్ రెడ్డి కార్మిక వర్గాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అసంఘటిత కార్మిక వర్గం కోటి మందికి పైగా ఉన్నారని, నేడు రాష్ట్రంలో పెరిగిపోతున్న ధరలతో, చాలీ,చాలని జీతాలతో వీరంతా సతమతమవుతున్నారన్నారు. 2021 లో ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం ఐదు కనీస వేతనాల జీవోలను ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారని, కనీస వేతనాల సలహా మండలి లో గల ప్రభుత్వము, యాజమాన్యం, కార్మిక సంఘాల ప్రతినిధుల మధ్య జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం కనీస వేతనాల జీవోలను ఫైనల్ చేశారు. కానీ అట్టి జీవోలను ప్రభుత్వం గెజిట్ చేయలేదన్నారు. 2021 జూన్ లో విడుదల చేసిన జీవోలను నేటికీ గెజిట్ ముద్రించకపోవడం దుర్మార్గం అన్నారు. ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం, ఈనాటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం దొందూ దొందే అన్న చందంగా పరిస్థితి ఉందన్నారు. 2021 లో విడుదల చేసిన 5 జీవోలలో జీవో నెంబర్ 21 సెక్యూరిటీ సర్వీసెస్, జీవో నెంబర్ 22 రోడ్, బిల్డింగ్ వర్కర్స్, జీవో నెంబర్ 23 స్టోర్ బ్రేకింగ్ వర్కర్స్, జీవో నెంబర్ 24 కన్స్ట్రక్షన్స్ అండ్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ వర్కర్స్, జీవో నెంబర్ 25 ప్రైవేట్ మోటార్ వర్కర్ ఇట్టి అయిదు జీవోలలో కనీస బేసిక్ వేతనం రూ.18 వేల 19 రూపాయలుగా నిర్ధారించారన్నారు. ఆనాటి నుండి వీడిఏ పాయింట్లు కలుపుకుంటే నేడు అది రూ.22 వేలు అవుతుందన్నారు. ఈ జీవోలను గెజిట్ చేస్తే వీటి ప్రాతిపదికగా మిగతా జీవోలను కూడా సవరిస్తే కార్మిక వర్గానికి ఒక మంచి ఊరట లభిస్తుందన్నారు. ప్రభుత్వం కొన్ని సంవత్సరాలుగా జీవోలను సవరించకుండా కాలం గడపడం సరైంది కాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని



కార్మిక సంఘాల తరఫున ప్రభుత్వానికి విన్నవించినా పెడచెవిన పెట్టిందన్నారు. అందుకే గత ప్రభుత్వాన్ని కార్మిక వర్గం ఇంటికి పంపిందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రహించి తక్షణమే ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చిన ఐదు జీవోలను గెజిట్ చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చిన ఐదు జీవోలను గెజిట్ చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నేడు హైదరాబాదులో ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాలో అన్ని రంగాల కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# శ్రీ రామ నవమి ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలి.

**-భక్తులు ఇబ్బందులు పడకుండా సెక్టార్లో ప్రత్యేక అధికారులు**

**-24 సెక్టార్లుగా విభజించిన కళ్యాణ మండపం**

**-డివిజన్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించిన ఆర్డీవో**



భద్రాచలం, మార్చి 21 (భారతశక్తి): శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం మరియు మహా పట్టాభిషేకం మహోత్సవాలు తిలకించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తమకు అప్పగించిన పనులను ఈనెల 31 వరకు సంబంధిత అధికారులు దిగ్విజయంగా పూర్తి చేసి తమకు కేటాయించిన విధులను పగడ్బందీగా నిర్వహించాలని భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరములో వచ్చేనెల 06, 07 తేదీలలో జరిగే శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణం, పట్టాభిషేకం మహోత్సవాలకు చేపట్టవలసిన కార్యాచరణపై జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సంబంధిత అధికారులతో డివిజన్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లా అధికారులకు ఆదేశించిన మేరకు కళ్యాణ జరుగు మిథిలా స్టేడియంలో కళ్యాణ మండపాన్ని 24 సెక్టార్లుగా విభజించడం జరిగిందని, ప్రతి సెక్టార్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేడుకలు వీక్షించేందుకు భక్తుల పర్యవేక్షణకు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు అన్నారు. గత సమావేశంలో జిల్లా కలెక్టర్ సూచించిన విధంగా ప్రత్యేక అధికారులు భక్తులు ఒక సెక్టార్ నుంచి వేరే సెక్టార్ కి వెళ్లకుండా పటిష్ట భారీకేట్లు ఏర్పాటు చేయాలని అలాగే భక్తులకు ఆన్లైన్ ద్వారా లాడ్జిలు బుక్ చేసుకునే విధంగా సౌకర్యం కల్పించడం జరిగిందని అదేవిధంగా ఆన్లైన్ ద్వారా టికెట్లు విక్రయాలు చేపట్టాలని అన్నారు. సెక్టర్ లో విధుల నిర్వహణకు ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించడం జరుగుతుందని అలాగే ఇప్పటివరకు విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేస్తామని పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు పర్యవేక్షణకు 25 జోన్లుగా విభజించడం జరిగినందున దానికి సంబంధించిన అధికారులను కూడా కేటాయించడం జరిగిందని అన్నారు. అలాగే వచ్చే భక్తులకు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా ముఖ్యంగా మజ్జిగ ప్యాకెట్లు, మంచినీటి సరఫరా విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, దాదాపు 200 మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని మంచినీటి సరఫరా పర్యవేక్షణకు 30 మంది, మంచినీటి పరీక్షలు నిర్వహణకు 12 మంది సిబ్బందిని నియమించినందున ప్రతి సెక్టార్కు మంచినీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేయాలని అన్నారు. అలాగే వాహనాల పార్కింగ్ విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ముఖ్యంగా అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక వాహనాలను ఎస్టీమ్ గిరీష్ పరికరాలను సిద్ధంగా ఉంచాలని, అలాగే రిస్కుటీములను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. భక్తులు గోదారిలోకి వెళ్లకుండా పటిష్ట భారీ ఏర్పాటుతోపాటు నాటు పడవలను గజయితగాళ్లను సిద్ధంగా ఉండేలా సంబంధిత అధికారులు చూసుకోవాలని, అలాగే ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే స్వామివారు కళ్యాణ మండపానికి విచ్చేయుచున్నప్పుడు భక్తుల రద్దీ నియంత్రణకు మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలని అందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, వంతెన పై వాహనాలు ఆగిపోతే తక్షణమే తరలించేందుకు వీలుగా క్రేన్లను సిద్ధంగా ఉంచాలని, 24 గంటలు పని చేయు విధంగా అత్యవసర వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 20 బెడ్లను సిద్ధంగా ఉండేటట్లు చూడాలని, అలాగే ఐసియు వార్డు ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే కళ్యాణం పట్టాభిషేకం వీక్షించడానికి వచ్చే భక్తులకు వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తలంబ్రాల పంపిణీ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని గతం కంటే ఈసారి 60 చొప్పున తలంబ్రాలు, ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేసి తలంబ్రాలు అందరికీ అందే విధంగా చూడాలని, పోలీస్ సహకారంతో మొబైల్ తలంబ్రాల కౌంటర్లు కూడా ఏర్పాట్లు చేయాలని, దేవస్థానం ఈవో కి ఆదేశించారు. భక్తులకు సమగ్ర సమరచారము అందించేందుకు 25 సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిపిఆర్ఓ కు ఆదేశించారు. సంబంధిత అధికారులు సీతారామచంద్రస్వామి కళ్యాణము మరియు పట్టాభిషేకము అయిపోయే వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తో పాటు వివిధ శాఖల అధికారులు సిబ్బంది అందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కల్యాణ వేడుకలు విజయవంతం అవ్వడానికి కృషి చేయాలని ఆయన అన్నారు. పర్ణశాలలో కూడా జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం వేడుకలను కూడా సంబంధిత అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, పర్ణశాల వెళ్లే దారిలో తూరుబాక వద్ద బ్రిడ్జి పనులు నడుస్తున్నందున భక్తుల వాహనాలు వెళ్లే విధంగా తాత్కాలికంగా రోడ్డు సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో రమాదేవి, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, భద్రాచలం తాసిల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఈ ఈ రాంప్రసాద్, వివిధ మండలాల తాసిల్దారులు, ఎంపీడీవోలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీలో చేరిక



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మార్చి 21: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన అందిస్తూ అనేక సంక్షేమ పథకాలు తీసుకువస్తూ పేద ప్రజలకు, విద్యార్థిని విద్యార్థులకు అండగా ఉంటూ దేశంలోనే మొట్టమొదటిసారి స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్తుకై అనేక రకాలుగా కృషి చేస్తున్నందుకు ఆకర్షితులై ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ నాయకత్వంలో ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు ఏబీవీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఖలీల్, పట్టణ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన సంజయ్, జిల్లా నాయకులు రాజు, కాంగ్రెస్ పార్టీ లో చేరడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రగల్భాలు పలికి నిరుద్యోగులకు మొండి చేయి చూపించారన్నారు. మా ప్రభుత్వం రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు 55 వేల పైచిలుకు ఉద్యోగాలు నియమించామని అన్నారు. పేద ప్రజలకు విద్యార్థులకు అండగా నిలిచే ప్రభుత్వం మన కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. కాంగ్రెస్ విద్యార్థి నాయకులు పార్టీలో చేరటం సంతోషదాయకమని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి విద్యార్థుల్లోకి తీసుకెళ్లాలని వారికి సూచించారు.

# కామారెడ్డి పట్టణం, నియోజకవర్గంలో త్రాగునీటి సమస్యపై అధికారులతో సమీక్షించిన ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ





(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మార్చి 21: ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలతో నీటి సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తో కలిసి కామారెడ్డి పట్టణం, నియోజకవర్గంలో త్రాగునీటి సమస్యపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీటి సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు. త్రాగునీటి సమస్య పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్యలు ఉత్పన్నం కాకముందే ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. కామారెడ్డి మున్సిపల్ ఏరియాలో అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా చేపడుతున్న పనులపై ఆయన సమీక్షించారు. మిషన్ భగీరథ ద్వారా చేపట్టే పైప్ లైన్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఏరియాలో రోజుకు రెండు సార్లు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పట్టణంలో 33/11 కే.వి. అండర్ గ్రౌండ్ సబ్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించి కేటాయించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, త్రాగునీటి అవసరాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గ్రామ పంచాయతీ నిధులను వినియోగించుకోవాలని, అవసరమేరకు ఉన్నతాధికారులకు వివరించి నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. మిషన్ భగీరథ పైప్ లైన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. కామారెడ్డి పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, రంజాన్ పండుగ నేపథ్యంలో రోజుకు రెండుసార్లు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పట్టణంలో 33/11 కే.వి. సబ్ స్టేషన్ కోసం అవసరమైన భూమిని గుర్తించాలని అదనపు కలెక్టర్ కు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ రాజేందర్ రెడ్డి, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలు

**-బందోబస్తుతో పోలీసు పహారా, పెట్రోలింగ్**

**-ఫుల్ ఫ్లెజడ్ గా హాజరైన విద్యార్థులు**



మణుగూరు, మార్చి 21 (భారతశక్తి): పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా పది పరీక్షలు శుక్రవారం ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ఉన్న స్కూళ్ల టెన్త్ విద్యార్థులందరికి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ కో ఎడ్యుకేషన్, సత్యభాస్కర, సి ట్రైప్ ఎక్సెంట్, శ్రీ చైతన్య స్కూల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించారు. 9 గంటలకే కేటాయించిన సెంటర్లకు విద్యార్థులు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లతో నిర్ణయిత సమయంలో వచ్చిన విద్యార్థులను హాల్ టికెట్లు చూసి క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోపలికి పంపించారు. విద్యార్థులు హాల్ టికెట్ల నెంబర్లతో కన్ఫ్యూజ్ కాకుండా పరీక్ష కేంద్రాలకు ప్రవేశించే ముందు గేటు వద్ద పరీక్ష సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. మండలం మొత్తం 901 మంది టెన్త్ విద్యార్థులు ఉన్నారు. మొదటి రోజు తెలుగు పేపర్ పరీక్ష కు ఒక్కరూ కూడా గైర్హాజరు కాకుండా అందరూ హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారిణి స్వర్ణ జ్యోతి తెలిపారు. అదేవిధంగా పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డి ఓ, ఏఎన్ఎమ్, కానిస్టేబుల్ ను ఉంచినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, త్రాగునీరు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఐదు పరీక్ష కేంద్రాల వద్ద సిఐ సతీష్ కుమార్, ఎస్ఐ మేడ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మణుగూరు సిఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ టెన్త్ పరీక్ష వ్రాసే విద్యార్థులు ఎలాంటి సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, పర్సులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా సాఫీగా జరగడానికి పోలీసు వారి తరుపు నుండి అన్ని కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, కేంద్రాల సమీపంలో 100 మీటర్ల లోపు ఉన్న జిరాక్స్, ప్రింటింగ్ సెంటర్లు పరీక్ష ముగిసే వరకు మూసివేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఉదయం 9:30 కి మొదలైన పరిక్ష మధ్యాహ్నం 12:30 కి ప్రశాంతంగా ముగిసిందన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షన్ ఆర్గానిక్ వేస్ట్ ను ప్రారంభించిన కలెక్టర్

**ప్రదర్శనను తిలకించిన జిల్లా కలెక్టర్ పమేలా స**





కరీంనగర్, మార్చి 21(భారత శక్తి):స్వచ్ఛ సర్వేక్షన్ లో బాగంగా కరీంనగర్ లోని కళాభారతీ ఆడిటోరియంలో ఆర్గానిక్ వేస్ట్ మేనేజ్మెంట్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనను శుక్రవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంబించారు.ప్రతి ఇంటి నుండి వెలువడే ఆహార వ్యర్థాలు, తడి, పొడి చెత్తను ఎరువుగా మార్చే యంత్రాలు, పరికరాలను ఇక్కడ ప్రదర్శించారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చెత్తను ఎరువుగా మార్చే పరికరాల గురించి వివరించారు. జిల్లా కలెక్టర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి పమేలా సత్పతి ఈ ప్రదర్శనకు హాజరయ్యారు. ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. పి.పి.టి ప్రదర్శనను లైవ్ డెమోను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి తోపాటు అపార్ట్మెంట్ల నుండి వెలువడే ఆహార వ్యర్థాల ద్వారా చిన్న పరికరాలతో ఎటువంటి ఖర్చు లేకుండా చెత్తను ఎరువుగా మార్చవచ్చని అన్నారు. వచ్చిన ఎరువును మొక్కల సంరక్షణకు వినియోగించుకోవచ్చని, తద్వారా ప్రకృతిని సంరక్షించిన వారమవుతామని అన్నారు. వివిధ ప్రాంతాల్లో చెత్తను ఎరువుగా మారుస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ వాజ్పేయి పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy